


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


కర్రెగుట్ట కొండల్లో పోలీసుల అలజడి

2023 నుంచి బాంబులపై 'ఉమర్' ప్రయోగాలు

పూర్తి నిర్ణయం 'హైకమాండ్‌దే..' 05


సంపుటి 08, సంచిక: 353 | సోమవారం | 24-11-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## నూతన సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం

**న్యూఢిల్లీ :** భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్య కాంత్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జమ్మూకశ్మీర్ ప్రత్యేక హోదాను తొలగించే ఆర్టికల్ 370 రద్దు, బిహార్ ఓటర్ల జాబితాల సవరణ, పెగాసస్ స్పైవేర్ కేసు వంటి అనేక కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామిగా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ పదవీ కాలం ఆదివారం ముగిసింది. ఆయన స్థానంలో సోమవారం సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సూర్యకాంత్ అక్టోబరు 30న తదుపరి సిజెఐగా నియమితులయ్యారు. పదవీ ప్రమాణం చేసిన నాటి నుంచి 15 నెలల పాటు పదవిలో కొనసాగనున్నారు. 65 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత ఆయన ఫిబ్రవరి 9, 2027న పదవీ విరమణ చేయనున్నారు. ఫిబ్రవరి 10, 1962న హర్యానాలోని హిసార్ జిల్లాలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన జస్టిస్ కాంత్, ఒక చిన్నపాటి పట్టణంలో న్యాయవాది నుండి దేశంలోని అత్యున్నత న్యాయ కార్యాలయానికి చేరుకున్నారు. జాతీయ ప్రాముఖ్యత, రాజ్యాంగ విషయాలకు సంబంధించిన అనేక తీర్పులు, ఆదేశాలలో తరువాయి 2లో

## అంధ అమ్మాయిలు అదరహో..

### తొలిసీజన్ టి20 వరల్డ్ కప్ విజేత భారత్

భారత మహిళా క్రికెటర్లు మరో ఐసిసి ట్రోఫీని అందుకున్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన వన్డే ప్రపంచ కప్‌ను సగర్వంగా ముద్దాడి నెల దాటక ముందే అంధ మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. టి20 వరల్డ్ కప్ తొలి సీజన్‌లోనే ఛాంపియన్‌గా అవతరించింది. టోర్నీ ఆసాంతం గొప్పగా ఆడిన టీమిండియా ఆదివారం ఫైనల్లో నేపాల్‌ను చిత్తు చేసింది. ప్రత్యర్థిని 114కే కట్టడి చేసిన భారత్.. 13 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఓపెనర్ ఫులా సరేన్ (44) దంచేయగా అలవోక విజయంతో కప్‌ను పట్టేసింది దీపికా టిసి బృందం. అంధ మహిళల టి20 ప్రపంచ కప్‌ను భారత జట్టు కొల్లగొట్టింది. కొలంబోలోని సరా ఓవల్ మైదానంలో చెలరేగిన టీమిండియా భారీ విజయంతో తొలి విజేతగా అవతరించింది. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్ ఫైనల్లోనూ అదే జోరు చూపించి నేపాల్‌ను వణికించింది. టాస్ గెలిచిన కెప్టెన్ నేపాల్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బౌలర్లు విజృంభించగా ప్రత్యర్థిని 114కే పరిమితం చేసింది. అనంతరం ఛేదనలో భారత బ్యాటర్లు దంచేశారు. ఓపెనర్ ఫులా సరేన్ (44) మెరుపులతో పది ఓవర్లకే స్కోర్ వంద దాటింది. మరో మూడు ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకున్న భారత్.. 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఆరంభం నుంచి తొలిసీజన్ ఛాంపియన్‌గా రికార్డు నెలకొల్పింది. ధనాధన్ ఆటతో జట్టు విజయంలో కీలకమైన ఫులా సరేన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు 'అంతర్జాతీయ' ఏర్పాట్లు

సిజెఐ ప్రమాణస్వీకారానికి ముఖ్యమంత్రి 02

- విదేశీ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు
- పాసులు లేకుండా సమ్మిట్‌కు ఎవరినీ రానివ్వొద్దు
- సంబంధిత అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి సూచన
- భారత ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తం గా ప్రతినిధులు హాజరవుతారని, వివిధ దేశాల అంబాసిడర్లు కూడా పాల్గొనే అవకాశం ఉందని, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 తేదీలలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆదివారం పలువురు మంత్రులు, వివిధ శాఖల అధికారులతో తరువాయి 2లో



## సిఎం, మంత్రుల వాట్సాప్, మీడియా గ్రూప్‌లు హ్యాక్




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో మరోసారి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఏకంగా సిఎంఒ వాట్సాప్ గ్రూప్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులకు చెందిన వాట్సాప్ మీడియా గ్రూప్‌లను హ్యాక్ చేశారు. ఎస్‌బిఐ బ్యాంక్ ఆధార్ అప్డేషన్ పేరుతో ప్రమాదకర ఎపికె ఫైల్స్ ను షేర్ చేసిన కేటుగాళ్లు.. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటూ సందేశాలు పంపిస్తున్నారు. మరో వైపు ఎపికె ఫైల్స్ ను ఓపెన్ చేయవద్దని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన వారికి సంబంధించిన వాట్సాప్ మీడియా గ్రూప్ లను సైబర్ నేరగాళ్లు లక్ష్యం చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కాగా 8 రోజుల క్రితమే తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వెబ్ సైట్ హ్యాక్‌కు గురైన సంగతి తెలిసిందే. కోర్టు ఆర్డర్ కాపీలు డౌన్ లోడ్ చేస్తుండగా గేమింగ్ సైట్ లోకి డైరెక్షన్ చేశారు. దీంతో తెలంగాణ డిజిపికి హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు.



## 'సర్'..పౌరులపై ఉద్దేశపూర్వక కుట్ర

- నోట్లరద్దు, కొవిడ్ లాక్‌డౌన్‌ను గుర్తుకు తెస్తోంది
- బిఎల్‌ఒల మరణాలపై కాంగ్రెస్ మండిపాటు బిజెపిపై విమర్శలు

**న్యూఢిల్లీ :** సర్‌లో నిర్వహణలో ఒత్తిడి తట్టుకోలేక వివిధ రాష్ట్రాల్లో కొంతమంది బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్‌ఒ) మృత్యువాత పడుతుండడపై బిజెపిపై కాంగ్రెస్ మండిపడింది. పని భారం బిఆల్‌ఒలను, పోలింగ్ అధికారులను ఆత్మహత్యలకు పురిగొల్పుతుందని ఆరోపించింది. సర్‌ను తొందరపాటుగా అమలు చేయడం, నోట్ల రద్దు, కొవిడ్‌లో లాక్‌డౌన్ వంటి ఘటనలను గుర్తుకు తెస్తుందని పేర్కొంది. ఈ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా అణచివేత, పౌరులను వేధిస్తున్న కుట్ర అని అభివర్ణించింది. అనవసరమైన ఒత్తిడి కారణంగా బూత్ స్థాయి అధికారుల మరణాలను 'అనుషంగిక నష్టం'గా విస్మరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. సర్ పేరుతో దేశవ్యాప్తంగా గందరగోళం సృష్టిస్తున్నాని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఫలితంగా మూడు వారాల్లో పదహారు బిఎల్‌ఒలు ప్రాణాలు కోల్పోయారని, తరువాయి 2లో

## 'చండీగఢ్ బిల్లు'పై వెల్లువెత్తిన వ్యతిరేకత

పార్లమెంట్ సమావేశాల్లో చండీగఢ్‌పై ఎలాంటి బిల్లు ప్రవేశపెట్టడం లేదు : కేంద్రం స్పష్టీకరణ 05

## సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి పోరాటం

- సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం
- సింగరేణి కార్మిక కుటుంబాల సమ్మేళనంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/పెద్దపల్లి

సింగరేణిలో 1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ని ఏర్పాటు చేసి అనేక కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటాలు నిర్వహించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు . శేషగిరిరావు, మఖ్దూం మోహియోద్దీన్ , సర్వదేవబట్ల రామనాథం, నల్లమల్ల గిరి ప్రసాద్, మనుబోతుల కొమరయ్య, విఠల్ రావు లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధులు యూనియన్ ను స్థాపించి కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని, కామ్రేడ్ భాస్కరరావు, కత్తుల కొమురయ్య, చంద దుర్గయ్య, పి. నరసయ్య, వి.టి. అబ్రహం లాంటి కార్మిక నాయకులు ప్రాణ త్యాగం చేశారని, త్యాగాల చరిత్ర కలిగిన యూనియన్ ఎఐటియుసి తప్ప మరొకటి లేదని ఆయన తెలిపారు. యూనియన్ శ్రేణులంతా పార్టీలో మమేకమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి),అర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్మిక కుటుంబాల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా తరువాయి 12లో



## లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాల్సిందే

### సంయుక్త కార్మిక సంఘాలు డిమాండ్ 26న 'కార్మికుల నిరసన గళం' పేరుతో ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్పొరేట్ శక్తులకు మేలు కలిగేలా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన ఇందిరాపార్కు వద్ద 'కార్మికుల నిరసన గళం' పేరుతో సంయుక్త రైతు సంఘాలతో కలిసి అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి.ఈ మేరకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ అధ్యక్షతన ఆదివారం కార్మిక సంఘాల సంయుక్త సమావేశం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, కనీస వేతనాల సలహా మండలి బోర్డు చైర్మన్ జనకప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు క్రిష్ణ, విజయ్, ఎఐయుటియుసి రాష్ట్ర నాయకులు భరత్‌లు హాజరై కోడ్‌ల రద్దుకై అవలంబించాల్సిన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 4 కార్మిక కోడ్‌లను కార్మికుల సంక్షేమానికి తెస్తుందని పత్రికల్లో మోసపూరితమైన ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు రాత్రిపూట డ్యూటీ చేసుకునే అవకాశం కల్పించామని, గత చట్టాల్లో ఉన్న కొన్ని అంశాలను కోడ్‌లలో పొందుపరిచామని గర్వంగా చెప్పుకుంటున్నారని, వీటిని కార్మికవర్గం తరువాయి 2లో

## ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలు ఇకపై 'ఒక అవసరం'

- జొహన్నెస్‌బర్గ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ
- భారతదేశం-బ్రెజిల్-దక్షిణ ఆఫ్రికా నాయకుల జి-20 సదస్సులో కీలక ప్రసంగం



**జొహన్నెస్‌బర్గ్ :** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణలు ఇకపై ఒక ఎంపిక కాదు కానీ..'ఒక అవసరం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. భారతదేశంబ్రెజిల్‌సౌత్ ఆఫ్రికా (ఐబిఎస్‌ఎ) త్రికోణం ప్రపంచ పాలనా సంస్థల్లో మార్పులకు స్పష్టమైన సందేశాన్ని పంపాలని నొక్కిచెప్పారు. ఆదివారం ఐబిఎస్‌ఎ నాయకుల శిఖరాగ్ర సమావేశం ఇక్కడ జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ప్రపంచం ముక్కలుగా, విభజించబడినట్లు కనిపిస్తున్న సమయంలో ఐబిఎస్‌ఎ ఐక్యత సహకారం, మానవత్వం యొక్క సందేశాన్ని అందించగలదని ఉద్ఘాటించారు. ఈ మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడానికి ఐబిఎస్‌ఎ ఎన్‌ఎస్‌ఎ స్థాయి సమావేశాన్ని సంస్థాగతీకరించాలని కూడా ప్రధానమద్రేంద్రమోదీ ప్రతిపాదించారు. ఉగ్రవాదంపై పోరాటంలో మనం సన్నిహిత సమన్వయంతో ముందుకు సాగాలి. ఇటువంటి తీవ్రమైన అంశంపై ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలకు చోటులేదని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా హాజరైన సమావేశంలో తరువాయి 12లో

## టీచర్ల మెడపై టెట్ కత్తి


- సుప్రీంకోర్టు తీర్పుతో ఆందోళన
- ఉద్యోగ భద్రతపై గుబులు
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తులు

ప్రజాపక్షం/హనుమకొండ

విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు కొత్త సమస్య వచ్చి పడింది. ఇటీవలి కాలంలో సుప్రీం కోర్టు పెట్టిన నిబంధన కారణంగా ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. పీఈటీలు, పీడీలు మినహా మిగిలిన వారందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్)లో ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇన్ సర్వీసు లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తంటా తప్పడం లేదని వాపోతున్నారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు మినహా మిగతా ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత సాధించాలని పేర్కొనడంతో



ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. పంతుళ్ల పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరిగా మారడంతో ఉపాధ్యాయ లోకం కలవరపడుతోంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో టెట్ హాట్ టాపిక్‌గా తరువాయి 2లో




## చిక్కిన చీటింగ్ దంపతులు

### ఎస్‌ఐకి రూ.2 కోట్ల లంచం ఇచ్చి తప్పించుకున్న వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఓ డాక్టర్ కుటుంబం నుంచి రూ.23 కోట్లు వసూలు చేసి పరారైన దంపతులను సిసిఎస్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి జైలుకు తరలించారు. పదిహేను రోజుల క్రితం ఇదే దంపతులను కర్నాటకలో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐకి రూ.2 కోట్లు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఎన్‌పిపి ప్రభుత్వాన్ని కూల్చేస్తాం : రాజపక్సే



**కొలంబో :** ఎన్నికల హామీల అమలులో ఎన్‌పిపి ప్రభుత్వం విఫలమైందని శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహీంద్ర రాజపక్సే నేతృత్వ ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శించారు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నామని, అది లభించిన మరుక్షణం దిసనాయకే నేతృత్వంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించారు. 2024లో భారీ మెజారిటీతో ఎన్‌పిపి అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకుంది. అనేక మందిని జైళ్లకు పంపింది. దీంతో ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలను రాజపక్సే వర్గీయులు చేస్తున్నారు. కొలంబో శివార్లలో ఇటీవల భారీ సభ నిర్వహించారు. ఎన్‌పిపి ప్రభుత్వాన్ని కూల్చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ రాజపక్సే కుటుంబ వారసుడు నమల్ రాజపక్సే (39) ఉద్ఘాటించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

### ఉక్రేన్‌కు ఇదేమీ...
# చివరి ప్రతిపాదన కాదు

రష్యాతో పోరాడగల సమర్థుడు జెలెన్స్కీ : ట్రంప్



**వాషింగ్టన్ :** రష్యా ఉక్రేన్ యుద్ధాన్ని ముగించడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే 28 అంశాలతో శాంతి ప్రణాళికను ప్రతిపాదించారు. అయితే ఇది ఉక్రేన్ కంటే రష్యాకు ఎక్కువ ప్రయోజనం కలిగించేదిగా ఉన్నట్లు పెద్ద చర్చ జరుగుతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ఇదే మాట అన్నారు. ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. శాంతి ప్రణాళికను సవరించకుండా అంగీకరిస్తే తమ దేశం సార్వభౌమత్వాన్ని కోల్పోతుందని, అవసరమైతే అమెరికాతో దోస్తీ వదులుకోవడం కూడా సమ్మతమేనని జెలెన్స్కీ అన్నారు. అటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చర్చలకు సిద్ధమని చెప్పారు. ఉక్రెయిన్ నిరాకరిస్తే మాత్రం దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ ఒప్పందంపై చర్చలు క్రమంలో ట్రంప్ స్పందిస్తూ ఏదో ఒకవిధంగా ఈ యుద్ధం ఆగాలనే ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఉక్రేన్‌కు తమ వైపు నుంచి ఇదేమీ చివరి ప్రణాళికకు కాదని ట్రంప్ తెలిపారు. శాంతి ప్రణాళిక ఆమోదించడం కోసం ఉక్రేన్‌కు ఆయన ఈనెల 27వ తేదీ వరకు గడువు విధించిన క్రమంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇది చివరి ప్రతిపాదన కాదు అని స్పష్టంచేశారు. జెలెన్స్కీకి పుతిన్‌తో పోరాడే సామర్థ్యం ఉందని, ఏదో ఒకవిధంగా యుద్ధాన్ని ముగించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనను మెరుగుపరిచేందుకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీతో పాటు ఉక్రేన్‌కు చెందిన సీనియర్ భద్రతాధికారులు జెనీవాలో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. యుద్ధం ముగించడానికి అవసరమైన చర్యలపై తమ భాగస్వాములతో చర్చలు జరిపినట్లు జెలెన్స్కీ ఇప్పటికే తెలిపారు. ఉక్రేన్ జాతీయ ప్రయోజనాలను కాపాడటంతో పాటు రష్యా దాడికి పాల్పడకుండా చర్యలపై మాట్లాడినట్లు వెల్లడించారు. శాంతి చర్చలతో యుద్ధానికి తెరదించాలని భావిస్తున్నట్లు జెలెన్స్కీ తెలిపారు.

### ట్రంప్‌పై ఆగ్రహం..ప్రతినిధుల సభకు
# రిపబ్లికన్ నేత రాజీనామా



**వాషింగ్టన్ :** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవమానించారంటూ రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ గ్రీన్ ఆరోపించారు. అమెరికా ప్రతినిధుల సభకు రాజీనామా ప్రకటించారు. గతంలో మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్ (మగా) కోసం బలంగా గళం వినిపిస్తూ, ట్రంప్‌కు మద్దతు ఇచ్చిన గ్రీన్ ఇప్పుడు ట్రంప్ తీరుపై గుర్రుగా ఉన్నారు. జార్జియా నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికైన తాను సామాన్యుల ప్రతినిధిగా ఉన్నందునే ట్రంప్ తనను అవమానించారని సామాజిక మాధ్యమంలో ఆగ్రహం వ్యక్తంచేశారు. లైంగిక కేసులో నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాల విడుదలకు ట్రంప్ ఉత్తర్వులు ఇవ్వడాన్ని గ్రీన్ వ్యతిరేకించారు.
'సంపన్నులు, సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అయ్యే వారి చేతిలో అక్రమ రవాణాకు గురైన వారి కోసం, 14 ఏళ్లలో లైంగిక దాడికి గురైన వారి కోసం నిలబడ్డాను. అలాంటి నన్ను ద్రోహి అన్నారు. బెదిరించారు' అని ట్రంప్ తీరును ఆక్షేపించారు. తాను మద్దతు ఇచ్చిన వ్యక్తే ఆరోపణలు చేస్తూ అవమానించారని రాజీనామా లేఖలో పేర్కొన్నారు.
గాజాపై ఇజ్రాయిల్ దాడిని మారణహోమంగా ఆమె గతంలో విమర్శించినప్పుడు... ట్రూత్ సోషల్‌లో గ్రీన్‌ను కించపరిచే పోస్టులు పెట్టారు. ఇప్పుడు ఆమె రాజీనామా ప్రకటనపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇది దేశానికి గొప్ప వార్త అని ఆయన వ్యాఖ్యానించారు.

## సిలిండర్ పేలి మహిళ మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రహమత్‌నగర్‌లోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో సోను సింగ్ (36) అనే మహిళకు తీవ్ర కాలిన గాయాలై మృతి చెందింది. మరో వ్యక్తి గోపాల్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్దేశపూర్వక కుట్ర
(మొదటి పేజీ తరువాయి)

గుండెపోటు, ఒత్తిడి, ఆత్మహత్య చేసుకున్నారని, సర్ సంస్కరణ కాదు, ఇది విధించబడిన అణచివేత అని ఆయన ఎక్స్‌లో హిందీలో పోస్ట్‌లో చేశారు. పౌరులు తమ పేర్లను కనుగొనడానికి 22 ఏళ్ల పాత ఓటరు జాబితాల్లో వేలల్లో స్కాన్ చేసిన పేజీలను జల్లెడ పట్టాల్సిన వ్యవస్థను భారత ఎన్నికల కమిషన్ సృష్టించిందని విమర్శించారు. 'లక్ష్యం స్పష్టంగా ఉంది: నిజమైన ఓటర్లను అలసిపోయేలా చేయడం, దీంతో ఓటర్ల మోసాన్ని నిరంతరాయంగా కొనసాగడానికి అనుమతించడమేనని పేర్కొంది. భారతదేశం ప్రపంచానికి అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తుంది, కానీ భారత ఎన్నికల కమిషన్ ఇప్పటికీ ఆటవిక కాగితపు పనిని సృష్టించడంలో ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ బిజెపి 'ఓట్ చోరీ' ఇప్పుడు ఘోరమైన మలుపు తీసుకుందని అన్నారు. 19 రోజుల న్నికల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సమయంలో 16 బిఎల్‌ఓలు మరణించారని పేర్కొన్న మీడియా నివేదికను ఖర్గే ఎక్స్‌లో పంచుకున్నారు. పనిభారం బిఎఒలను, పోలింగ్ అధికారులను ఆత్మహత్యకు బలవంతం చేస్తోందని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. 'ప్రియమైన వ్యక్తిని కోల్పోయిన ప్రతి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. గ్రౌండ్ రియాలిటీ ఆధారంగా, ఈ సంఖ్య నివేదించబడిన దానికంటే చాలా ఎక్కువ, ఇది చాలా ఆందోళనకరమైనది. ఈ కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారు?' ఖర్గే తన పోస్ట్‌లో హిందీలో ప్రశ్నించారు. బిజెపి దొంగిలించబడిన అధికార ఫలాలను అనుభవిస్తోందని, ఎన్నికల కమిషన్ మూగ ప్రేక్షకుడిలా చూస్తోందని మండిపడ్డారు. సర్ తొందరపాటు, ప్రణాళిక లేని బలవంతపు అమలు నోట్ల రద్దు, కొవిడ్ లాక్‌డౌన్‌ను గుర్తుకు తెస్తుందని ఖర్గే పేర్కొన్నారు. బిజెపి అధికార దాహం సంస్థలను బలవంతంగా ఆత్మహత్యలకు, రాజ్యాంగాన్ని ముక్కలు చేయడానికి, అధికార దుర్వినియోగం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి ప్రేరేపిస్తోందని ఆయన ఆరోపించారు. 'ఇక చాలు! ఇంకా మేల్కొనకపోతే, ప్రజాస్వామ్య చివరి స్తంభాలు కూలిపోకుండా ఎవరూ రక్షించలేరు. ఎస్ఐఆర్, ఓటు దొంగతనంపై మౌనంగా ఉన్నవారు ఈ అమాయక బిఎల్‌ఒల మరణాలకు బాధ్యులు. మీ గొంతు ఎత్తండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి!' ఖర్గే పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఓ)గా పనిచేస్తున్న ఒక మహిళ శనివారం తన నివాసంలో ఉరివేసుకుని కనిపించారు. ఆమె ఎస్ఐఆర్ పని సంబంధిత ఒత్తిడిలో ఉందని, అందువల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు చెప్పారని పోలీసులు తెలిపారు. బిఎల్‌ఓ మరణంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది 'ఇప్పుడు నిజంగా ఆందోళనకరమైనదన్నారు. అలాగే సర్ కోసం ఓటరు జాబితా సర్వే నిర్వహించే ఇద్దరు టీచర్లు కమ్ బిఎల్‌ఒలు శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని రైసెన్, దామో జిల్లాల్లో అనారోగ్యంతో మరణించారని అధికారులు తెలిపారు.

## చీటింగ్ దంపతులు
(మొదటి పేజీ తరువాయి)

లంచం ఇచ్చి తప్పించుకున్నారు. ఈ ఘటనతో పోలీసు శాఖ ఉలిక్కిపడింది. దీంతో రంగంలోకి దిగిన సిసిఎస్ పోలీసులు ఎట్టకేలకు చీటర్ దంపతులను పట్టుకోవడంలో సఫలం చెందారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.రంగారెడ్డి జిల్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పి.వినయ్‌కుమార్ తన కుటుంబ సభ్యుల పేర్లపై రెండు సంస్థల్లో రూ.23 కోట్లు డిపాజిట్ చేశారు. సదరు సంస్థ నిర్వాహకులు డిపాజిట్లను కొల్లగొట్టారు. దీంతో నష్టపోయామని గ్రహించిన బాధిత డాక్టర్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంస్థ నిర్వాహకులైన దంపతులు వుప్పలపాటి సతీష్ కుమార్, శిల్పా బండలపై కేసు నమోదు చేశారు.పరారీలో ఉన్న ఈ దంపతులను పట్టుకునేందుకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఇటీవలే కర్ణాటకలో అదుపులోకి తీసుకున్నాడు. అయితే నిందితులు రూ.2 కోట్లు ఎస్ఐకి లంచం ఇవ్వడంతో వారిని వదిలిపెట్టాడు ఎస్ఐ. టీ తాగుతుండగా నిందితులు తప్పించుకున్నారని ఉన్నతాధికారులను ఎస్ఐ తప్పుదారి పట్టించాడు. అతని వాంగ్మూలంపై విచారణ చేయగా అసలు విషయం తెలిసింది. దీంతో సదర్ ఎస్ఐని కమిషనర్ సజ్జనార్ సస్పెండ్ చేశారు. ఇక పరారీలో ఉన్న చీటర్ దంపతులను పట్టుకునేందుకు సిసిఎస్ ఇఒడబ్ల్యూ టీం4 సిఐ సి.పరుశురాం రంగంలోకి దిగారు. తన సిబ్బంది సహాయ సహకారాలతో కర్ణాటకలో వారం రోజులు మకాం వేసి చాకచక్యంగా చీటర్ దంపతులను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తీసుకువచ్చారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిందితులను త్వరలో పోలీసు కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# చలికాలపు రహదారి భద్రతకు 'అరైవ్ అలైవ్'

సూచనలు జారీ చేసిన తెలంగాణ పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ముఖ్యంగా చలి కాలంలో పొగమంచు కారణంగా సంభవించే ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన కీలక సూచనలను పోలీస్ శాఖ ప్రకటన ద్వారా ఆదివారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ రాష్ట్రంలో రహదారి భద్రతను పెంపొందించే లక్ష్యంతో 'అరైవ్ అలైవ్' పేరుతో ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. చలికాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు, ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు, జంతువులు, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా కనిపించవు. ముందున్న వాహనం లేదా ఆగి ఉన్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో, డ్రైవర్లు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ సూచించింది.

**చలి కాలంలో డ్రైవర్లు తీసుకోవలసిన కీలక జాగ్రత్తలు**

* గమ్యస్థానానికి చేరుకోవాల్సిన సమయాన్ని దృష్టిలో ఉంచుకొని, నిర్ణీత సమయం కంటే కొద్దిగా ముందుగానే బయలుదేరండి. తొందరపాటును నివారించడం ద్వారా డ్రైవింగ్ పై ఏకాగ్రత పెరుగుతుంది.
* ముందున్న వాహనాలు, రోడ్డు స్పష్టంగా కనిపించనందున అతివేగం, ఓవర్ అత్యంత ప్రమాదకరం. వేగంగా వెళ్లడం వలన వాహనం నియంత్రణ (కంట్రోల్) తప్పే ప్రమాదం ఉంది. ఓవర్ చేసేటప్పుడు ఎదురుగా ఉన్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టం.
* పొగమంచులో హైబీమ్ లైట్ల నుండి వచ్చే కాంతి విచ్చిన్నమై, ఎదురుగా చూడటం మరింత కష్టమవుతుంది. కాబట్టి, తప్పనిసరిగా లోబీమ్ హెడ్‌లైట్లను మాత్రమే వాడండి. ఫాగ్ లైట్లు ఉన్న యెడల, వాటిని కూడా ఉపయోగించాలి. ఇది మీ వాహనం ఎంత దూరంలో ఉందో ఇతరులకు స్పష్టంగా తెలుపుతుంది.
* ముందు ఉన్న వాహనానికి, మీ వాహనానికి మధ్య తగినంత సురక్షిత దూరాన్ని ఉంచండి. దీని వలన ముందు వాహనం సడన్ బ్రేక్ వేసినా, అంచనా తప్పినా దాన్ని ఢీకొట్టకుండా నివారించవచ్చు.
* ఇష్టం వచ్చినట్లు లేన్ క్రమశిక్షణ లేకుండా నడపడం వలన ముందున్న వాహనాలను గుర్తించడం కష్టమవుతుంది. నిర్దేశించబడిన లేన్లలో మాత్రమే వాహనాన్ని నడపండి.

వాహనాన్ని నడిపేటప్పుడు కిటికీ అద్దాలను కొద్దిగా దించడం వలన (పాక్షికంగా తెరవడం), పొగమంచు ఒకేదగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నమవుతుంది. దాని వలన డ్రైవర్ దృష్టి మెరుగు పడుతుంది.

* కొన్నిసార్లు పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ముందు ఉన్న వాహనాలు, రోడ్డు సరిగ్గా కనిపించకపోతే, గమ్యస్థానానికి వెళ్లాలనే తొందరలో తప్పులు చేయకుండా, సురక్షిత ప్రదేశంలో కాసేపు వాహనాన్ని ఆపివేసి, మళ్లీ ప్రయాణం కొనసాగించండి.
* పొగమంచు అద్దాలను కవర్ చేయడం వలన డ్రైవర్ దృష్టి తగ్గుతుంది. మీ వాహనం ముందు, వెనుక కిటికీ అద్దాలను శుభ్రంగా ఉంచుకోండి.
* మీరు ఎటువైపు వెళుతున్నారో వెనుక వచ్చే వాహనానికి ముందుగానే తెలిసేలా ఇండికేటర్లను ముందుగా ఉపయోగించండి.

వెనుక వచ్చే డ్రైవర్లకు నిర్ణయం తీసుకోవడానికి తగినంత సమయం ఇచ్చేలా సంకేతం అందించండి.

* చలికాలంలో రోడ్డు తడిగా ఉండి, వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఎక్కువ. బ్రేకులను నెమ్మదిగా, జాగ్రత్తగా అప్లై చేయండి. సడన్ బ్రేకులు వేయడం వలన వాహనం అదుపు తప్పే ప్రమాదం ఉంది. నిర్దిష్టమైన వేగంతో వాహనాలను నడపడం ద్వారా స్కిడ్ కాకుండా నివారించవచ్చు.

## టెట్ కత్తి
(మొదటి పేజీ తరువాయి)




మారింది. టెట్‌లో అర్హత సాధించాలనే నిబంధనల నేపథ్యంలో ఉద్యోగ భద్రతపై ఉపాధ్యాయులు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. ఎప్పుడో చదివి డీఎస్సీ రాసి అర్హత సాధించి ఉద్యోగంలోకి వచ్చిన వారికి ఇప్పుడు టెట్ అర్హత విధించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికే పదోన్నతులు లేకుండా చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత అనే విషయం ఆందోళన కలిగిస్తోంది. కొత్త సిలబస్ ప్రకారం పాత తరం ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం కష్టతరమేనని, వారికి ఇక పదోన్నతులు రాకపోవడం పక్కనబెడితే, ఉద్యోగంలో ఉంచుతారా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 90 శాతానికి పైగా...**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో పిఇటిలు, పీడిలు మినహా, 2010 తర్వాత ఉద్యోగం సాధించిన వారు పోను దాదాపు 90 శాతం మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాల్సి ఉందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. టెట్ లో అర్హత సాధించాలంటే పరీక్షలో కేటగిరీల వారీగా ఒబిసిలకు 90 శాతం, బిసిలకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీలు 60 శాతం మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్కుల శాతం సైతం ఉపాధ్యాయులకు నిద్రపట్టనివ్వడం లేదని వాపోతున్నారు. గతంలో టెట్ పాసైతేనే పదోన్నతి పొందుతారని ఉండేది. ఇప్పుడు ఏకంగా టెట్ అర్హత సాధించకపోతే ఉద్యోగం ఉండదనే ఉత్తర్వులు ఉపాధ్యాయులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

**ఉపాధ్యాయ సంఘాల ఆందోళన :** ఈ నిబంధనపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ అర్హత నుంచి మినహాయింపును ఇవ్వాలని ఎన్సీటీఈకి వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రభుత్వమే చొరవ చూపి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం తమ ఆందోళనను అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం
(మొదటి పేజీ తరువాయి)

భాగమయ్యారు. 2011లో కురుక్షేత్ర విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీలో 'ఫస్ట్ క్లాస్ ఫస్ట్'గా నిలిచిన ఘనత కూడా ఆయనకు ఉంది. పంజాబ్, హర్యానా హైకోర్టులో అనేక ముఖ్యమైన తీర్పులను రాసిన జస్టిస్ కాంత్, అక్టోబర్ 5, 2018న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదవీకాలంలో ఆర్టికల్ 370 రద్దు, వాక్ స్వాతంత్ర్యం, పౌరసత్వ హక్కులపై తీర్పులతో గుర్తింపు లభించింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పరిష్కరించడంలో గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై ఇటీవల వెల్లడైన తీర్పులో కూడా ఆయన భాగస్వామిగా ఉన్నారు. ప్రభుత్వం సమీక్షించే వరకు దాని కింద కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకూడదని ఆదేశించి, వలసరాజ్యాల కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేసిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. హిహార్‌లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) చేపట్టాలనే పోల్ ప్యానెల్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్నప్పుడు, బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా నుండి మినహాయించబడిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని జస్టిస్ కాంత్ ఎన్నికల సంఘాన్ని కోరారు. అట్టడుగు ప్రజాస్వామ్యం, లింగ న్యాయాన్ని నొక్కి చెప్పిన ఒక ఉత్తర్వులో, చట్టవిరుద్ధంగా పదవి నుండి తొలగించబడిన మహిళా సర్పంచ్‌ను తిరిగి నియమించిన ధర్మాసనానికి ఆయన నాయకత్వం వహించారు. ఈ విషయంలో లింగ పక్షపాతాన్ని విమర్శించారు.
సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని ఆదేశించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటన సందర్భంగా జరిగిన భద్రతా ఉల్లంఘనను దర్యాప్తు చేయడానికి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీని నియమించిన ధర్మాసనంలో జస్టిస్ కాంత్ ఒకరు. రక్షణ దళాల కోసం వన్ ర్యాంక్‌వన్ పెన్షన్ పథకాన్ని ఆయన సమర్థించారు. ఇది రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అయ్యేదని, శాశ్వత కమిషన్‌లో సమానత్వం కోరుతూ సాయుధ దళాలలో మహిళా అధికారుల పిటిషన్లను విచారించడం కొనసాగిస్తున్నారు. 1967 అలీఘఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ తీర్పును కొట్టివేసిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ కాంత్ ఉన్నారు. ఇది సంస్థ యొక్క మైనారిటీ హోదాను పునఃపరిశీలించడానికి మార్గం చూపించింది. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన, చట్టవిరుద్ధమైన నిఘా ఆరోపణలను దర్యాప్తు చేయడానికి సైబర్ నిపుణుల ప్యానెల్‌ను నియమించిన బెంచ్‌లో ఆయన కూడా ఒకరు. రాష్ట్రానికి జాతీయ భద్రత ముసుగులో ఉచిత పాస్ లభించదని ప్రముఖంగా పేర్కొన్నారు.



## 'అంతర్జాతీయ' ఏర్పాట్లు
(మొదటి పేజీ తరువాయి)

కలిసి ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్‌కు పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదని, సమ్మిట్ కు సంబంధంలేని వారికి ఎట్టి పరిస్థితుల్లో ఎంట్రీ ఇవ్వకూడదని, సమ్మిట్‌కు సంబంధించి వివిధ శాఖల వారీగా పకడ్బందీగా అధికారులకు ఎంట్రీ ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్లను నేను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్‌కు ఇబ్బంది రావొద్దని, బందోబస్తుకు వచ్చే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, సమ్మిట్‌కు హాజరయ్యే మీడియాకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న భారత్ స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను సిఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు.

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ పెద్దలను, కాంగ్రెస్ అధిష్టానాన్ని కలుస్తారా అనేది తెలియాల్సి ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఎఐసిసి పెద్దలతో సమావేశం అయి వారితే రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు సోమవారం నూతన సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి సిఎం హాజరుకాబోతున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962లో హర్యానాలో జన్మించారు. సిజెఐగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హర్యానా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డుకెక్కబోతున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. మరో వైపు ప్రస్తుత సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్నారు.

## వెనక్కి తీసుకోవాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

నమ్మాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసి 29 చట్టాల స్థానంలో తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు యాజమాన్యాలకు అనుకూలంగా.. కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయని, కార్మికులు యాజమాన్యాల ముందు బానిసల్లాగా బ్రతకాల్సిన పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు. అలాగే కోడ్‌లలో 12 గంటల పనివిధానం ఉందని, చట్టబద్ధంగా సమ్మె చేసే హక్కులేదన్నారు. కాలపరిమితితో కూడుకున్న ఉద్యోగ నియామకాల అంశం ఉంది కానీ, పర్మినెంట్ ఉద్యోగాలు లేవు, ఉద్యోగ కాలాన్ని నిర్ణయించే అధికారం యాజమాన్యాలకు కల్పించటం జరిగిందన్నారు. యూనియన్ పెట్టుకోవటానికి అవకాశం లేకుండా కోడ్‌లలో పొందుపరిచారని అసహనం వ్యక్తం చేశారు. యాజమాన్యం యూనియన్‌ను గుర్తించాలంటే కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల్లో 52శాతం సభ్యులై ఉండాలని నిబంధన విధించారని తెలిపారు. ఈ నిబంధన వల్ల ఒక్క కంపెనీలో కూడా ఒక్క యూనియన్ కూడా గుర్తింపు పొందే అవకాశం లేదన్నారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించటానికి ఒకసంక్షేమ కమిటీ వేస్తారట! ఆ సంక్షేమ కమిటీకి అధ్యక్షుడిగా ఉండాల్సిన వ్యక్తిని యాజమాన్యం నియమిస్తుందని పొందుపరిచారని వివరించారు. గతంలో వ్యాపార సంస్థల్లో కార్మికుల సంక్షేమం, జీతభత్యాలు సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా అనే అంశాలపై లేబర్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారని, ఇప్పుడు వారిని ఫెసిలిటేటర్ కమ్ ఇన్‌స్పెక్టర్‌గా పేరుమార్చి వారికి ఉన్న అధికారాలు కత్తిరించారని అన్నారు. గత చట్టాలలో ఉన్న సామాజిక భద్రతను తగ్గించడంతో పాటు అనేక సెక్షన్లను తొలగించినట్లు వెల్లడించారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947లో చాప్టర్ 5బిలో 100 మందికంటే ఎక్కువ కార్మికులున్న పరిశ్రమను మూసివేయాలన్నా, కార్మికుల్ని తొలగించాలన్నా, లే ఆఫ్ ఇవ్వాలన్నా, ఆ కంపెనీ యాజమాన్యం ప్రభుత్వానికి దరకాస్తు చేసుకొని ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉండేదని, కానీ ఈ సంఖ్యను 100 నుంచి 300లకు పెంచడంతో పాటు అవసరాన్ని బట్టి 300ల సంఖ్యను కూడా పెంచుకునే అవకాశాన్ని యాజమాన్యాలకే కట్టబెట్టారని వివరించారు. ఈ నిబంధనను మార్చటం వల్ల యాజమాన్యం కార్మికుల్ని తన ఇష్టానుసారం తొలగించవచ్చు, లే ఆఫ్‌లు ఇవ్వచ్చన్నారు. అలాగే కొత్త యూనియన్లు నియమించుకోవాలంటే మొత్తం కార్మికుల సంఖ్యలో 52శాతం మంది సంతకాలు పెడితేనే యూనియన్ రిజిస్ట్రేషన్ అవుతుందని కోడ్‌లో పొందుపరిచారన్నారు. గతంలో ఉన్న కోర్టుకు పోయే హక్కును తొలగించి ఇద్దరు సభ్యుల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని, ఈ అంశాల వల్ల కార్మికవర్గం హక్కులు పరిష్కారం కావటానికి చాలా సమయం పడుతుందని తెలిపారు. యూనియన్లు భవిష్యత్తులో ఉండే పరిస్థితి ఉండదు కాబట్టి యూనియన్ ఉనికిలో లేకుంటే కార్మికులు స్వతంత్రంగా పోరాటం చేయలేరన్నారు. యూనియన్లే లేకుండా చేస్తే యాజమాన్యాలు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చు అని కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం కార్మికుల్ని బానిసల్లా చేయాలని పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఈ ప్రయత్నాలకు ప్రతిఘటనగా లేబర్ కోడ్‌ల అమలును రద్దు చేయాలని ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని యూనియన్లు ధర్నాకు దిగుతున్నాయని, ఇందిరాపార్కు వద్ద జరిగే 'కార్మికుల నిరసన గళం' సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## వన్యప్రాణి గణనకు భారీ స్పందన

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణులను లెక్కించేందుకు అటవీశాఖ చేపడుతున్న ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ 2026 కార్యక్రమంలో వాలంటీర్ల ఎంపిక ప్రక్రియ చివరి తేదీని ఈ నెల 30 వరకు పొడిగించినట్లు వన్యప్రాణి ముఖ్య సంరక్షిణాధికారి ఈలు సింగ్ మేరు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 17 నుంచి 20 వరకు మొదటి దశ, అదే నెల 22 నుంచి 24 వరకు మొత్తంగా 6 రోజులు పాటు రెండు దశల్లో ఈ లెక్కింపు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు 3800 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు కూడా ఇందులో భాగస్వాములు కావొచ్చని అందుకోసం వారు వ్యక్తిగతంగా సెలవు పెట్టుకొని రావాలన్నారు.

## కాంగ్రెస్‌తోనే బిసిల అభివృద్ధి



### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్
### మున్నూరుకాపు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మపురి సంజయ్

ప్రజాపక్షం/నిజామాబాద్ : నా రాజకీయ గురువు ధర్మపురి శ్రీనివాస్ ఆయన ద్వారానే రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నానని, బీసీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సంజయ్ చురుకైన పాత్ర వహించాలని, సంజయ్ తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో రాణించాలని ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ కోరారు. ఆదివారం మున్నూరుకాపు జిల్లా అధ్యక్షునిగా ధర్మపురి సంజయ్ ప్రమాణ స్వీకారోత్సవం నగరంలోని పర్గతినగర్ మున్నూరుకాపు సంఘంలో అట్టహాసంగా నిర్వహించగా అతిథుల సమక్షంలో ధర్మపురి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసి సన్మానించారు. ముందుగా పూలాంగ్ చౌరస్తా నుంచి ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘం వరకు మున్నూరుకాపు సంఘాలు, అభిమానులు బైక్ర్యాలీ నిర్వహించిన అనంతరం సన్మాన సభకు ముఖ్యఅతిథులుగా టీపీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, సర్దార్ కుటుంబం పురుషోత్తమరావు విచ్చేసి మాట్లాడారు. దేశంలో నిజామాబాద్ ప్రస్తావన వస్తే మొదట గుర్తుకు వచ్చేది రాజారాం, డీఎస్‌లు మాత్రమేనని గుర్తు చేశారు. డిఎస్ రాష్ట్రస్థాయిలో పేరొందడమే కాకుండా జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించారన్నారు. జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానని, డిఎస్ అంటేనే మున్నూరుకాపు డిఎస్ అనేలా ఎంతో కృషి చేశారని, వారు చూపిన అడుగుజాడల్లో నడుస్తూ సంఘ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. సన్మాన సభ కార్యక్రమానికి విచ్చేసిన మున్నూరుకాపులకు, అభిమానులకు, యువతకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు కమీషన్ సభ్యులు గడుగు గాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గంగారెడ్డి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే
# ప్రజా ప్రభుత్వ ఆకాంక్ష

### ఐటి, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/రంగారెడ్డి: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం ఆకాంక్ష అని, వారిని ఉన్నత స్థానంలో నిలుపుతామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ' కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, టియు ఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, వివిధ నియోజకవర్గలకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం. ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని దాదాపు కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి పంపిణీకి శ్రీకారం చుట్టారు.రాష్ట్రవ్యాప్తంగా 'మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి' ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం పేరిట చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని, మహిళా సంఘాల సభ్యులకు, అలాగే 18 ఏళ్లు నిండిన ఆడపడుచులందరికీ గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరలు, పట్టణాల్లో 35 లక్షల చీరల చొప్పున మొత్తం దాదాపు కోటి చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, బస్సుల కొనుగోలు వంటి వ్యాపారంలో మహిళా సంఘాలకు ప్రభుత్వం తోడ్పాటునిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తోందని అన్నారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగాలని మహిళలు అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశంతో సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించి రాష్ట్ర ప్రగతికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు కార్యక్రమానికి హాజరైన వారితో కలిసి జిల్లాలోని మహిళా సమాఖ్య సంఘాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల లాంఛనంగా పంపిణీ చేశారు. జీవన్ జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య సంఘానికి 6 వందల 34 కోట్ల 68 లక్షల చెక్కును మంత్రి ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టియు ఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఆర్అండ్ బి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్ శ్రీలత, సంబంధిత అధికారులు, జిల్లాకు చెందిన డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా స్పోర్ట్స్ పాలసీ

### హాఫ్ మారథాన్ పోటీల ప్రారంభోత్సవంలో యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




ప్రజాపక్షం/హనుమకొండ : ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందని యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఉదయం నాయిని విశాల్ ఫౌండేషన్, క్రెడాయి వరంగల్, తెలంగాణ రన్నర్స్, కియాన్ ఇన్ ఫ్రా సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ ట్రైసిటీ హాఫ్ మారథాన్ 2025ను మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నిర్వాహకులు విష్ణువర్ధన్ రెడ్డి, తదితరుల సమక్షంలో హాఫ్ మారథాన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. హనుమకొండలో నిర్వహిస్తున్న మారథాన్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా వ్యాప్తించాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్రంలోనే 4వ క్రీడా పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు కేటాయించారని తెలిపారు. యువత, విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకే ఒత్తిడి, న్యూనతకు లోనవుతున్నారని అన్నారు. మత్తు వదిలి మైదానాలకు చేరాలని సూచించారు. మారథాన్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు నీలిరంగు టీ షర్టులు ధరించి పరిగెడుతుంటే వరంగల్‌కు బ్లూ పెయింట్ వేసినట్టు ఉందన్నారు. తాను రంజీ గేమ్స్ ఆడుతున్న సమయంలో తన తల్లిదండ్రులు ఎందుకు ఆటలాడుతున్నావని తిట్టేవారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో తమ పిల్లలు ఎందుకు ఆటలు ఆడడం లేదని తల్లిదండ్రులు బాధపడుతున్నారని అన్నారు. విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. దాదాపు రూ.35 కోట్లతో విజయ డెయిరీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నాయిని విశాల్ ఫౌండేషన్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మారథాన్ నిర్వహించినందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మారథాన్‌లో పాల్గొనేందుకు వేలాదిమంది వచ్చారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మారథాన్ నిర్వహణలో సహకరించిన స్పాన్సర్లకు ధన్యవాదాలు తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్‌ను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ప్లేయర్, మంత్రి వాకిటి శ్రీహరి రంజీ ప్లేయర్ అని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ చారిత్రక వరంగల్ నగరంలో దాదాపు మూడు వేలమంది పాల్గొంటున్న మారథాన్ ఈవెంట్‌ను నిర్వహించడం మనందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. సమావేశం అనంతరం 5కె మారథాన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించి పరుగులో మంత్రి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాయల చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, క్రెడాయి ప్రతినిధులు, రాష్ట్రంలోని జిల్లాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అథిలెట్స్ 5, 10, 21 కె రన్ మారథాన్‌లో పాల్గొన్నారు.

## సమాజాన్ని చైతన్యపరిచేది సాహిత్యం

### 'శుభకృత్' పుస్తకావిష్కరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజాన్ని చైతన్యపరిచేది సాహిత్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభ్యుదయ కవి, రచయిత జి.కాళిదాసు రచించిన 'శుభకృత్ కావ్యాన్ని' ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నాగేశ్వరం శంకరం ఆవిష్కరించారు. ఈ కావ్యాన్ని రచయిత జి.కాళిదాసు చిన్ననాటి స్నేహితుడు, చాడ వెంకట్ రెడ్డికి అంకితం చేశారు. కార్యక్రమానికి అరసం అధ్యక్షులు పల్లేరు వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరం శంకరం ప్రసంగిస్తూ కాళిదాసు రచించిన కవితలన్నీ చాలా గొప్పగా ఉన్నాయన్నారు. ఒకప్పటి మహాకవి కాళిదాసు అభయ కవులు ఎవరైనా సమాజాన్ని దర్శించాలనుకునే వారు ఈ పుస్తకంలో ఈనాటి సమాజంలో ఉన్న అనేక దుర్మార్గాలను, అవకతవకతలను ఒక అభ్యుదయ కవిగా చక్కగా వివరించారని అన్నారు. కవి ప్రధానంగా దోపిడీకి గురయ్యే వారి పక్షాన నిలబడి శుభకృత్ కావ్యాన్ని రచించారని, కాళిదాసు అచ్చమైన అభ్యుదయ కవి అని కొనియాడారు. పుస్తకాన్ని అంకితం తీసుకున్న చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఒక కమ్యూనిస్టు నాయకునిగా తనకు, కాళిదాసుకు మొదటి నుండి మంచి భావసారూప్యత ఉందని, తామిద్దరం ఒకే బాటలో నడుస్తున్నామన్నారు. చిన్న నాటి నుండి అభ్యుదయ భావాలు కలిగి ఉన్నామని తెలిపారు. సమాజాన్ని చైతన్యపరిచేది సాహిత్యమేనని, నేటి ఆధునిక సమాజంలో సాహిత్యం పట్ల అభిరుచి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, అరసం ఉపాధ్యక్షులు నిధి శుభకృత పుస్తకాన్ని సమీక్ష చేశారు. కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, చంద్రమోహన్ గౌడ్, నాయకులు సోమశిల తిరుపాల్, ఏలేశ్వరం వెంకటేష్, రాకుమార, పుట్ట రాజన్నతో పాటు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన ఆదివాసి 'ధర్మ యుద్ధం' సభ

### ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తక్షణం తొలగింపునకు డిమాండ్
### ఆదివాసుల రిజర్వేషన్లు 10 శాతం పెంపుతోపాటు, పోడు భూములకు పట్టాలపై కీలక విజ్ఞప్తులు..




ప్రజాపక్షం/నిర్మల్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఎంపీడీవో మైదానంలో నిర్వహించిన ఆదివాసి ధర్మ యుద్ధ సభ మహారాష్ట్ర మంత్రి సునీర్ బాబు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక్ విజయ్ కుమార్ సహా పలువురు ముఖ్య నాయకుల సమక్షంలో అత్యంత ఉద్వేగపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సభ ప్రధానంగా లంబాడీల ఎస్టీ హోదాపై కేంద్రీకరించి, వారిని షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) జాబితా నుంచి తక్షణమే తొలగించాలని సంచలనాత్మక డిమాండ్‌ను వినిపించింది. మంత్రి సునీర్ బాబు ప్రసంగిస్తూ. ''చట్టబద్ధత లేకుండా, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా లంబాడీలు ఎస్టీ హోదాను అనుభవిస్తున్నారు. వారు అక్రమంగా జాబితాలో చేరి, నిజమైన ఆదివాసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, అటవీ వనరులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ దోచుకుంటూ ఆదివాసీల ఉనికినే ప్రమాదంలో పడవేశారు''. అని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ అన్యాయాన్ని ఇక ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఎస్టీ జాబితాలో చేరిన వారిని వెంటనే తొలగించకపోతే, ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణ కోసం దేశమంతటా 'ధర్మ యుద్ధం' పేరుతో( పెద్ద ఎత్తున) ఆందోళన కార్యక్రమాలను చేపడతామని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ సమావేశంలో సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోశయ్య, మహిపతి అరుణ్‌కుమార్, గోడం గణేష్ వంటి నాయకులు పాల్గొని ఈ డిమాండ్‌కు మద్దతు పలికారు.

**గిరిజన హక్కులు, భూమి వివాదాలపై కీలక తీర్మానాలు..**

ఈ ధర్మ యుద్ధ సభ గిరిజన హక్కులు,అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై సమగ్ర ముసాయిదా పత్రాన్ని రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో అత్యంత ముఖ్యమైన డిమాండ్‌గా, గిరిజనుల జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఎస్‌టి రిజర్వేషన్లను తక్షణమే 10 శాతం మేరకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూమి హక్కులకు సంబంధించి, పోడు భూమిని సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఎస్‌టి ల్యాండ్ రైట్స్ ఇచ్చి, ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని కోరారు. దీంతో పాటు,1956 నుండి 1976 వరకు 'అసైన్‌మెంట్' చేసిన అటవీ భూములకు పట్టాలు (L.O.R)ఇవ్వడంలో ఉన్న చిక్కులను వెంటనే పరిష్కరించి, 368 రోజులకు పైగా ఉండి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా అత్యంత వెనుకబడిన గిరిజన తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేయడం జరిగింది.

## నేడు ఇరిసెట్ 68వ వార్షికోత్సవ సభ

### ప్రారంభించనున్న ఇస్రో చైర్మన్
### ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న 1,20,549 మంది రైల్వే సిబ్బంది



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్) 68వ వార్షికోత్సవ సభను సికింద్రాబాద్‌లోని ఇరిసెట్ భవనంలో నిర్వహిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ఉత్సవాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇరిసెట్ రైల్వే సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ రంగాలలో శిక్షణ ఇవ్వడంలో ప్రత్యేకత కలిగిన భారతీయ రైల్వేలోని ఏడు కేంద్రీకృత శిక్షణా సంస్థలలో ఇది ఒకటి ఆయన తెలిపారు. ఐఆర్ఐఎస్ఇటి అందించే శిక్షణ రైల్వే సిగ్నలింగ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ల కెరీర్‌లను రూపొందించడంలో ప్రత్యేక పాత్ర పోషించిందన్నారు. ఇరిసెట్‌లో నిర్వహించబడే శిక్షణా కోర్సులు సిగ్నలింగ్, టెలికాం విభాగాలకు చెందిన అధికారులతో పాటు సూపర్‌వైజర్లను మాత్రమే కాకుండా ట్రాఫిక్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి రైల్వేలోని ఇతర విభాగాలకు చెందిన అధికారులను కూడా కవర్ చేస్తాయన్నారు. రైల్వే సిగ్నలింగ్‌పై మలేషియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ మొదలైన దేశాల నుండి 332 మంది విదేశీ జాతీయ ట్రైనీలకు శిక్షణనిచ్చిన ఘనత ఈ సంస్థకు ఉందన్నారు. ఇరిసెట్ దేశ నిర్మాణం కోసం మౌలిక సదుపాయాలను రూపొందించడానికి పర్యావరణ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రైవేట్ పరిశ్రమ, కాంట్రాక్ట్ ఏజెన్సీల సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తుందని తెలిపారు. సంవత్సరానికి సగటున 5500 అధికారులు, పర్యవేక్షకులు ఈ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందారన్నారు. ఇప్పటివరకు, ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం నుండి 1,20,549 మంది రైల్వే సిబ్బందికి ఈ ఇనిస్టిట్యూట్ శిక్షణ ఇచ్చిందన్నారు. 2022 సంవత్సరంలో, కవచ్‌ఇండియన్ రైల్వేస్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్స్‌పై పరిశోధన చేయడానికి ఇన్‌స్టిట్యూట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఈ) స్థాపించబడింది. సి.ఓ.ఈ కవాచ్ సాంకేతికత విస్తరణ కోసం సాంకేతిక సలహాలను జారీ చేస్తుంది, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆన్ సైట్ శిక్షణను అందిస్తుంది. శిక్షణ పొందిన అధికారులు, పర్యవేక్షకుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో సంస్థ శ్రమదానం, పరిశుభ్రత డ్రైవ్‌లు, చెట్ల పెంపకం కార్యకలాపాలు వంటి కమ్యూనిటీ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. తరగతి గది సెషన్‌ల తర్వాత శిక్షణ పొందిన వారి వినోదం కోసం ఇన్‌స్టిట్యూట్‌లో మంచి ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సౌకర్యాలు ఉన్నాయి. ట్రైనీల సర్వతోముఖాభివృద్ధికి క్రమం తప్పకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. శిక్షణ పొందిన వారి శ్రేయస్సు కోసం ప్రతిరోజూ శారీరక శిక్షణ, యోగా, ధ్యాన సెషన్‌లు నిర్వహించబడతాయి.



## ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించిన పటేల్

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో 'సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా 'సర్దార్@ యూనిటి రన్' నిర్వహించారు. సీతాఫల్‌మండి శివాజీ విగ్రహం వద్ద ప్రారంభమైన రన్, చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద ముగిసింది. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రజాకారుల హింస నుండి గ్రామీణ తెలంగాణ ప్రజలను రక్షించి, స్వేచ్ఛను అందించిన మహానుభావుడిగా అభివర్ణించారు.

# జైళ్ల శాఖ నిండు నిర్లక్ష్యం

### ఆరోగ్య భద్రత పథకం జిఒను మర్చిపోయారు
### ఉద్యోగులకు దిక్కుదివానా లేని 'ఆరోగ్య భధ్రత కార్డు'
### ఇప్పటికైనా జైళ్ల శాఖ కళ్లు తెరవాలంటున్న ఉద్యోగులు




ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు కల్పిస్తున్న 'ఆరోగ్య భద్రత పథకం' మాదిరిగానే తమకు కూడా కల్పించాలని దశాబ్దాలుగా పోరాడిన జైళ్ల శాఖ ఉద్యోగుల కల ఎట్టకేలకు ఫలించింది. జైళ్ల శాఖ ఉద్యోగులు.. వార్డన్ నుంచి సూపరింటెండ్ స్థాయి వరకు అందరికి ఆరోగ్య భద్రత పథకం కల్పిస్తూ తెలంగాణ హోంశాఖ ఈ ఏడాది ఆగస్టు 19న జిఒ విడుదల చేసింది. ఇంకేముంది తమకు తమ కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత పథకం వచ్చేసిందని మురిసిపోయిన జైళ్ల శాఖ ఉద్యోగులు వారి కల కలలుగానే మిగిలిపోయిన ఉదంతం ఇది. దేవుడు వరమిచ్చినా పూజారి కనకరించలేదనే చందంగా మారింది వాళ్ల ఆరోగ్య భద్రత పథకం. జిఒ విడుదలై మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ పథకం అమలుపై దృష్టి సారించకపోవడం గమనార్హం. అసలు ఈ రకమైన జిఒ వచ్చిందనే విషయం జైళ్లశాఖ ఉన్నతాధికారులకు తెలుసా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభు త్వం తమకు ఆరోగ్య భద్రత పథకం కల్పించినా ఇంత వరకు అమలుకు నోచుకోకపోవడంతో తెలంగాణలో పనిచేస్తున్న సుమారు 1400 మంది జైలు ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నెల 16న వరంగల్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో సంగారెడ్డి జైల్ వార్డన్ నాగపురి రాకేష్ మృతి చెందాడు.



ఇతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. వీరంతా అనాథలయ్యారు. అధికారులు గనుక ఆరోగ్య భద్రత పథకం అమలు చేసి ఉంటే రాకేష్ కుటుంబానికి సుమారు రూ.కోటి వరకు పరిహారం వచ్చివుండేది. అయితే రాకేష్ కుటుంబానికి జైలు సిబ్బంది తలా వెయ్యి రూపాయల చొప్పున అందించి ఆదుకునే పరిస్థితి రావడం శోచనీయం.

**ఉత్తర్వులను అమలులో జాప్యం....**

రక్షణ, సేవ కార్యంలో ఉన్న జైళ్ల శాఖ సిబ్బందికి మంచి వైద్య భద్రత కల్పించే దిశగా ఆరోగ్య భద్రతా పథకం (ఆరోగ్య భద్రత కార్డు) ప్రతిపాదించబడింది. ప్రభుత్వం దీనిపై ఉత్తర్వులు ఇచ్చిన అమలులో మాత్రం నిండు నిర్లక్ష్యం వహించారు. ఈ పథకం ద్వారా జైళ్ల శాఖలో ఉన్న సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ వైద్యసేవలు అందించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. భర్త, పిల్లలు, తల్లిదండ్రులు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఎంపానెల్ హాస్పిటల్స్ అనేక మల్టీ స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్ ఈ పథకంలో ఎంపనెల్ ఉన్నాయి. పోలీస్ సిబ్బంది వారి వేతనంలో నుంచి ప్రతినెల కంట్రీబ్యూషన్ ఇస్తారు. ఈ పథకం రిటైర్‌మెంట్ అయిన తరువాత కూడా లాభంగా ఉంటుంది. రాష్ట్రంలో చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్, నిజామాబాద్‌ల నాలుగు సెంట్రల్ జైలులు ఉండగా 32 సబ్ జైళ్లతో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్, అదిలాబాద్, ఖమ్మం, వరంగల్, సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్‌లలో జిల్లా జైళ్లు, వరంగల్, చర్లపల్లిలలో ఒపెన్ ఎయిర్ జైళ్లు, చంచల్‌గూడలో ఒక మహిళా జైలు ఉంది. ఈ జైళ్లలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఆరోగ్య భద్రత పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

## తైక్వాండోలో మహారాజ్‌కు గోల్డ్

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : జిల్లా స్థాయి తైక్వాండో కరాటే పోటీల్లో కొల్పుల మహారాజ్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదివారం స్థానిక న్యూడైమెన్షన్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో కరాటే టోర్నమెంట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మీసాల పరమేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 41 కేజీల విభాగంలో మాస్టర్ కొల్పుల మహారాజ్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ గుర్రం రాధ, జిల్లా స్థాయి కోచ్‌లు, స్కూల్ కరస్పాండెంట్ పులిమామిడి సుభాష్ రెడ్డి, ప్రిన్సిపల్ రూపాలి, మున్సిపల్ మాజీ చైర్మన్ కొల్పుల కమలాకర్‌లు కొల్పుల మహారాజ్‌ను అభినందించారు.




## 24 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 24 ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ భగవాన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పేరబోయిన గూడెం బిక్కేరువాగు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని స్థానికుల సమాచారంతో శనివారం రాత్రి దాదాపు 10 గంటల సమయంలో 24 ట్రాక్టర్లు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతుండగా చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలో రెండు రోజులుగా ఇసుక క్వారీకి సెలవు కావడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు వివరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాండ్ రీచ్ ఆఫీసర్లు జాగ్రత్త వహించాలని కోరారు.





## మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

ప్రజాపక్షం/నూతనకల్ : మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేడిఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 7,647 మంది ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నాసిరకం బతుకమ్మ చీరలను పంపిణీ చేసిందని కేసిఆర్ కుటుంబం ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ సంపదనను దోచుకున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సిఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, అదనపు డిఆర్‌డిఓ సురేష్, డిపిఎం బెనర్జీ, ఏపిఎం వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## జెసిబి ఆటో ఢీ... ఒకరు మృతి

### ముగ్గురికి గాయాలు



ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) : జెసిబి ఆటో ఢీకొని ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలైన సంఘటన నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లాలో సూర్యాపేట జనగాం జాతీయ రహదారి 365బి పై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం డి.కొత్తపల్లి వైపు పనిచేయడానికి వెళ్తున్న జెసిబిని వెనుకాలే వెళ్తున్న ఆటో ఎంఈఓ ఆఫీస్ సమీపంలో ఓవర్‌టెక్ చేయబోగా ఆటో జెసిబి వెనుక భాగంలో ఉన్న బొక్కెనకు బలంగా తగిలింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన బండారి ప్రభుదాస్ (సాయిలు) (75) కాలుకు, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య యశోద ఫిర్యాదు మేరకు స్టేషన్ ఇంచార్జి ఏఎస్ఐ భగవాన్ కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులకు అండ

### ఎంపి ఈటెల రాజేందర్



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు హైదరాబాదులో శామీర్‌పేట్‌లోని ఎంపీ ఈటెల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిశారు. చౌటుప్పల్ మండలంలోని దివిస్ ఫ్యాక్టరీని కాపాడడం కోసం ఓఆర్ఆర్ నుండి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాని 28 కిలోమీటర్ల దూరంలో ట్రిబల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ తీసుకోవడం వల్ల రైతులు రెండు ఎకరాల భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట చేసిన అలైన్మెంట్ ప్రభుత్వ భూముల మీదుగా తీశారని కొంతమంది పెట్టుబడుదారులను కాపాడానికి పేద రైతుల పొట్ట కొడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ పేద రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఓఆర్ఆర్ రోడ్ నుండి ట్రిబుల్ ఆర్ రోడ్డుకు రాష్ట్రంలో ఒకే విధంగా ఉండే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు నడికుడి అంజయ్య, పల్లె శేఖర్ రెడ్డి, నెల్లికంటి నాగరాజు, పి.భాస్కర్ రెడ్డి, బొల్లెపల్లి రాధాకృష్ణ, రాజు, ఆంజనేయులు, ఏం.నరేందర్, పి.ఆదిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో విధేయతకు చోటు లేదు

### గుమ్ముల మోహన్ రెడ్డి విమర్శ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తాను డీసీసీ పదవిపై ఎన్నో ఆశలు పెటుకున్న మాట వాస్తవం ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి పదవులు ఇవ్వడం సరైంది కాదు నిజమైన కాంగ్రెస్ కార్యకర్తకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డిలు తలుచుకుంటే తనకు క్షణాల్లో ఆర్‌టిసి చైర్మన్ పదవి దక్కుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నోటి దురుసుతో ఎదుటివారిని తిట్టే వారికి పదవులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉన్న తనకు డీసీసీ పదవి రాక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు మంత్రి కోమటిరెడ్డి ఆశీస్సులతో చక్కని పదవి దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోమటిరెడ్డి తలుచుకుంటే తనకు క్షణాల్లో ఆర్టీసీ చైర్మన్ పదవి దక్కుతుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్యలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

### మహిళల ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందిస్తాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ప్రజాపక్షం/తుర్కపల్లి : రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు నమూనా గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని మండలాల్లో 90 శాతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అనంతరం చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జానయ్య, గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, తాసిల్దార్ జల కుమారి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రమణ, కాంగ్రెస్ మండల నాయకులు ధనావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.



### మహిళల ఆత్మగౌరానికి ప్రతీక ఇందిరమ్మ చీరలు

ప్రజాపక్షం/మోటకొండూర్ : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో చీరల పంపిణీ కార్యక్రమం చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ఆదివారం మోటకొండూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా సంఘాల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన మోటకొండూరు మండలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో ఎంపీడీవో, తహసిల్దార్, పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మాణం కోసం నిధులు మంజూరి చేయించుకోని భూమి పూజ చేసుకున్నట్లు, వంగపల్లి నుండి ఖపురాయపల్లి వరకు డబల్ రోడ్డు మంజూరు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నాగిరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీల పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పచ్చిమట్ల మాధవి పాల్గొన్నారు.



## 880 చీరల పంపిణీ

ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) : మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల గ్రామంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో భాగంగా రెండు సంఘ బంధాలకు సంబంధించి 88 స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 880 చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా వడ్డీలేని రుణాలను మహిళలకు అందజేయడం జరుగుతందని తెలిపారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో మహిళలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్ధతు తెలిపి తమ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివికెలు డి హేమలత, ఎన్ సరిత, మహిళా సంఘాల సభ్యులు సూరారపు మంజుల, చెరుమళ్ళ పద్మ, సుంకరి నాగమ్మ, ఆలేటి సునీత, నిర్మల పాల్గొన్నారు.



# గ్రామీణ విద్యార్థుల విద్య కోసమే గురుకులాలు

### స్థలదాత మద్ది నారాయణ రెడ్డికి రుణపడి ఉంటాం

### తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోని సర్వేల్ ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మాజీ ప్రధాన మంత్రి పివి నరసింహా రావు, మద్ది నారాయణ రెడ్డిల కాంస్య విగ్రహాలను తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణ రావు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ రావు మాట్లాడుతూ 1971 నవంబర్ 23న గురుకుల పాఠశాలను పివి నరసింహా రావుకు విద్య పై అపారమైన అవగాహన ఉండి ప్రారంభించారని, పాఠశాలకు సర్వేల్‌లో మద్ది నారాయణ రెడ్డి 44 ఎకరాల భూమిని దానం చేయడం ద్వారానే మేమంతా ఉన్నత స్థాయిలో ఉన్నామని మాట్లాడారు. విద్యార్థులు సోషల్ మీడియాను మంచి కోసమే వినియోగించుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను తీర్చిదిద్దేది గురుకులాలని అన్నారు. పాఠశాల ఆవరణలో పివి కుమారుడు పివి ప్రభాకర్ రావు, కుమార్తె ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్య కోసం, విద్యార్థులకు ఎన్నో ప్రత్యేక నిధులు తెస్తానని మాట్లాడారు. క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. సర్వేల్ గురుకుల్ అల్యూమిని అనే ఒక ప్రత్యేక యాప్ ను జగదీష్ బల్ల తయారు చేశారు. ఆయనను సిఎస్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిజిపి మహేందర్ రెడ్డి, గుర్రం మల్సూర్ ఐఏఎస్, సురేంద్రమోహన్, కుమారస్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు, అల్యూమిని ఆర్గనైజర్ స్ రమణ కుమార్, నరేందర్ రెడ్డి, దేవులపల్లి సత్యనారాయణ, డిఇఓ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి , తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎసిపి మధుసూదన్ రెడ్డి, సిఐ రాములు, మన్మధ కుమార్, ఎస్సు జగన్ బందోబస్తు నిర్వహించారు.



## ఎన్‌సిసికి నేటితో 78 వసంతాలు పూర్తి




ప్రజాపక్షం/నందికొండ: నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఎన్‌సిసి 78వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి 1948లో భారత పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిన ఈ సంస్థ అని దేశ యువతకు క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు,దేశ భక్తి భావాలు,సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ దేశ నిర్మాణంలో ఎన్‌సిసి అనేది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా విపత్తు సమయంలో సేవా కార్యక్రమాలు,రక్షణ రంగంలో అవకాశాలు,రక్తదానం,పర్యావరణ సంరక్షణ,మహిళా సాధికారత, స్వచ్ఛ భారత్, కార్యక్రమాలలో కేడెట్లు ముందుంటారని అన్నారు.

# కేసుల భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వమే కీలకం



### హైకోర్టు జడ్జ్ జస్టిస్ కె.లక్ష్మణ్

ప్రజాపక్షం/నార్కట్ పల్లి: న్యాయవ్యవస్థలో కేసుల భారాన్ని తగ్గించి వేగవంతమైన న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వం(మెడియేషన్)ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని హైకోర్టు జడ్జ్ జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు.ఆదివారం ఆయన మహాత్మా గాంధీ యూనివర్సిటీలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా న్యాయవాదులకుద్దేశించి మధ్యవర్తిత్వం పై 5 రోజులపాటునిర్వహించే శిక్షణా తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో కుటుంబ విభేదాలు,ఆస్తి వివాదాలు,వాణిజ్య కేసులు, చిన్నచిన్న వ్యక్తిగత సమస్యల కేసులను మర్ధవర్తిత్వం ద్వారా పరిష్కరించ గలిగే అవకాశం విస్తరించిందని అన్నారు. కోర్టులలో పెరిగిన కేసులను పూర్తి స్థాయిలో విచారణ చేయడానికి సమయం ఎక్కువగా పడుతుందని,అయితే మధ్యవర్తితం ద్వారా ప్రజలు కోర్టు బయటే పరస్పర అంగీకారంతో త్వరగా సమస్యలు పరిష్కరించవచ్చునన్నారు. మధ్యవర్తిత్వం న్యాయస్థానానికి బలం అని అన్నారు.న్యాయవాదులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలనీ, నైపుణ్యం కలిగిన శిక్షకులు ఉన్నారని,వారు చెప్పే అంశాలను ప్రతిదీ నోట్ చేసుకోవాలని,కేసులను త్వరగా పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని కోరారు.అంతకుముందు మహాత్మ గాంధీ యూనివర్సిటీలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డీ హైకోర్టు జడ్జికి పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీడైరెక్టర్ మీడియేషన్ అండ్ అబ్జర్వేషన్ సెంటర్ హైదరాబాద్ సిహెచ్ పంచాక్షరి,జిల్లా జడ్జి కవిత,యాదాద్రి జిల్లా జడ్జి జయరాజు పురుషోత్తం,జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి,నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి ఉన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి,వారి దైనందిన జీవితంలో ఉక్కు పాత్రలు వంటి ఆరోగ్యకరమై న పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను స్వీకరించేలా ప్రోత్సహించాలని ఎన్‌సిసి అధికారి చిలుముల సుధాకర్ అన్నారు. ఎన్‌సిసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణం లోని నాగార్జున ప్రభుత్వ కళాశాల ఎన్సిసి క్యాడెట్లు మర్రిగూడ గ్రామంలోని మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమాజ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి మాట్లాడుతూ పర్యావరణంపై ప్లాస్టిక్ యొక్క హానికరమైన ప్రభావాలను వివరించారు. పరిశుభ్రతను కాపాడుకోవడానికి పరిశుభ్రమైన,సురక్షితమైన సమాజానికి దోహదపడే మన్నికైన ఉక్కు వస్తువులను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను వారు హైలైట్ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం క్రమశిక్షణ,సేవ సామాజిక అవగాహనను నేషనల్ క్యాడెట్ కార్ప్స్ యొక్క విలువలు గొప్పతనాన్ని చాటి చెప్పడమే అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్.లలిత, మాజీ కౌన్సిలర్ బొజ్జా శంకర్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### వసతి గృహం వద్ద మురికి నీరు నిల్వ

# విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్రప్రభావం

### విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సిపిఐ డిమాండ్

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ వసతి గృహం దగ్గర రోజుల తరబడి నిల్వగా ఉన్న మురికి నీరు విద్యార్థుల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉందని సీపీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ వసతి గృహానికి ఎదురుగా పేరుకుపోయిన కాలువ నీరు చెత్తతో కలిసిపోయి దుర్వాసన వెదజల్లుతూ దోమలతో విద్యార్థులు డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి వ్యాధులకు గురికావాల్సి వస్తుందని, విద్యార్థులు గతంలో కురిసిన వర్షాలతో మురికి నీరు మరింతగా రోడ్డు పై నీట మునిగిపోవడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ హాస్టల్‌ను దత్తత తీసుకున్నారు. గతంలో పదవ తరగతి విద్యార్థులకు సైకిలను అందజేశారు. ప్రస్తుతం కనీస మెయింటెనెన్స్ లేకుండా సైకిల్లను మూలన పడేశారు. హాస్టల్లో ఉన్న మరుగుదొడ్లు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని అర్థమవుతుందని అన్నారు. వెంటనే కలెక్టర్ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అనారోగ్యాల పాలవకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, పందుల యాదగిరి, గడ్డం యాదగిరి, ఈద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





## చదువుతోపాటు శారీరక దృఢత్వం కావాలి

### రాష్ట్ర స్థాయి కోకో క్రీడల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : మండలం పంతంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి కోకో క్రీడలను ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల కోకో క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాంకుల వేటలో పిల్లలపై విపరీతమైన మానసిక ఒత్తిడి తీసుకొస్తున్నారని క్రీడల విషయంలో అప్రోత్సాహం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆలోచన విధానం మారాలని ర్యాంకుల కోసమే కాకుండా క్రీడల్లో రాణించే విధంగా తమ పిల్లల్ని ప్రోత్సహించాలని సూచించారు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ఆటలు ఆడాలని తద్వారా శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవుతారని అన్నారు. కోకో క్రీడల్లో పాల్గొనే ప్రతి ఒక్క క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. పంతంగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాత్రిపూట క్రీడల నిర్వహణకు విద్యుత్ దీపాల అవసరం ఉన్నాయని గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.




# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎన్నికల్లో అవకతవకలు జరిగాయనే అనుకుంటున్నా: ప్రశాంత్ కిశోర్

**పాట్నా :** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్ సురాజ్ పార్టీ బిహార్ ఎలక్షన్లలో కనీసం ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలోప్రశాంత్ కిశోర్ ఆదివారం ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయనే తాను నమ్ముతున్నట్లు చెప్పారు. అయితే ఆధారాలు మాత్రం తన వద్ద లేవని అన్నారు. జన్ సురాజ్ పార్టీ తొలిసారిగా ఈ ఎన్నికల్లో బరిలోకి దిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసింది. కానీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. భారీ పరాజయమేనని ప్రశాంత్ కిశోర్ అంగీకరించారు. క్షేత్రస్థాయిలో తమ ప్రచారానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ఓటింగ్ సరళికి, పాదయాత్ర సమయంలో తమటీమ్‌ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు తేడా ఉందన్నారు. కాబట్టి ఏదో జరిగే ఉంటుందని నమ్ముతున్నట్టు వ్యాఖ్యానించారు. 'ఏవో అదృశ్య శక్తులు ఈ ఎన్నికల్లో పని చేశాయి'.

# 'చండీగఢ్ బిల్లు'పై వెల్లువెత్తిన వ్యతిరేకత

### పార్లమెంట్ సమావేశాల్లో చండీగఢ్‌పై ఎలాంటి బిల్లు ప్రవేశపెట్టడం లేదు: కేంద్రం స్పష్టీకరణ




**న్యూఢిల్లీ :**పంజాబ్, హర్యానా సంయుక్త రాజధాని చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకొచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 సవరణ బిల్లుపై పంజాబ్‌లో వ్యతిరేకత వస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే చండీగఢ్ ఆర్టికల్ 240 పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కొనసాగుతున్నారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రపతికి చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారం ఉం టుంది. దీంతో పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు పార్లమెంట్ సమావేశాల్లో చండీగఢ్‌పై ఎలాంటి బిల్లు ప్రవేశపెట్టడం లేదని కేంద్రం స్పందించింది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని పంజాబ్ సిఎం, ఆప్ నేత భగవంత్ మాన్ ఆరోపించారు. చండీగఢ్ గతంలో పంజాబ్‌లో భాగమని, ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా పంజాబ్‌తో విడదీయరాని భాగమేనని పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీపార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్ కూడా పంజాబ్ గుర్తింపుపై కేంద్రం దాడి చేస్తోందని అభివర్ణించారు. చండీగఢ్ పం జాబ్‌కు చెందినదేనని దానిని లాక్కోవడానికి చేసే ప్రయత్నాలకు తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ పేర్కొన్నారు. అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా దీనిని పం జాబ్ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. మరోవైపు చండీగఢ్ అంశంలో పంజాబ్ బిజెపి ఇప్పటికే స్పష్టతనిచ్చింది. చండీగఢ్ విషయంలో తలెత్తిన గందరగోళం కేంద్రంతో చర్చించి పరిష్కరిస్తామని పేర్కొంది.

**శీతాకాల సమావేశాల్లో ఎలాంటి బిల్లు ప్రవేశపెట్టం**

ఇదిలా ఉండగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ పరిపాలనకు సంబంధించి ఎలాంటి బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని హోంమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ చట్టం రూపొందించే ప్రక్రియను సరళీకరించాలన్న ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉందని స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదన వల్ల చండీగఢ్ పాలన విధానం లేదా పంజాబ్, హర్యానా రాష్ట్రాలతో ఉన్న సాంప్రదాయ సంబంధాల్లో ఏ మార్పూ ఉండదని తెలిపింది. చండీగఢ్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత వారితో చర్చించిన తర్వాత మాత్రమే తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఈ విషయంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది. 1966లో పంజాబ్ నుంచి హర్యానా విడిపోయిన తర్వాత చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు. పంజాబ్, హర్యానాకు అప్పటి నుంచి చండీగఢ్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతోంది. చండీగఢ్‌ను ఓ అడ్మనిస్ట్రేటర్ పాలిస్తున్నారు. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు. చండీగఢ్ పంజాబ్‌దేనని పలు రాజకీయ పార్టీలు డిమాం డ్ చేస్తున్నాయి. హర్యానాకు ప్రత్యేక రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను కూడా తీసుకురావాలని ఇటీవల కేంద్రం ప్రతిపాదించింది. దీనికిగాను రాజ్యాంగంలోని ఆర్టికల్ 131ను సవరిస్తూ బిల్లు తీసుకురానుంది. త్వరలో జరగనున్న శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లు పార్లమెంటు ముందుకు రానుంది. చట్టసభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్‌నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ, దమణ్‌దీవ్ ప్రస్తుతం ఆర్టికల్ 240 పరిధిలో ఉన్నాయి. ఈ పరిధిలోకి చండీగఢ్ చేరితే రాష్ట్రపతికి అధికారులు వెళ్తాయని పంజాబ్‌లోని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి.

## హిమాచల్‌కు వింగ్ కమాండర్ నమాన్ష్ సియాల్ భౌతికకాయం



**కోయంబత్తూరు :** దుబాయ్ ఎయిర్ షోలో వైమానిక ప్రదర్శన సందర్భంగా మరణించిన వింగ్ కమాండర్ నమాన్ష్ సియాల్ భౌతికకాయాన్ని తమిళనాడు కోయంబత్తూరు సమీపంలోని వైమానిక దళ స్థావరానికి తీసుకువచ్చారు. ఇక్కడ కొద్దిసేపు ఆగిన తర్వాత హిమాచల్ ప్రదేశ్‌లోని అతని పూర్వీకుల ఇంటికి తరలించినట్లు ఐఎఎఫ్ తెలిపింది. ఈనెల 21న స్వదేశీ మల్టీరోల్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎలిసిఎ), తేజస్ వైమానిక ప్రదర్శన సందర్భంగా కూలిపోయిన తర్వాత సియాల్ మరణించాడు. ఆదివారం మృతదేహాన్ని తమిళనాడులోని సూలూరు వైమానిక దళ స్థావరానికి తీసుకువచ్చారు. అక్కడ వారికి పూర్తి సైనిక గౌరవాలతో స్వాగతం పలికారు. 'దుబాయ్ ఎయిర్ షో 2025లో వైమానిక ప్రదర్శన సందర్భంగా జరిగిన ప్రమాదంలో ప్రాణాంతక గాయాలతో మరణించిన వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ భౌతికకాయాన్ని భారత వైమానిక దళం స్వదేశానికి అప్పగించింది' అని ఐఎఎఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎఎఫ్ సి–130 విమానం సియాల్ భౌతికకాయాన్ని భారత వైమానిక దళం, దక్షిణ ఎయిర్ కమాండ్‌కు తీసుకెళ్లడంలో నిమగ్నమై ఉంది, దీనిని పూర్తి సైనిక గౌరవాలతో స్వీకరించినట్లు ఐఎఎఫ్ తెలిపింది. 'విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ భౌతికకాయానికి, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ జి గిరియప్పనవర్ ఉదయం ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో పుష్పగుచ్ఛం ఉంచారు'అని వర్గాలు తెలిపాయి. గౌరవప్రదమైన వేడుక తర్వాత (సులూరులో) అంత్యక్రియల కోసం భౌతికకాయాన్ని ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్‌లోనికాంగ్రాలోనికుటుంబ పూర్వీకుల ఇంటికి తరలించారు.

# కర్రెగుట్ట కొండల్లో పోలీసుల అలజడి

**బిజాపూర్‌లోని తడ్పలలో కొత్త శిబిరాన్ని ఏర్పాటు చేసిన భద్రతా బలగాలు**



**బిజాపూర్:**మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం, వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసింది. ఇప్పటికే అనేకమందిని ఎన్‌కౌంటర్ చేయగా, పలువురు స్వచ్ఛందంగా లొంగిపోతున్నారు. అన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లే అని ప్రతిపక్షాలు కేంద్ర సర్కార్‌పై దుమ్మెత్తిపోస్తున్నాయి. పాక్ ఉగ్రవాదలకు చర్చకు అవకాశమిచ్చి నక్సల్స్‌కు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. అయితే మావోయిస్టులను తుదముట్టించేందుకు ఛత్తీస్‌గఢ్– తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్ట కొండల దట్టమైన అడవులలో సమగ్ర నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన దాదాపు ఆరు నెలల తర్వాత, భద్రతా దళాలు సీనియర్ మావోయిస్టులకు సురక్షితమైన ఆశ్రయంగా పరిగణించబడే ఈ ప్రాంతంలో కొత్త శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. బిజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తడ్పల గ్రామం సమీపంలో ఈనెల 4న 'సురక్షా ఏవంజన్‌సువిధాక్యాంప్' (భద్రతా, ప్రజా సౌకర్యాల శిబిరం)ను దళాలు ఏర్పాటు చేశాయని ఆదివారం ఒక అధికారి తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌మే నెలల్లో, కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలు కర్రెగుట్ట కొండల చుట్టూ ఉన్న దట్టమైన అడవులలో21రోజులసమగ్ర ఆపరేషన్ నిర్వహించాయి. ఈ సమయంలో 31 మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేశారు. వైద్య సామాగ్రి, విద్యుత్ పరికరాలు, నక్సల్‌సాహిత్యం మొదలైన 12,000 కిలోల ఇతర పదార్థాలతోపాటు 35 ఆయుధాలు, 450 ఇంప్రూవైజ్డ్‌పేలుడుపరికరాలు (ఐఇడిలు), పెద్ద సంఖ్యలో డిటోనేటర్లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాజాగా కొత్తగా ఏర్పాటు చేసిన శిబిరం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (సిఆర్‌పిఎఫ్ ఎలైట్ యూనిట్) 196వ, 205వ బెటాలియన్లకు ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఒబి)గా పనిచేస్తుందని అధికారి తెలిపారు. ఈ శిబిరం సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడానికి, కార్యాచరణ సామర్థ్యాలను మెరుగుపరచడానికి సహాయపడుతుందని ఓ అధికారి వెల్లడించారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఆరోగ్య సౌకర్యాలు, పాఠశాలలు, పిడిఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) అవుట్ లెట్‌లు, మొబైల్ కనెక్టివిటీ, ఈ ప్రాంతంలోని గ్రామస్తులకు అంగన్‌వాడీ కేంద్రాలు వంటి ముఖ్యమైన సేవలను సులభతరం చేయడంలో కూడా సహాయపడుతుందన్నారు. వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఈ అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో శిబిరాన్ని ఏర్పాటు చేయాలనే ప్రణాళికలో భాగంగా, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి),స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్), రాష్ట్ర పోలీసుల రెండు విభాగాలు, కోబ్రా 205వ, 210వ బెటాలియన్లు, సిఆర్‌పిఎఫ్ 196వ బెటాలియన్‌ల సంయుక్త బృందాలు నవంబర్ 3న తడ్పాల చేరుకున్నాయి. సీనియర్ పోలీసు, కోబ్రా అధికారుల సమక్షంలో ఒక స్థలాన్ని ఎంపిక చేశారు. మరుసటి రోజు శిబిరాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు అధికారి తెలిపారు. తిరుగుబాటు ప్రభావిత ప్రాంతాలలో కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించేలక్ష్యంతో ఈ ప్రదేశాన్ని అడవి యుద్ధం, ఫీల్డ్ క్రాఫ్ట్, వ్యూహాలు, ఇతర ఆచరణాత్మక శిక్షణా మాడ్యూళ్ల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రంగా కూడా అభివృద్ధి చేస్తామని అధికారి తెలిపారు. తడ్పాల నుండి, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో ఉమ్మడిష సమన్వయ కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈ ప్రాంతంలో శిబిరం స్థాపించబడినప్పటి నుండి బాంబు నిర్వీర్య బృందాలు 14 ఐఇడిలను స్వాధీనం చేసుకుని సురక్షితంగా నిర్వీర్యం చేశాయని ఆయన చెప్పారు.

## గాలి కాలుష్యం.. 22 మంది ఆసుపత్రిపాలు

**న్యూఢిల్లీ/జైపూర్:** పారిశ్రామిక ప్రాంతంలో గాలి కాలుష్యం వల్ల స్థానికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. 15మంది పిల్లలతో సహా 22 మందిఅస్వస్థతచెందారు.ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.అధికారులు అప్రమత్తమయ్యారు. గాలి కాలుష్యానికి కారణంపై దర్యాప్తు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని సికర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సికర్‌లోని పారిశ్రామిక వాడలో విషవాయువులు వెలువడ్డాయి. గాలి కాలుష్యం వల్ల 15 మంది పిల్లలతో సహా 22 మంది ఆసుపత్రిలో చేరారు. కాగా, సికర్ జిల్లా అదనపు కలెక్టర్ రతన్ లాల్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆసుపత్రికి చేరుకున్నారు. పిల్లలు, పెద్దల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నదని వివరించారు.

## అంతర్రాష్ట్ర అక్రమ ఆయుధాల తయారీ ముఠా అరెస్టు



**పుణె :** మధ్యప్రదేశ్ బర్వానీ జిల్లాలోని ఓ గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర అక్రమ ఆయుధాల తయారీ, రవాణా ముఠాను పుణె పోలీసులు ఛేదించారు. 36 మందిని అరెస్టుచేశారు. భారీ ఆయుధాల నిల్వను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పుణె నగరానికి 500 కి.మీ దూరంలో ఉన్న మధ్యప్రదేశ్‌లోని ఉమర్తి గ్రామంలో గత మూడు వారాలలో అనేక పిస్టల్స్ స్వాధీనం చేసుకోగా, మధ్యప్రదేశ్‌లో సరఫరా లింకులు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడ దాడులు ప్రారంభించారని అధికారులు చెప్పారు. మధ్యప్రదేశ్ పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, అక్రమంగా ఆయుధాలు తయారు చేస్తున్న 50 ఫర్నేస్‌లను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో పుణె పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారని, నగరంలోని విమంతల్, కాలేపడల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తులో, మధ్యప్రదేశ్‌లో ఉన్న పిస్టల్స్ తయారీ యూనిట్ల గురించి తమకు సమాచారం అందిందన్నారు. పుణె, మధ్యప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా గాలింపు ఆపరేషన్ చేపట్టారని, పుణ్ జాయింట్ కమిషనర్ రంజన్ కుమార్ శర్మ విలేకరుల సమావేశంలో తెలిపారు. పలు ప్రదేశాలలో పోలీసులు దాడులు నిర్వహించి ఆయుధ తయారీ యూనిట్లను కూల్చివేశారని, మొత్తం 36మందిని అదుపులోకి తీసుకున్నారని ఆయన అన్నారు. గత మూడు వారాలలో పుణెలో మొత్తం 21 పిస్టల్స్ స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పట్టుబడిన నిందితులను విచారించినప్పుడు పుణెకు తీసుకువచ్చిన ఆయుధాలు మధ్యప్రదేశ్ నుండి వచ్చినవని వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత, ఈ ఆపరేషన్ ప్లాన్ చేసి నిర్వహించారని అధికారి తెలిపారు. 'ఇది ఆయుధాల సరఫరా గొలుసు. ఈ ఆయుధాలను పుణెకు పంపిన వారి కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఈ రాకెట్‌లో ఇంకా చాలా మంది వ్యక్తులప్రమేయం ఉంది. విచారణ ఇంకా కొనసాగుతోంది అని జాయింట్ సిపి తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) సోమయ్ ముండే నేతృత్వంలో పుణె నుండి 105 మంది పోలీసు సిబ్బంది బృందం ఈ ఆపరేషన్‌లో పాల్గొంది.

## దంపతులు సహా ఇద్దరు పిల్లలు మృతి

**జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లాలో దారుణ ఘటన**

**దుమ్కా :** జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లా బర్ధాహి గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. ఒక వ్యక్తి, ఆయన భార్య సహా ఇద్దరు పిల్లలు మృతిచెందిన వారిలో ఉన్నారని ఆదివారం ఉదయం పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంఘటన హన్స్‌దిహా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుల్లో వీరేంద్ర మాంజీ (30), ఆయన భార్య ఆర్తి కుమారి (26), వారి కూతురు రుహి కుమారి (4), కుమారుడు విరాజ్ కుమార్ (2) ఉన్నారని పోలీసులు గుర్తించారు. ఏడు నెలలుగా తల్లిదండ్రుల ఇంటిలో ఉంటున్న తర్వాత శుక్రవారం వీరేంద్ర మాంజీ భార్య ఆర్తి కుమారి తన సొంత ఇంటికి చేరుకుంది. భర్తకు, భార్యకు మధ్య వివాదం తలెత్తిందనే విషయాన్ని దర్యాప్తు అధికారుల విచారణలో తేలిందని ఎస్‌పి పీతాంబర్ సింగ్ ఖేర్వార్ 'పిటిఐ'కి వెల్లడించారు. వారి కుమార్తె కూడా అనారోగ్యంతో బాధపడుతోందని, ఆమె చికిత్స పొందుతున్నదని ఖేర్వార్ చెప్పారు. ఆ కుటుంబం పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని కూడా ఎస్‌పి చెప్పారు. శనివారం రాత్రి దంపతుల మధ్య వాగ్వాదం పతాకస్థాయికి చేరుకుని కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో వీరేంద్ర మాంజీ తన భార్య గొంతుకోసి చంపాడని, ఇద్దరూ ఉరివేసుకుని చనిపోయారని ఎస్‌పి పీతాంబర్‌సింగ్ ఖేర్వార్ వివరించారు. హత్యా స్థలి వద్దకు పిలువబడిన ఒక ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ (ఎఫ్ఎస్ఎల్) బృందం పలు ఆధారాలను సేకరించింది. ఇతర కుటుంబ సభ్యుల వాంగ్మూలం ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని ఆయన చెప్పారు. ఆ మహిళ ఇద్దరు పిల్లల మృతదేహాలు ఇంట్లో పడిఉండగా, ఆ వ్యక్తి సమీపంలోని ఒక చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని కనుగొన్నామని హన్స్‌దిహా పోలీస్‌స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జి తారా చంద్ తెలిపారు. పోలీసులు మృతదేహాలను దుమ్కాలోని ఫులోఝానో మెడికల్ కాలేజీ & హాస్పిటల్‌కు పోస్ట్‌మార్టమ్ కోసం పంపించారు.

# 2023 నుంచి బాంబులపై 'ఉమర్' ప్రయోగాలు

**'వైట్-కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో వైద్యుల తీవ్రవాదం 2019లోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో ప్రారంభం**



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎర్రకోట పేలుడు కేసును దర్యాప్తు చేసే కొద్దీభారీ ఉగ్ర కుట్రలు బయటపడుతున్నాయి. తాజాగా ఆత్మాహుతి బాంబర్ ఉమర్ తనను తాను కరుడుగట్టిన ఉగ్రవాదులు బుర్హాన్ వానీ, జకీర్ మూసాకు వారసుడిగా భావించేవాడని దర్యాప్తులో తేలింది. అతడు 2023 నుంచేఐఇడిల తయారీపై పరిశోధన చేస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అతడు పేలుడు పదార్థాలతో చాలా ప్రయోగాలు చేసేవాడని పోలీసు వర్గాలు తెలిపాయి.మరోవైపు'వైట్‌కాలర్'టెర్రర్ మాడ్యూల్‌లో పాల్గొన్న వైద్యుల తీవ్రవాదం 2019లోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుంచి పనిచేసే హ్యాండ్లర్లు ఉన్నత విద్యావంతులైన నిపుణులను పూర్తిగా డిజిటల్ మార్గాల ద్వారా ఉగ్రవాదులుగా తీర్చిదిద్దారని దర్యాప్తు అధికారులు తెలిపారు. నవంబర్ 10న పేలుడు పదార్థాలతో నిండిన కారును నడిపిన డాక్టర్ ముజమ్మిల్ గనై, డాక్టర్ అదీల్ రాథర్, డాక్టర్ ముజాఫర్ రాథర్, డాక్టర్ ఉమర్ టెర్రర్ సెల్ సభ్యులు ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో చురుకుగా ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత వెంటనే 'టెలిగ్రామ్'లోని ప్రైవేట్ గ్రూపులకు మార్చి, అసలు బ్రెయిన్‌వాషింగ్ ఇక్కడి నుంచే ప్రారంభించారని వివరించారు. దాడులు, ఉగ్ర ప్లాన్ విషయంలో మిగిలిన వారితో అభిప్రాయభేదాలు రావడంతో మరో ఉగ్రవాది ఆదిల్ రాథర్ పెళ్లికి ఉమర్ హాజరుకాకపోయినట్లు గుర్తించారు. కశ్మీర్‌లో ముఫ్తీ ఇర్ఫాన్ అరెస్టు విషయం తెలియగానే అక్టోబర్ 18న హడావుడిగా ఖాజీగుండకు వెళ్లి మిగిలిన తమ గ్రూప్‌లోని సభ్యులతో భేటీ నిర్వహించి వారిని అప్రమత్తం చేశాడు. ఫరీదాబాద్ ఉగ్రకుట్రలోని మిగిలిన సభ్యులైన ముజమ్మిల్, ముఫ్తీ ఇర్ఫాన్, ఆదిల్‌లు అల్‌ఖైదా భావజాలంతో పనిచేస్తుంటే, ఉమర్ మాత్రం ఐసిస్ తరహాలో పని చేయాలని భావించేవాడు. ఈ బృందంలో కొందరు అఫ్గానిస్థాన్‌కు కూడా వెళ్లేందుకు ప్రయత్నించినా విఫలమైంది. ముఖ్యంగా ఈ గ్రూపులో ఉమర్ లెక్కలేకుండా నిధులు ఖర్చుపెట్టడంపై అభిప్రాయభేదాలు ఉన్నాయి.ఈనిధుల్లో అత్యధిక భాగం మహిళా సభ్యురాలైన డాక్టర్ షాహీన్ నుంచి లభించాయి. ఉగ్ర డాక్టర్ల గ్రూపు తమను తాము తాత్కాలిక అన్సార్ ఘజ్వతుల్ హింద్ సంస్థగా చెప్పింది. ఈ బృందానికి డాక్టర్ ఆదిల్‌ను అమీర్ (నాయకుడిగా)గా ఎంచుకొంది. ఇది భారత ఉపఖండంలో అల్‌ఖైదాకు అనుబంధంగా పనిచేస్తుంది. పోలీసులు కూడా ఈ ఉగ్రముఠాకు జైషే, అన్సార్ ఘజ్వతుల్ హింద్‌లతో సంబంధాలున్నట్లు ధ్రువీకరించారు.ఈ ముఠాలోని ముజమ్మిల్ రష్యా తయారీ రైఫిల్‌ను రూ.5 లక్షలకు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఇందుకోసం డాక్టర్ షాహీన్ నెట్‌వర్క్‌లోని కాంటాక్ట్‌లను వాడుకొన్నాడు. ఆదిల్‌ను అరెస్టు చేసిన సమయంలో ఆ ఆయుధాన్ని ఓ లాకర్ నుంచి భద్రతా దళాలు స్వాధీనం చేసుకొన్నాయి. దీంతో పాటు పేలుడు పదార్థాలను ఉంచడానికి కూడా షాహీన్ సాయంతో ముజమ్మిల్ ఓ డీప్ ఫ్రీజర్ కూడా కొనుగోలు చేశాడు. ఉష్ణోగ్రతకు ప్రభావితం అయ్యే రసాయనాలను దీనిలో భద్రపరిచేవారు. ప్రస్తుతం వీటిని ఫోరెన్సిక్ బృందాలుపరిశీలిస్తున్నాయి. వీటి కొనుగోళ్లకు పుల్వామా దాడి కుట్రదారుడు ఉమర్ ఫరూఖ్ భార్య అఫ్రా బీబీ సాయంతీసుకున్నారు. అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ మేనల్లుడే ఈ ఫరూఖ్. ఇతడిని 2019లో భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. ఇక మరో రష్యా తయారీ రైఫిల్, చైనా తయారీ స్టార్ పిస్టోల్, బెరెట్టా పిస్టోల్, 2,900కిలోలపేలుడుపదార్థాలను అనంతరం స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా రసాయనాలను నూహ్ నుంచి, ఎలక్ట్రానిక్ పరికరాలను ఢిల్లీలోని భాగీరథి ప్లేస్, ఫరీదాబాద్‌లోని ఎన్ఐటీ మార్కెట్ నుంచి సేకరించింది.

**పాఠశాల సమీపంలో పెద్ద మొత్తంలో జిలెటిన్ స్టిక్స్ లభ్యం**

మరోవైపు ఉత్తరాఖండ్‌లోని ఓ పాఠశాల సమీపంలో పెద్ద మొత్తంలో జిలెటిన్ స్టిక్స్‌ను పోలీసులు కనిపెట్టారు. దీంతోఅప్రమత్తమైన అధికారులు ఆ ప్రాంతంలో విస్తృత సోదాలునిర్వహించారు. అల్మోరా జిల్లా దబారా గ్రామంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ప్రధానోపాధ్యాయుడు అనుమానాస్పద వస్తువులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబు స్క్వాడ్ సహా భద్రతాధికారులు అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. సమీప పొదల్లో భారీగా జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించినబాంబు నిర్వీర్వ దళాలు వాటిని అక్కడి నుంచి తరలించాయి. 20 కిలోల బరువున్న 161 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామని సీనియర్ సూపరింటెండెంట్ అధికారిదేవేంద్రపించా వెల్లడించారు. సమీప ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేశామని, జిలెటిన్ స్టిక్స్ ఇక్కడ ఎవరు, ఎందుకుపెట్టారనేదానిపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**సరైన అమలు నిర్ధారణ, విచక్షణ పరిధి తనిఖీ కోసం..**

# 'లోక్‌పాల్' చట్టానికి మార్పులు అవసరం

**సంబంధిత వర్గాలు వెల్లడి**




**న్యూఢిల్లీ :** అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ పనితీరును నియంత్రించేచట్టంలో 'విచక్షణ యొక్క ఏదైనా పనితీరును తనిఖీ చేయడానికి, దాని సరైన అమలును నిర్ధారించడానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది' అని ఆదివారంసంబంధితవర్గాలుతెలిపాయి. ఒక దశాబ్దం క్రితం అమలుచేయబడిన చట్టంలోని కొన్ని నిబంధనలను ఇప్పుడు 'పున: పరిశీలించాలని' ప్రభుత్వంలోని కొన్ని వర్గాలలో 'బలమైన భావన' ఉందిఅని వారు చెప్పారు. లోక్‌పాల్, లోకాయుక్తల చట్టం 2013 (2013 చట్టం) 2014 జనవరి 1న అమలులోకి వచ్చింది. అయితే దాని చైర్‌పర్సన్, సభ్యుల నియమాకం తర్వా త 2019 మార్చి 27నుంచి మాత్రమే ఇదిపనిచేయడం ప్రారంభించింది. లోక్ పాల్‌కుప్రస్తుతంచైర్మన్‌గాపూర్వ సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ అజయ్ మాణిక్‌రావు ఖాన్‌విల్కర్ నేతృత్వం వహిస్తున్నారు. 8మంది సభ్యులు జ్యుడీషియల్, నాన్ జ్యుడీషియల్‌కు నలుగురు చొప్పున ఉండవచ్చు.'లోక్‌పాల్‌చట్టంలోని కొన్ని నిబంధనలనుపున:పరిశీలించి దాని సరైన అమలును నిర్ధారించుకోవాలనే బలమైన భావన ప్రభుత్వంలోని కొన్ని వర్గాలలోఉంది'అని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ, ప్రస్తుత చైర్మన్ కేసులను విచారించేటప్పుడు అందరు సభ్యులతో కూ డిన ఒకే ధర్మాసనం ద్వారా పనిచేయాలని ఎంచుకున్నారని ఆ వర్గాలు వెల్లడించాయి. అవినీతి ఫిర్యాదులపై నిర్ణ యం తీసుకోవడానికి ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది న్యాయలేదా న్యాయేతర సభ్యులతో కూడిన వేర్వేరు ధర్మాసనాలను అనుమతించేనిబంధనలుచట్టంలో ఉన్నాయనివర్గాలు తెలిపాయి. చైర్‌పర్సన్ సముచితమని భావించినట్లయితే చైర్‌పర్సన్ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయవచ్చు అని చట్టంలోని సెక్షన్ 16 (1) (బి) చెబుతోంది. అవినీతి ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి మాజీ లోక్‌పాల్ చైర్‌పర్సన్ జస్టిస్ (రిటైర్డ్) పినాకి చంద్ర ఘోష్ ధర్మాసనాలను ఏర్పాటు చేశారని వర్గాలు వెల్లడించాయి. అయితే , ప్రస్తుత లోక్‌పాల్ చైర్‌పర్సన్ ధర్మాసనాలను ఏర్పాటు చేయకుండా ఉండటం వల్ల అవినీతి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడంలో ప్రభావం చూపిందని మరొక వర్గం తెలియజేసింది. లోక్‌పాల్ చట్టంలోని సెక్షన్ 20నిబంధనలను 'ప్రాథమిక విచారణ, దర్యాప్తు ప్రక్రియ'కు సంబంధించిన విచక్షణారహితంగాఉపయోగించడాన్ని కూడా ఆ వర్గాలు ఉదహరించాయి. ఫిర్యాదులు అందిన వెంటనే లోక్‌పాల్ నిందితుడిని దర్యాప్తు చేయడానికి చట్టం అనుమతిస్తుందని వారు చెప్పారు.

# పూర్తి నిర్ణయం 'హైకమాండ్‌దే..'

**కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఖర్గే ప్రకటన**



**బెంగళూరు:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలకు ఇంకా తెరపడడం లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ పార్టీ హైకమాండ్ ఏదైనా నిర్ణయిస్తుందని, ఇప్పుడు తాను చెప్పడానికి ఏమీ లేదని అన్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో గంటకు పైగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జరిగిన పరిణామాల గురించి తాను ఏమీ చెప్పలేనన్నారు. ఏదైనా హైకమాండ్ నిర్ణయిస్తుందన్నారు. దాని గురించి మీరు ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖర్గే పేర్కొన్నారు. నవంబర్ 20న కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం రోజులు పూర్తి చేసుకుంది. దీంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు చెలరేగుతుండగా, అధికార పార్టీలో అధికార పోరు తీవ్రమైంది. శనివారం రాత్రి ఖర్గేతో భేటీ అయిన తరువాత సిద్ధ రామయ్య మాట్లాడుతూ హైకమాండ్ నిర్ణయించిన దానికి తాను కట్టుబడి ఉంటానని, అందరూ కూడా కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. అయితే, నాయకత్వ మార్పు చుట్టూ ఉన్న వార్తలను, ఊహాగానాలు మీడియా సృష్టి అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నవంబర్ 20న రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున, శివకుమార్‌కు మద్దతు ఇస్తున్న కొంత మంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి ఖర్గేను కలిసిన తర్వాత, ముఖ్యమంత్రి ఎఐసిసి చీఫ్‌తో సమావేశమయ్యారు. ఖర్గేను కలవడానికి ఢిల్లీకి వెళ్తున్న శాసనసభ్యుల గురించి తనకు తెలియదని శివకుమార్ అన్నారు. ఆదివారం సిఎం సిద్ధరామయ్యకు సన్నిహితులుగా భావిస్తున్న మంత్రులు హెచ్‌సి మహదేవప్ప, కె వెంకటేష్ ఖర్గేను తన నివాసంలో కలిశారు. సిద్ధరామయ్య తన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ఒత్తిడి తెస్తుండగా, పార్టీ నాయకత్వ మార్పుపై ముందుగా నిర్ణయం తీసుకోవాలని శివకుమార్ కోరుకుంటున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ హైకమాండ్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను ఆమోదిస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పూర్తి ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేస్తారని, ఇది శివకుమార్ ప్రతిష్టాత్మక పదవిని చేపట్టే అవకాశాలను దెబ్బతీస్తుందని భావిస్తున్నారు. మే 2023లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది, కాంగ్రెస్ ఆయనను ఒప్పించి డిప్యూటీ సీఎంగా చేసింది.




# మౌనం తెలియని అరుంధతి కలం

చాలా మంది రచయితలు 'రక్షణాత్మక' విధానాన్ని అనుసరిస్తారు. వ్యక్తి ప్రయోజనాల కోసం వెంపర్లాడతారు. అతి కొద్ది మంది మాత్రమే సమాజ హితాన్ని కోరుతారు. సామాజిక రుగ్మతలను నిలదీసి, ప్రశ్నిస్తారు. మార్పు కోసం గళం విప్పుతారు. అలాంటి సామాజిక స్పృహగల వారి జాబితాలో అరుంధతి రాయ్ పేరు మొదటి వరుసలో ఉంటుంది. ఆమె.. శక్తి, సాహసం, సత్యం సంగమించిన కలం. సమకాలీన భారతీయ సాహిత్యంలో అరుంధతి ఓ ధిక్కార స్వరం. వెలుగులు వెదజల్లే అగ్నికణం. అంతులేని ఆత్మస్థైర్యం. అందుకే, ఆమె కలానికి మౌనం తెలియదు. భయం అసలే లేదు. లోతైన ఆలోచనలు.. మానవత్వపు సువాసలు వెదజల్లే ఆమె రచనలు కొంత మందికి రుచించవు. మనసును తాకే శక్తివంతమైన ఆ శబ్దాలు వినడానికి కొంత మంది భయపడతారు. అణచివేతకు గురైన గుండెల నుంచి రగిలే ప్రశ్నలు, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా వెల్లువెత్తే ధిక్కారానికి ఆమె ప్రతినిధి కావడాన్ని సహించలేని వారు కూడా ఉన్నారు. ఎవరు ఏమనుకున్నా.. ఎవరు ఏ కోణం నుంచి చూసినా, అరుంధతి తన సిద్ధాంతాలను మార్చుకోలేదు. ఎవరికీ వంతపాడలేదు. తన మొట్టమొదటి నవల 'ద గాడ్ ఆఫ్ స్మాల్ థింక్స్'తో సాహితీ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ పుస్తకాన్ని చదివిన ప్రతి పాఠకుడు ఒక కవిత్వాత్మక ప్రపంచంలోకి అడుగుపెడతాడు.. అదే సమయంలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుంటాడు. అందులో చిన్నవైన భావోద్వేగాలకు అరుంధతి పెద్దపీట వేసింది. ప్రేమ, వ్యథ, వర్గ వివక్ష.. ఇలా అనేకానేక అంశాలు ఆమె కలం స్పర్శతో ఒక అద్భుతమైన నాట్య రూపాన్ని దాల్చుతాయి. ఈ రచన ఆమెకు ప్రపంచస్థాయిలో గౌరవాన్ని తెచ్చిపెట్టింది. 'రాయడం' చాలా మందికి హాబీ కావచ్చు.. ఆమెకు మాత్రం ఒక సామాజిక బాధ్యత. 'నర్మదా బచావో' ఆందోళన నుంచి 'గ్లోబలైజేషన్' దుష్ప్రభావాల వరకూ... కశ్మీర్ నుంచి ఆదివాసీ అరణ్యాల వరకూ.. ఆమె స్పృశించని సమకాలీన సమస్య లేదు. అందుకేనేమో, ఆమె రచనలు చదువుతుంటే, ఎవరో చెప్పిన కథను వింటున్నట్టుకాదు... మన ఆత్మతో మనమే సంభాషించుకున్నట్టు ఉంటుంది. ఆమె రాసే ప్రతి అక్షరం మన కలల్ని జాగృతం చేస్తుంది. అరుంధతి మాటల్లో అగ్ని జ్వాలలే కాదు.. కన్నీటి చుక్కలూ ఉంటాయి. అన్యాయాలను సహిస్తూ... భరిస్తూ.. మౌనంగా ఉండకూడదన్న సత్యం పాఠకులకు గుర్తుకొస్తుంది. మనలోని మనిషిని అరుంధతి మనకే కొత్తగా పరిచయం చేస్తుంది. మనలో నిక్షిప్తమైన బలాన్ని, సాహసాన్ని మనకే గుర్తుచేస్తుంది. భవిష్యత్తును ఊహింపచేస్తుంది. ఒక కలం ప్రపంచాన్ని కదిలించగలదని ఆమె రచనలు మనకు నిరూపిస్తాయి. అవమానాలను, అన్యాయాలను, అక్రమాలను, అణచివేతలను చూస్తున్నప్పుడు 'మనకెందుకు' అని కూర్చోవడం ఆమెకు తెలియదు. తన ప్రతి స్పందన ఎలాంటి పరాణామాలకు దారితీస్తాయనే విషయాన్ని కూడా ఆమె పట్టించుకోదు. 'భద్రత నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని స్పష్టం చేసే అరుంధతి, తన నైజాన్ని ప్రకటించుకుంటుంది. తొలి నవలకే ప్రతిష్ఠాత్మక బుకర్స్ ప్రైజ్ గెల్చుకోవడం ద్వారా అంతర్జాతీయంగా కీర్తిప్రతిష్ఠలు ఆర్జించడం కావచ్చు.. తడబాటు లేని రాజకీయ వ్యాఖ్యలు కావచ్చు.. ఆమె ప్రతి అడుగూ ఒక విశిష్టతను సంతరించుకుంది. అందుకే, ప్రశంసలతోపాటు తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కొంటున్నది. కొంత మంది ఆమెను 'దేశద్రోహి' అన్నారు. మరికొందరు జాతీయవాదానికి భంగం కలిగిస్తున్నదని విమర్శించారు. కానీ, అన్నింటినీ ఆమె ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా, ప్రశాంతంగా స్వీకరిస్తుంది. పొగడ్తలకు పొంగిపోదు. విమర్శలకు, ట్రోలింగ్‌లకు కుంగిపోదు. ఆమె రచనలు ఏదో ఒక సమస్య లేదా కీలక అంశం చుట్టూ తిరుగుతాయి. ఉన్నది ఉన్నట్టు ఘాటుగా చెప్తాయి. 'నిశ్శబ్దంగా ఉండలేనప్పుడు రాస్తాను' అనే ఆమె మాటల్లోనే, సమస్యలపై గళమెత్తుతునే ఉంటాననే స్పష్టత ఉంది. తన తొలి వ్యాసం 'ది ఎండ్ ఆఫ్ ఇమాజినేషన్' నుంచి నిన్నమొన్న విడుదలైన 'మదర్ మేరీ కమ్స్ టు మీ' వరకూ అరుంధతి విలక్షణ రచనా శైలిని, అంతకు మించి అత్యంత వివాదాస్పద అంశాలపై తన అభిప్రాయాన్ని వినిపించే తత్వాన్ని కొనసాగిస్తునే ఉంది. తన తల్లిని గురించి వివరిస్తూనే, తనను తాను ఆవిష్కరించుకున్న నవల 'మదర్ మేరీ కమ్స్ టు మీ' ఈ ఏడాది ఆగస్టు చివరిలో విడుదలైంది. ఇంతలా ఎందుకు రాస్తారన్న ప్రశ్నకు 'సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఎంతో ప్రధానంగా చర్చించాల్సిన విషయాలు ఉన్నాయి. అణ్వస్త్ర విస్తరణను ఉదాహరణంగా తీసుకుందాం. ఇది మానవత్వానికి విఘాతం. మనిషి తనను తాను నాశనం చేసుకోవడానికి సృష్టించాలనుకుంటున్న విధ్వంసం. సామాన్య ప్రజలు దీనిని అర్థం చేసుకోరు. వారి కోసం ఇలాంటి సమస్యలను ప్రస్తావిస్తాను. అందుకే రాస్తాను. నా రాతలన్నీ ప్రజలపై ప్రేమతో, వారి పట్ల నాకు ఉన్న బాధ్యతతో రాస్తున్నాను. లేకపోతే, బుకర్‌ప్రైజ్ వచ్చిందని, నా మొదటి నవలతోనే రచనలు ఆపేసేదాన్ని' అని ఓ ఇంటర్వ్యూలో తేల్చిచెప్పింది.


నేడు అరుంధతి రాయ్ జన్మదినం

అరుంధతి చెప్పినట్టు, ఆమెను 'దేశద్రోహి' లేదా 'జాతీయవిరోధి'గా పేర్కొంటున్న వారంతా నిజంగానే ఈ దేశాన్ని ప్రేమిస్తున్నారా అనేది ప్రశ్న. 'దేశభక్తులు' అని చెప్పుకునే వారిలో 99 శాతం మంది పన్నులు తప్పించుకుంటున్నారు. పిల్లలను అమెరికాకు పంపుతున్నారు లేదా తమ వ్యక్తిగత సంపదను కాపాడుకోవడానికే శ్రమిస్తున్నారు. అలాంటి వారే అరుంధతిని విమర్శిస్తుంటారు. కానీ, బహుముఖంగా విస్తరించిన ఆమె ప్రతిభను వీరి విమర్శలు అడ్డుకోలేవు. ఆమె సమీక్షించాలంటే, కేవలం రచయిత్రిగా చూస్తే సరిపోదు. రాజకీయాల్ని, ప్రేమను, హింసను, ద్రోహాన్ని ఒకే ప్రయోగశాల పీఠంపై ఉంచగల ఆమె ధైర్యాన్ని అర్థం చేసుకోవాలి. ఆమెలోని కవితాభావం ఒక ఝరిలా అంతర్లీనంగా ప్రవహిస్తునే ఉంటుంది. అందుకే ఆమె గద్యం కూడా కళాత్మకంగా ఉంటుంది... కవితాత్మకంగా సాగుతుంది. ఆమె వాక్యాల నిర్మాణం ఓ 'చిత్ర మాల'ను కళ్ల ముందు ఉంచుతుంది. 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'లో ఆమె పిల్లల దృష్టి కోణం నుంచి సమాజాన్ని చూస్తుంది. వ్యక్తగత... సామాజిక అంశాలు కలిసే విధానాన్ని కవితాత్మకంగా వివరించడం భారతీయ ఆంగ్ల సాహిత్యంలో అ రుదు. కొన్ని సందర్భాల్లో ఈ కవితాత్మక ధోరణిని కథను ముందుకు నెట్టే శక్తిని తగ్గిస్తుంది. అలాంటి సాహిత్య శైలిలో గొప్ప కవితాత్మక విలువలు ఉన్నప్పటికీ, నిర్మాణ క్రమశిక్షణ కూడా అవసరమని విమర్శలు అంటారు. ఈ అభిప్రాయాన్ని పూర్తిగా కొట్టేయడానికి వీల్లేదు. అదే సమయంలో, ఆ కవితా ధోరణే పాఠకుడిని చదివిస్తుందనే విషయాన్ని గుర్తుచేసుకోవాలి. సాహితీ రంగంలో ఆమెను అభిమానించవచ్చు... విరోధించవచ్చును.... కానీ పట్టించుకోకుండా ఉండడం మాత్రం అసాధ్యం. కులం, సైనికీకరణ, మతరాజకీయాలు, అసమానత వంటి కీలక అం శాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది కాబట్టి, ఆమె రచనలు నేరుగా, సూటిగా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో రా జకీయ వర్గాలను ఆందోళనకు గురి చేస్తాయి. సంప్రదాయాలను, మూసపోసిన విధానాలను తిరస్కరించే అరుంధతి భయం లేకుండా రాస్తుంది. అదే ఆమె బలం. మన చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి తప్పించుకొని ఎక్కడి వెళతారని అరుంధతి ప్రశ్నిస్తుంది. అందుకే, ఉన్న ప్రపంచాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచిస్తుంది. అరుంధతి ఒక సాంప్రదాయ నవలా రచయిత్రి కాదు కాబట్టే, ఆమె రచనలు రాజకీయంగా శత్రుత్వాన్ని రేపుతాయి. అయితే ఆమె పట్టించుకోదు. రాస్తునే ఉంటుంది. సమాజం ఆమెను మౌనంగా ఉండనివ్వదు. నిశ్శబ్దంగా ఉండలేనప్పుడు ఆమె రాస్తుంది. రాస్తునే ఉంటుంది. ఇదొక నిరంతర ప్రవాహం. సామాజిక శిలాపటంపై ముద్రపెట్టిన శాసనం. సూక్ష్మ మైన ప్రతిఘటన ఆమెకు నచ్చదు. ఏకంగా ప్రత్యక్ష యుద్ధాన్నే ప్రకటిస్తుంది. అందుకే, మతతత్వం, కుటిల రాజకీయాలు, సైనికీకరణ, జాతిహింస, లింగ ఆధారిత వివక్షలను నడిబజారులో కవాతు చేయిస్తుంది. నైతిక పతనాలు, భావ రుగ్మతల ఛాయాచిత్రాల మాదిరి భాసించే అరుంధతి కలం భారతీయ సాహిత్యంలో అలౌకిక స్వరం. ఆమె సంధించే ప్రశ్నలకు పాఠకుడు తొలుత అసౌకర్యానికి గురవుతాడు... తర్వాత ఆలోచిస్తాడు.. ఆపై వాస్తవాన్ని గ్రహిస్తాడు. ఆ క్రమంలోనే అరుంధతి ఆలోచనలను అర్థం చేసుకుంటాడు. తన తదుపరి మార్గాన్ని ఖరారు చేసుకుంటాడు. చాలా మంది రచయితలది భావ దారిద్ర్యమైతే, అరుంధతిది మాత్రం భయరాహిత్యం. ప్రతిపదం ఘోషాత్మకం. ప్రతి అక్షరం ఒక నిప్పు కణం.

**'కదిలేది కదిలించేదీ,**
**మారేది మార్పించేదీ,**
**పాడేదీ పాడించేదీ,**
**పెనునిద్దుర వదిలించేదీ,**
**మునుముందుకు సాగించేదీ,**
**పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ'** అంటూ సాహిత్యానికి నిర్వచనం ఇచ్చాడు మహాకవి శ్రీశ్రీ. అరుంధతి రచనల్లో ఈ లక్షణాలన్నీ కనిపిస్తాయి. ఆమె నుంచి మరిన్ని అద్భుత రచనలు రావాలని కోరుకుందాం. వస్తాయని ఆశిద్దాం.

**– సత్యశ్రీ**

## చదవాల్సిన పుస్తకం

# రష్యా విప్లవం.. భారత స్వాతంత్ర్య సంగ్రామం




రూపకర్త కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డికాగా, సంపాదకులుగా జయ మెహతా వ్యవహరించారు. వి. రాంనర్సింహారావు అనువదించారు. విఐ లెనిన్ నుంచి చంద్ర రాజేశ్వరరావు వరకు, అజయ్ ఘోష్ నుంచి డి. రాజా వరకు ఎంతో మంది ప్రముఖుల వ్యాసాలను అవసరాన్ని బట్టి అనువదించి, సంక్షిప్తం చేసి పాఠకులకు అందించారు. ప్రపంచ మహత్తర రెండు విప్లమోద్యమాలుగా రష్యా విప్లవాన్ని, భారత వలస వాద వ్యతిరేక పోరాటా న్ని పేర్కొన్నారు జయ మెహతా తమ ముందు మాటలో. అంతేకాదు... ఇవి అకడమిక్ ప్రచురణలు కావని స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వపు ఆలోచనలకు ప్రతిబింబాలుగా అభివర్ణించారు. ఆదిలోనే చెప్పినట్టు ఈ పుస్తక ప్రచురణకు మూలపురుషుడు సురవరం సుధాకర రెడ్డి స్వేచ్ఛా భారతంలో, వివిధ దశల్లో కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాసిన వ్యాసాల్లో భారత దేశంపై, అక్టోబర్ విప్లవ ప్రభావం గురించి శత వార్షికోత్సవ సందర్భంగా సేకరించాలన్న ఆయన అభిప్రాయమే ఈ పుస్తకానికి జన్మనిచ్చింది. 'యుద్ధోన్మాద దోపిడికి ఎగబడ్డ శక్తులకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం ధృడంగా నిలిచింది. దోపిడికి గురవుతున్న, అణగారిన వర్గాల ప్రజలకు, జాతీయ విమోచనోద్యమాలకు, సామ్రాజ్యవాద వ్యతిరేక అభ్యుదయ శక్తులకు అండగా నిలబడింది. మన స్వంత స్వాతంత్రోద్యమం రష్యా విప్లవం నుండి మొదటి సోషలిస్టు దేశం విజయవంతమవడం పట్ల ఉత్తేజాన్ని పొందింది. రష్యాలో విప్లవం విజయవంతమవడం, మన జాతీయ విముక్తి ఉద్యమం మధ్య బలోపేతమైన సంబంధాలు పెరిగిన మన దేశ స్వాతంత్ర్యానంతరం, దేశ పరిస్థితులలో నూతన పరిణామాలు సంభవించాయి. అనేకరంగాలైన ఆర్థికవాణిజ్య వ్యవసాయ విద్య శాస్త్రీయ పరిశోధనలుక్రీడలు సంస్కృతిక రంగాలలో అనేక రకాల సహకారం వికసించింది.నేటి భారతంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి సాధించుకొన్న వాటినన్నింటిని మితవాద శక్తులు నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే ఒక విషయాన్ని గమనంలో పెట్టుకోవాల్సింది ఏంటంటే ఫ్యూడలిజం, గుత్తపెట్టుబడిదారి, నయా వలస వాద విధానానికి వ్యతిరేకంగా దేశ ఆర్థిక స్వావలంబన కొరకు జరిగే పోరాటంలో సోవియట్ సహకారం బలోపేతమైన ఆయుధాలను సమకూర్చింది. కేవలం ఆర్థికపరమైన అంశాలపైననే కాకుండా రాజకీయ సమస్యలైన కాశ్మీర్, గోవా, బంగ్లాదేశ్లపై సోవియట్ యూనియన్ భారత్కు అండగా నిలిచింది. భారతదేశంసోవియట్ మైత్రి సుదీర్ఘకాలం పరస్పర ప్రయోజనాల కోసం కొనసాగుతు ఇది ఇండో సోవియట్ మైత్రి సహకార ఒప్పందంలో సైతం ప్రదర్శించబడుతున్నది' అంటారు సురవరం సుధాకర రెడ్డి ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తూ. రష్యా విప్లవంతో భారత స్వాతంత్ర్యోద్యం ఎందుకు ప్రభావితమైందో చెప్పడానికి ఈ మాటలు చాలు. ఉపోద్ఘాతంలో సైద్ధాంతికపరమైన పునాదులను



వివరిస్తే, రజనీ సామిదత్ తమ 'విప్లవాల విప్లవం' వ్యాసంలో పెద్ద ఎత్తున ఎగసిపడిన విప్లవాల తీరుతెన్నులను వివరించారు. 'అక్టోబర్ విప్లవ సైద్ధాంతిక ప్రాధాన్యత'ను ప్రభాత్ పట్నాయక్ గుర్తుచేసుకుంటే, 'జాతీయ, వలసల అంశంపై సైద్ధాంతిక ముసాయిదా' విఐ లెనిన్ వ్యాసంలో కనిపిస్తుంది. ఎంఎన్ రాయ్ 'జాతుల మరియు వలసల అంశంపై అనుబంధ థీసీస్' వివరిస్తారు. కాగా రెండో భాగంలో ' భారతదేశం, ఆసియాలపై అక్టోబర్ సోషలిస్టు విప్లవ ప్రభావం'పై చంద్ర రాజేశ్వరరావు వ్యాసం ఉంది. జి.అధికారి, సి.అచ్యుత మీనన్, విజయ్ కుమార్ సిన్హా, హజ్రాబేగం వ్యాసాలు ఈ భాగంలో ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర దశను మూడో భాగంలో పొందుపరిచారు. అజయ్ ఘోష్, బిటి రణదివే, రాజీవ్ సక్సేనా, ఎబి బర్ధన్, షమీమ్ ఫైజీ వ్యాసా లు ఈ భాగంలో ఉన్నాయి. కాగా, 'విప్లవం మహత్తర జ్యోతిని వెలిగించింది' అంటారు డి.రాజా. 'పాలకవర్గాలు కమ్యూనిస్టు విప్లవం పట్ల వణికిపోదురుగాక, శ్రామికులకు సోయేదిఏమిలేదు. బాని ససంకెళ్ళు తప్ప. వారి ముందు ప్రపంచం ఉంది జయించడానికి. 184748లలో మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో చివరన ప్రకటించారు. వారు వర్గ పోరాటాల చరిత్రను గత తర్కకంగా, చారిత్రకంగా వివరించారు. వీరు దీని అనివార్యత విప్లవానికి దారితీస్తుందన్నారు. అలాగే రాజకీయాధికారాన్ని సాధించి, దోపిడి, అణచివేత పరిస్థితులను త్రోసేసి, ఈ విప్ల వం నూతన నాగరికతకు, సోషలిస్టు సమాజానికి పునాదులు వేసింది. రష్యాలో పాలకవర్గాలు విప్లవం పట్ల వణికిపోయాయి. విప్లవం నవంబర్ 7(అక్టోబర్ 25) 1917లో విజయవంతమైంది. ఈ ఘటన ప్రపంచాన్ని వణికించింది. సోషలిజం అనేది కేవలం భావం మాత్రమే కాదు. ఊహాజనితం కూడా కాదు. అది వాస్తవ రూపం దాల్చింది. సోషలిజం భావన ప్రజల మస్తిష్కంలో చొచ్చుకుపోయింది. ప్రపంచ వ్యాపితంగా ఈ భావన విస్తరించింది' అంటూ సాగే వ్యాసంలో ఆయన రష్యా విప్లవ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఏ విధంగా ఉందనే విషయాన్ని కళ్లకు కడతారు. ఇలాంటి ఎంతో మంది మేధావులు, నాయకులు, సిద్ధాంతకర్తల వ్యాసాల సంకలనంగా వెలువడిన ఈ పుస్తకాన్ని కేవలం కమ్యూనిస్టు పార్టీకి పరిమితమైనదిగా ఎంచుకోవడానికి వీల్లేదు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నదో ఈ వ్యాసాలు స్పష్టం చేస్తాయి. కార్మిక ఐక్యత, పోరాటాల అవసరాన్ని గుర్తుచేస్తాయి. అందుకే, ఇది తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేరుతుంది.

### పుస్తకం పేరు


**రష్యా విప్లవం.. భారత స్వాతంత్ర్య సంగ్రామం**

**రూపకర్త: సురవరం సుధాకర రెడ్డి, సంపాదకులు : జయ మెహతా, అనువాదం: వి. రాంనర్సింహారావు, వెల: రూ. 160**

### ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**


## మానవతా విలువలకు ప్రాధాన్యం




సామాన్యుల జీవితాలను మానవీయ కోణంలో చూసి, మానవతా విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన రచయిత థామస్ హార్డీ. అతను రచించిన టెస్ ఆఫ్ ది డి'అర్బర్‌విల్స్ (1891) నవల ఇందుకు ఉదాహరణ. ఆంగ్ల సాహిత్యంలో అ ద్భుతమైన, హృదయాన్ని కలచివేసే నవలగా పేరుపొందిన ఈ రచన, పేదరాలైన, అమాయక గ్రామీణ యువతి టెస్ డ ర్బీఫీల్డ్ జీవితాన్ని వివరిస్తుంది. విధి, సమాజంలోని అన్యా యం, నైతిక కపటత్వం వంటి అంశాలను రచయిత ప్రస్తావించిన తీరు చాలా గొప్పగా ఉంటుంది. ఇందులోని కథ మానవ విలువలపై గాఢమైన ప్ర శ్నలను లేవనెత్తుతుంది. టెస్ తండ్రి తన కుటుంబం పురాతన డి'అర్బర్‌విల్ వంశానికి దూర సంబంధముందని తెలుసుకుని, ఆ బంధాన్ని ఆధారంగా చేసుకుని సామాజికంగా ఉన్నత స్థానం పొందాలని ప్రయత్నిస్తాడు. ఆ క్రమంలోనే ధనికుడైన డి'అర్బర్‌విల్ వారసుడు అలెక్ వద్ద సహాయం అడగమని టెస్‌ను పంపుతాడు. అక్కడ అలెక్ యొక్క మోసపూరిత వ్యవహారం, కా మంతో నిండిన వ్యక్తిత్వం టెస్ జీవితాన్ని శాశ్వతంగా మార్చివేస్తుంది. అ తను తొలుత ఆమెను ప్రలోభపెడతాడు. అనంతరం ఆమెను అనుభవిస్తాడు. ఫలితంగా టెస్ గర్భం దాలుస్తుంది. తన పరిస్థితిని బయటకు చెప్పుకోవడానికి సిగ్గుపడుతుంది. అపరాధ భావం పెరుగుతుంది. సమాజపు హేళనలు, అపవాదులు, దౌర్జన్యాల మధ్య టెస్ తన జీవితాన్ని తిరిగి నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుంది. టాల్బోతేస్ డేయిరీ వద్ద డైరీమేడ్‌గా పనిచేస్తున్నప్పుడు ఆమెకు ఏంజెల్ క్లేర్ అనే ఆదర్శవాద యువకుడు కలుస్తాడు. అతడిలోని ద య, అనురాగం టెస్ జీవితంలో కొత్త ఆశను నింపుతుంది. ఇద్దరూ గాఢం గా ప్రేమలో పడతారు. కానీ పెళ్లి తర్వాత, టెస్ గతాన్ని నిజాయితీగా చెప్పినప్పుడు, ఏంజెల్ ఆదర్శవాదం సడలిపోతుంది. తనకు నైతిక లోపం ఉందని టేస్ అంగీకరించినప్పటికీ, ఆమెను క్షమించలేక అతడు బ్రెజిల్‌కు వెళ్లిపోతాడు. ఒంటరితనం, పేదరికం మధ్య టెస్ మళ్లీ అలెక్ వద్దకు వెళుతుంది. అతను తాత్కాలికంగా కొంతకాలం సంరక్షుడి అవతారం ఎత్తుతాడు. కానీ, అతని నిజ స్వరూపం మళ్లీ బయటపడుతుంది. ఆమెను వెంటాడే ప్రయత్నం చేస్తాడు. టెస్ జీవితం దుర్భరంగా మారుతున్న సమయంలో, బ్రెజిల్ వెళ్లిన ఏంజెల్ తిరిగి వస్తాడు. తన తప్పును గ్రహించి టెస్ నిజమైన మంచితనం తెలుసుకుంటాడు. కానీ అప్పటికే ఓ విషాద ఘటన చోటు చేసుకుంటుంది. అలెక్ బాధను భరించలేక టెస్ అతనిని హత మారుస్తుంది. అమెను తీసుకొని ఏంజెల్ గ్రామీణ ప్రాంతానికి వెళతాడు. ఎవరికీ తెలియకుండా, అజ్ఞాతంలో ఉండాలని వాళ్లిద్దరూ అనుకుంటారు. కానీ, టెస్‌ను దురదృష్టం వెంటాడుతుంది. పోలీసులు అక్కడికి చేరుకొని, ఆమెను అరెస్టు చేస్తారు. ఆమెకు మరణ శిక్ష పడుతుంది. టెస్ చెల్లెలు లైజాలూతో ఏంజెల్ తన జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. ఈ నవల విక్టోరియన్ కాలపు కఠిన నైతిక ప్రమాణా లు, వర్గవివక్ష, మహిళలపై జరిగిన అన్యాయం పట్ల హార్డీ చేసిన కఠోరమైన విమర్శ. సమాజపు నిర్వచనాల కన్నా హృదయం యొక్క పావిత్ర్యం గొప్పదని ఈ రచన స్పష్టం చేస్తుంది. టెస్ పాత్ర మానవతా విలువల పట్ల సున్నితమైన స్పందనను కలిగిస్తుంది. ఆమె బాధ, ప్రేమ, ద్రోహం, విధి యొక్క క్రూరత.. ఇవన్నీ పాఠకుడిని లోలోపల కదిలిస్తాయి. హార్డీ భాష సున్నితమైన వర్ణన, గ్రామీణ ఆంగ్లజీవనం, సామాజిక విరుద్ధతలను జీవమంతంగా చిత్రిస్తుంది. మొత్తం మీద, ఇది ప్రేమ, విధి, మానవ సమాజంలోని అన్యాయం కారణంగా, ఒక జీవితం నాశనమయ్యే విషాదకావ్యం. పాఠకుల హృదయాల్లో టెస్ అనే పావిత్రమైన ఆత్మ శాశ్వతంగా నిలిచిపోతుంది.

## జీవిత పాఠం చెప్పే రచన 'ది అల్కెమిస్ట్'

బ్రెజిలియన్ రచయిత పాలో కొయెలో రాసిన ది అల్కెమిస్ట్ (O Alquimista) నవల పోర్చుగీసు భాషలో తొలుత 1988లో వెలువడింది. జీవిత పాఠాన్ని చెప్పే రచన గా విస్తృత ప్రచారం పొందింది. అందుకే, తక్కువ కాలంలో నే ప్రపంచ వ్యాప్తంగా అత్యధి భాషల్లోకి అనువాదమైంది. అత్యధికంగా అమ్ముడైన నవలల్లో ఒకటిగా నిలిచింది. అంతర్జాతీయ బెస్ట్ సెల్లర్‌గా రికార్డులు సృష్టించింది. స్పెయిన్‌లోని ఒక చిన్న జాగ్రత్తగల గొర్రెల కాపరి సాంటియాగో ఈ పుస్తకంలోని ప్రధాన పాత్ర. తనకు ఈజిప్టు పిరమిడ్‌ల దగ్గర నిధి దొరికినట్టు తరచు కల కనేవాడు. ఒక జిప్సీ మహిళ, మెల్‌చిజెడెక్ అనే ఓ వయోవృద్ధుడు కూడా ఇలాంటి కలనే వివరిస్తూ ఉంటారు. అంతేకాదు, ఆ కలను నిజం చేసుకోవడానికి పిరమిడ్స్ వద్దకు వెళ్లాలని సూచిస్తారు. మనసులో ఆశపడ్డ సాంటియాగోకు ఈ సూచన మరింత ప్రేరణనిస్తుంది. నిధిని అన్వేషించడానికి బయలుదేరుతాడు. మార్గ మధ్యంలో అతనికి ఒక ఆంగ్లేయుడు కలుస్తాడు. అతను 'ఆల్కెమీ' అనే శాస్త్రాన్ని నేర్చుకుంటూ, ఏ లోహాన్నయినా బంగారంగా మార్చగలనని నమ్ముతుంటాడు. తన వాదనకు రుజువుగా 'ఎమరాల్డ్ టాబ్లెట్' అనే రహస్య గ్రంథాన్ని చూపిస్తాడు. కానీ, సాంటియాగో నేరుగా ఈజిప్టు చేరుకొని, పిరమిడ్‌ల వద్ద నిధి కోసం వెతుక్కోవడానికే ప్రాధాన్యం ఇస్తాడు. అందుకే, తన ప్రయాణాన్ని కొ నసాగిస్తాడు. ఈసారి అతనికి నిజమైన 'అల్కెమిస్ట్' పరిచ యం అవుతాడు. అయితే, లోహాన్ని బంగారంగా మార్చడం ఎలాగో చూపించడు. అంతకు మించి అత్యంత గొప్ప బోధన చేస్తాడు. అదే హృదయాన్ని వినగలడం.. జీవితానికి అసలైన ప్రాధాన్యతను గుర్తించడం. కలను నెరవేర్చుకోవడానికి వ్యక్తిగత పంథాను అనుసరించలే తప్ప, లేనిదాని కోసం ఆశపడి పరుగులు తీయడం కాదని బోధిస్తాడు. ప్రతి మనిషికి జీవన యాత్రలో ఒక ప్రత్యేక గమ్యం ఉంటుంది. ఒకరు నిజంగా ఆ గమ్యాన్ని అందుకోవాలనుకుంటే, విశ్వం అంతా సహాయపడుతుంది. మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులు, దారి తప్పించే వ్యక్తులు లేదా నిరుత్సాహం వంటివి కేవలం పాఠాలు మాత్రమే. అంతిమ ఫలితం ధనం, ఆభరణాలు కాదు.. తన స్వప్నాన్ని నెరవేర్చగల అంతర్గత శక్తిని తెలుసుకోవడం. ఇదే విషయాన్ని అల్కెమిస్ట్ పాత్ర ద్వారా గొప్పగా చెప్పిస్తాడు రచయిత పాలో కొయెలో. 'ది అల్కెమిస్ట్' ఒక సాధారణమైన కథ అయినప్పటికీ, లోతైన తత్త్వ పాఠాలను అందిస్తుంది. పుస్తక కథనం ఒక కలల ఆధారంగా కొనసాగుతున్నట్టు కనిపిస్తుంది. కానీ, ప్రతి సంభాషణలో తూర్పుపశ్చిమ తత్వశాస్త్రాల కలయిక కనపడుతుంది. సూఫీ తత్వం, క్రైస్తవ మిస్టిసిజం, హిందూ ఆత్మసాక్షాత్కార భావనల సారాంశాన్ని అతను ఒకే రూపంలోకి తీసుకొస్తాడు. అందుకే, ఈ పుస్తకం ఆధునిక స్ఫూర్తిదాయక సాహిత్యంలో అత్యంత ప్రభావం చూపిన రచనల్లో ఒకటిగా నిలిచింది. అనేక వ్యాపారవేత్తలు, క్రీడాకారులు ఈ పుస్తకంలోని ఆత్మవిశ్వాసం, పట్టుదల, కలలపై నమ్మ కం అనే పాఠాలను తమ జీవితాల్లో అన్వయించిన ఉదాహరణలు ఉన్నాయి. అల్కెమిస్ట్ కేవలం సాంటియాగో యాత్రగాథ మాత్రమే కాదు.. ఆశల నీడల వెం బడి పరిగెత్తే ప్రతి ఒక్కరికీ సంబంధించిన కథ. ఈ గుణం దాదాపుగా ప్రతి ఒక్కరిలో నూ ఏదో ఒక స్థాయిలో ఉంటుంది. అందు కే, దీనిని చదివిన ప్రతి పాఠకుడు సాంటియాగో పాత్రను తనకు అన్వయించుకుంటాడు. వాస్తవ 'అల్కెమిస్ట్' తనలోనే దాగున్న విషయాన్ని గ్రహిస్తాడు. ఈ పుస్తకం అత్యంత ప్ర జాదరణ పొందడానికి కథ, కథనం ఒక ఎత్తయితే, పాలో కొయెలో రచనా శైలి మరో ఎత్తు. ఎలాంటి భావ సంక్లిష్టతలేని సరళమైన భాషలో, కవితాత్మకమైన సాధారణ రీతిలో రచన కొనసాగుతుంది. అందుకే, ఎవరై నా సులభంగా చదవడానికి వీలవుతుంది. ఇక, పుస్తకంలోని ప్రతి సంభాషణలో సూ ర్యుడు, ఎడారి, గాలులు వంటి ప్రకృతి అలంకారాల ద్వారా ఆ ధ్యాత్మికతను వ్యక్తం చేస్తాడు రచయిత. జిప్సీ మ హిళ చెప్పే జోస్యం, చేసిన సూచనలు మ నుషుల్లో ని ఆశా ప్రవృత్తిని జాగృతం చేసే కారకాలు. అల్కెమిస్ట్ బోధ మన మనసు లోతుల్లో ని భావాల ప్రతిబింబాలు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేకానేక త త్వాలను అనుసంధానించి, మ నసును మించిన ప్రేరణ ఎక్కడా ఉండదని నిరూపిస్తాడు. మనసులో దృఢంగా నిశ్చయించుకొని కలలను సాకారం చేసుకోవాలని, దగ్గరదారుల కోసం వెతుక్కోవద్దని హితవు పలుకుతాడు. అతని సిద్ధాంతాన్ని అనుసరించి ప్రతి మనిషీ తన అంతర్ముఖాన్ని తెలుసుకోవాలి, కలల వైపు నడవాలి, విశ్వాసం పెట్టిన మార్గం చివరకి నిజమైన అర్థాన్ని ఇస్తుంది.




ఈ వారం కవితలు

## మరణం ఏదీ నీ చిరునామా

ఎన్ని తూటాలు పేలినా
ఎన్ని దేహాలకు తూట్లు పొడిచినా
ఆగదు భావజాలం!
అదో నిరంతర ప్రవాహం
అమృత ధారలా దూకుతుంది
చేపలా ఎదురెక్కుతుంది

అడవి బతికిందే ఆదివాసి చలువ
జంతు మచ్చిక ఆదివాసికి వెన్నతో పెట్టిన
విద్య
గుట్టలు కొండలు తొలిచిన పెట్టుబడి కన్ను
అడవిపై పడింది
మనిషి బతుకును ఛిద్రం చేయగలిగితే
ఖనిజాల కొల్లగొట్టే తంత్రం!

మారేడుమిల్లి సతత హరితం
రుధిర ధారలు ఆకుల నిండా
వంగమూరు వంచించబడినందుకు
కన్నీటి పర్యంతం
గాండ్రించే పులులు మౌనం వహించి
హిడ్మాకి సంతాపం తెలుపుతున్నాయి

ఎన్ని వంకరలు ఎన్ని మలుపులు
ఎన్ని ఎత్తు పల్లాలు మారేడుమిల్లి దారిలో
మార్క్సిజం గమ్యం చేరే మార్గంలో లాగే

తన నేలలో తానే చంపబడుతుంటే
పెగిలిన గొంతులు వెళ్ళిపోతున్నాయి
కూకూ రాగాల పక్షులు సైతం విషాదంలో
మునిగిపోయాయి

పూర్వతిలో మోగిన అంతిమయాత్ర
డప్పులు మేలుకొలుపు ధ్వనులు
జలజల రాలిన కన్నీరు రేపటి మహోద్య



మపు వెల్లువ జలగం నుండి షా దాకా
కూలిపోతుందనుకునే భ్రమలో
నిటారుగా నిలబడి తన ఉనికిని చాటుకునే
శక్తి భావజాలానిది!

**గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**

## పుస్తకాల నిలయం గ్రంథాలయం

జ్ఞాన భాండాగారం గ్రంథాలయం
పుస్తకాల నిలయం
విజ్ఞాన సంపద
మనిషి వికాసానికి మూల స్తంభాలు
సమాచార కేంద్రం గ్రంథాలయం!

బంగారు భవిష్యత్తుకు బాటలు
బాలల వినోదాల గ్రంథాలయం
తరతరాల విజ్ఞాన సంపద
మనిషిని మనీషిగా మార్చేది!
సరస్వతి నిలయం గ్రంథాలయం

భవితకు బాట గ్రంథాలయం
అక్షరాల ఆలయ మది
పుస్తకాల పరిచయం అది!

విలువలెన్నో నేర్పుతది
విజ్ఞానులను చేస్తది
పాఠకులకు జ్ఞాన సంపద
సమాజ వికాసానికి మూల స్తంభాలు!

**దేవులపల్లి రమేశ్,**
**9963701294**



## ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పైడకుల అశోక్ రెండవ సారి ఎన్నిక

**ప్రజాపక్షం/మంగపేట:** ఆదివారం రోజున అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ప్రకటన చేసిన జాబితా లో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా రెండవ సారి ఎన్నిక అయినా డైనమిక్ లీడర్ ప్రజా నాయకులు పైడకుల అశోక్ పటేల్ ని హన్మకొండ సుబేదారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కారించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఈ సందర్భంగా నిజాయితీ నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో అండగా నిలబడి ములుగు గడ్డ మీద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసిన అశోక్ కే మళ్ళీ పట్టం కట్టిన ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ రెండవ సారి అధ్యక్షులు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంతన్నకి మంత్రి సీతక్కకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమం లో జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి కోడం బాలకృష్ణ, మాజీ మల్లూరు దేవస్థానం చైర్మన్ పురుషోత్తం, గంగినేని శేషగిరి, ఆకు పవన్ పాల్గొన్నారు.

## భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు: కలెక్టర్

**ప్రజాపక్షం/ వరంగల్ :** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలల్లో భగవాన్ సత్యసాయి బాబా చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, సత్య సాయి ట్రస్ట్ భక్తులు, జిల్లా అధికారులు భక్తిశ్రద్ధలతో పూలమాలలు సమర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవా స్ఫూర్తి, ఆయన బోధించిన మానవతా విలువలను స్మరించుకుంటూ జిల్లాలో విద్యార్థులను సన్మార్గంలో నడిపించుటకు స్ఫూర్తి అనే కార్యక్రమాన్ని రిటైర్డ్ ఉద్యోగస్తులు, జిల్లా అధికారులు నిర్వహించారు. ఇందులో సత్యసాయి భగవాన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని పిల్లలకు సన్మార్గాన్ని బోధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, స్పోర్ట్స్అండ్ యూత్ ఆఫీసర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ఉద్యమకారులకు ఇళ్లు కేటాయించాలని వినతి



**ప్రజాపక్షం/ములుగు:** పూర్వ ఉద్యమకారులకు ఇండ్లు కేటాయించాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు ముంజల బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి పూర్వ ఉద్యమకారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తప్పకుండా పూర్వ ఉద్యమ మిత్రులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. బిక్షపతి వెంట ఉద్యమ మిత్రులు బిక్కినేని రామారావు, కృష్ణన్న, ఈసాల చంద్రయ్య, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు బొమ్మిడి సాంబయ్య, తదితరులు ఉన్నారు.

## భద్రకాళీ మాఢ వీధుల నిర్మాణ పనులు వేగవంతం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ:** భద్రకాళి ఆలయ మాఢ వీధుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో భద్రకాళి మాఢ వీధుల నిర్మాణ పనులు, వాటి పురోగతి,సుందరీకరణ పనులతో పాటు రోప్ వే, గ్లాస్ బ్రిడ్జ్ వే ఏర్పాటు పై కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళి ఆలయం మాఢ వీధుల నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలు, సుందరీకరణ పనులు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, ఏర్పాటు చేయనున్న రోప్ వే, గ్లాస్ బ్రిడ్జి వే అంశాలను సమావేశంలో చర్చించారు. నిర్మాణ, సుందరీకరణ పనులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి ఆలయ మాఢ వీధుల విస్తరణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళీసేవలో మంత్రి వాకిటి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర పశు సంవర్థక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి, వర్థన్నపేట ఎంఎల్ఏ కెఆర్ నాగరాజులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి, ఎంఎల్ఏలకు ఆలయ ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, శ్రీ భద్రకాళి శేషు, వేద పండితులు, వేద విద్యార్థులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆది శంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి నరేందర్, తహసీల్దారు రవీందర్, మట్వాడ సిఐ కరుణాకర్, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించి ప్రసాదాలు అందజేశారు.

## మహబూబాబాద్ జిల్లా ఎస్పిగా డా. శభరీష్ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ డాక్టర్ శభరీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు ఎస్పీ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఈ క్రమంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన ఆయనను ములుగు ఎస్పీ గా బదిలీపై వెళ్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించి జిల్లా పరిధి అధికారులతో మాట్లాడారు. అనంతరం కురవి భద్రకాళి సమేత విరభద్రస్వామి వారి దర్శించుకున్నారు.

## హిడ్మా ఫ్లెక్సీకి నివాళులర్పించిన వారికి బెయిల్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ అనేక మంది సోషల్ మీడియాలో పలు రకాలు పోస్టులు పెడుతున్నారు. హిడ్మా ఫొటోతో కూడిన అనేక సందేశాలు, పలు ఉద్యమ గీతాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో వేలేరు మండలం సోడాశపెల్లి గ్రామస్థులు కొయ్యడ సురేష్, మేక భిక్షపతి హిడ్మాతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దీనిపై పోలీసులు కేసులు నమోదు చేస్తారనే విషయం తెలియకుండానే వారు ఈ నివాళి కార్యక్రమాన్ని చేపట్టగా వారిపై వేలేరు పీస్ పోలీసులు పలు సెక్షన్ల కింద ఈ నెల 21న వేలేరు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. సురేష్, భిక్షపతిని ఆదివారం హన్మకొండ నాలుగో అదనపు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్ వారి తరఫున వాదనలు వినిపించి బెయిల్ మంజూరు చేయించారు.

# 'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం




రాజకీయ పార్టీల నేతలతో అధికారుల సమావేశాలు

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్న ప్రధాన పార్టీ నేతలు

పాత రిజర్వేషన్ అనుగుణంగానే ఎలక్షన్

గ్రామాల్లో మళ్లీ మొదలైన సందడి

**ప్రజాపక్షం/హనుమకొండ:** స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నారు. పాత రిజర్వేషన్ అనుగుణంగానే ఎలక్షన్ నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో గ్రామాల్లో మళ్లీ సందడి మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు జాబితాపై నజర్ పెట్టారు. జాబితాను మరో దఫా పరిశీలించడంతో పాటు ఎన్ని కల కోసం ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్,వార్డుసభ్యుల ఎన్నికలను మూడు దఫాల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్లను ప్రకటించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. రాజకీయ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అధికారుల సమావేశంలో స్పష్టత ఇవ్వడంతో అధికారులు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా అభ్యంతరాలు పరిశీలించడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, రిజర్వేషన్ల ప్రక్రియ, ఉద్యోగులకు శిక్షణ వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించగానే ఎన్ని కలు నిర్వహించేందుకు రెడీగా ఉన్నారు. జిల్లా స్థాయిలో అధి కారులతో సమీక్షించడంతో పాటు రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై మాట్లాడటంతో పాటు ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్లు వివరిం చారు. గత ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీకి ఏర్పాటు చేసిన రీతిలోనే ఈ ఎన్నికలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను నిర్వహిస్తామని ఎన్నికల సంఘం తెలపడంతో ఈ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.పాత రిజర్వేషన్ అనుగుణంగా.. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహించనుండటంతో ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, పేపర్లను, ఇతర పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసిన అధికారులు ఇతర ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సమస్యాత్మక పో లింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు బందోబస్తు చేపట్టనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా విడుదల కానుండటంతో ఏర్పాట్లు చే స్తున్నారు. అధికారులు అందరూ హెడ్ క్వార్టర్స్ లోనే ఉండాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో రాజకీయ పార్టీల నేతలు కూడా అప్రమత్తం అయ్యారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాత రిజర్వేషన్ అనుగుణంగా ఎన్నికలు నిర్వహించ నుండటంతో పోటీకి సిద్ధమవుతు న్నారు. వచ్చే నెలలో రెండు లేదా మూడవ వారంలో ఎన్నికలు జరగనుం డటంతో ఈ ఏ ర్పాట్లను చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో పోటీకి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ చివరి లోపు గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయావల్సిన డెడ్ లైన్ ఉండటం వల్ల గ్రామ, మండల నేతల్లో పోటీ పెరుగుతుంది. ఇద్దరు పిల్లల నిబంధనలు కూడా ఎత్తి వేయడం వల్ల ఎక్కువ మంది పోటీకి సిద్ధమవుతు న్నారు. ఈ దపా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయ వాతా వరణం మళ్లీ గ్రామాల్లో మొదలవుతుంది.

సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత

## గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ



సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** 1925 సంవత్సరం డిసెంబర్ 26న ఆర్భివించిన, భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలితగా గర్జించిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, జనగామ జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, అన్నారు. భారత గడ్డపై సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు, ముగింపు ఉత్సవాల సందర్భంగా, డిసెంబర్ 26వ తేదీన సిపిఐ పార్టీ బహిరంగ సభ, కుబాసర నుండి, ఖమ్మం వరకు ప్రచార జాత నవంబర్ 15 నుండి 24 తేదీ వరకు, జరిగే జాత, 23 తేదీ వరకు, ఆదివారం, మండలం లోని నెల్లుట్ల గ్రామం వరకు ప్రచార జాత చేరుకుంది. ఈ ప్రచార జాతకు, సిపిఐ పార్టీ, మండల కార్యదర్శి, రావుల సదానందం, పార్టీ నాయకులు, స్వాగతం పలికారు. నెల్లుట్ల చౌరస్తాలోని, అంబేద్కర్ విగ్రహానికి, పార్టీ నాయకులు, పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లి ఉల్లా ఖాద్రి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పశ్య పద్మ మాట్లాడుతూ, భూమికోసం భుక్తి కోసం వ్యక్తి చాకిరి విముక్తి కోసం, నిజాం నవాబుల గద్దె దింపడానికి, మహాతర తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాదిమంది ప్రాణాల త్యాగాలతో 3000 గ్రామాలకు విముక్తి కలిగించి, 10 లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీని, వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఉప్పలయ్య, పిఎన్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు, రవి, పిఎన్ఎమ్ రాష్ట్ర నాయకులు, ఆది సాయన్న, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు, చొప్పరి సోమ నర్సయ్య, పోతురు సుగుణమ్మ,పాల్గొన్నారు.

## మహిళల ఐక్యతకు ప్రతిక



బొట్టు పెట్టి సారే అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం నాడు వేడుకలా జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు బొట్టు పెట్టి చీరలను అందజేశారు. అనంతరం కళ్యాణలక్ష్మి చెక్కులను అందించి లబ్ధిదారులకు అందించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజి, వైస్ ఛైర్మన్ బొక్కల స్రవంతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు ఆదరి రవీందర్ చంద్రశేఖర్ గుప్తా యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జక్కుల అనిల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ సిరిసిల్లలో ప్రత్యేకంగా నేసిన నాణ్యమైన చీరలను 18 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ చీరలు మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. త్వరలో భీమదేవరపల్లి మండలంలో మెడికల్ క్యాంపులు, ఎంజేఎన్జే కాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కాన్సర్ స్క్రీనింగ్, కరీంనగర్ లయన్స్ క్లబ్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళాసంఘాలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి చీరలను అందించాల్సిందిగా మంత్రి సూచించారు.

**ఎల్కతుర్తిలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి,ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు స్వయంగా బొట్టు పెట్టి చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిరిసిల్లలో తయారైన నాణ్యమైన చీరలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ హోదాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## 3న రెడ్ క్రాస్ సొసైటీ సర్వ సభ్య సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా సర్వ సభ్య సమావేశం వచ్చే నెల 3న బుధవారం ఉదయం 10:00 గంటలకు సుబేదారిలోని సమీకృత కార్యాలయ భవనం (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్) లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సర్వ సభ్య సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణపై చర్చించడానికి శనివారం రెడ్ క్రాస్ భవన్‌లో చైర్మన్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్వ సభ్య సమావేశం విజయవంతంగా నిర్వహించడంపై, అలాగే రెడ్ క్రాస్ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి,వెంకట నారాయణ గౌడ్, పాపిరెడ్డి, శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళల ఉన్నతికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

కోటి మంది మహిళలను కోటీశ్వర్లు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మహిళ అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి ఇండస్ట్రియల్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్ లో జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరా మహిళా శక్తి గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇందిరా గాంధీ జన్మదిన సందర్భంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, అందులో భాగంగానే భూపాలపల్లి, మంథని నియోజకవర్గాలలో ఆడబిడ్డలకు చీర సారే అందజేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళల పేరు మీదనే అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ మహిళ అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో మైలారం ఘనపురం లో ఇండస్ట్రియల్ పార్కు కొరకు రెండు వందల ఎకరాల భూమి కేటాయించి ఇండస్ట్రియల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందులో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఇండస్ట్రియల్ కొరకు ప్రభుత్వం అందులో మహిళా సంఘాలకు ఇండస్ట్రియల్ సబ్సిడీ కొరకు ప్రాధాన్యత కల్పిస్తూ అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయాలని దృఢ సంకల్పం రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కోట రాజబాబు, రమేష్, శ్రీదేవి, కిష్టయ్య, రామచంద్రయ్య, పాల్గొన్నారు.

## మాధన్నపేట చెరువులో చేపపిల్లల విడుదల

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువులో చేప పిల్లలను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తో కలిసి శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెద్ద చెరువైన మాధన్నపేట మత్స్య సహకార సంఘంలోని ప్రతీ సభ్యుడు చేపల పెంపకం లో నైపుణ్యం పెంపొందించుకొని ప్రైవేట్ వ్యక్తులకు చేపల ఉత్పత్తిని అప్పగించకుండా వారే నిర్వహించాలని కోరారు. మొత్తం 11 లక్షల 50 వేల విలువైన 6.81 లక్షల చేప పిల్లలు విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధిలో మత్స్యోత్పత్తి చాలా కీలక పాత్ర పోషిస్తుందని, ఈరోజు చేప పిల్లలను చెరువులో వదిలించడం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరగడమే కాకుండా, ప్రజలకు పోషకాహార భద్రతను కూడా మెరుగుపరచడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపల పెంపకానికి అవసరమైన అన్ని రకాల సహాయాలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ రాంరెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి, మార్కెట్ చైర్మెన్ పాలాయి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు చేయొద్దు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** బాల్య వివాహాలు చేయడం, సహకరించడం, ప్రోత్సాహించడం, హాజరవడం కూడా చట్టపరంగా శిక్షార్హమేనని, బాల్య వివాహ నిషేధిత చట్టం ప్రకారం లక్ష జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందని కావున బాల్య వివాహాలు చేయొద్దని జిల్లా సంక్షేమాధికారి కోదండరాములు అన్నారు. జనగామ పట్టణంలోని గాయత్రి గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బాల్య వివాహం జరుగుతుందని 1098కి సమాచారం అందింది. దీంతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్‌శాఖ, ఐసీడీఎస్ శాఖ సిబ్బంది సంయుక్తంగా వెంటనే స్పందించి బచ్చన్నపేట మండలానికి చెందిన బాలికను నర్మెటకు చెందిన అబ్బాయితో బాల్యవివాహం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని గమనించి దాన్ని అడ్డుకుని బాలికను రక్షణలోకి తీసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచారు. కమిటీ ఆదేశానుసారం బాలికను సంరక్షణ కోసం బాలసదనం చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ (గర్ల్స్)కు పంపించారు.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడుతాయి

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



**ప్రజాపక్షం/వేలేరు:** క్రీడలు మానసిక ఉల్లాసానికి,శరీర ధారుఢ్యానికే కాకుండా జీవితంలో స్థిరపడడానికి కూడా పయోగపడుతాయని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి,గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్ అన్నారు.ఆదివారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలో జిల్లాప్రజాపరిషత్ పాఠశాలలో జరిగిన 25 వ జిల్లా స్థాయి బాల,బాలికల కబడ్డి జూనియర్(ఇంటర్ జోనల్) టోర్నమెంట్ అండ్ సెలెక్సన్స్ పోటీల కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా హాజరయ్యారు,ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు.యువత అనునిత్యం క్రీడా మైదానాలలోనే ఉండడంవలన మానసిక ఉల్లాసమే కాకుండా శారీరక ధారుఢ్యం కలుగుతుందని అలాగే వివిధ క్రీడల్లో పాల్గొనడం వలన జీవితంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు.అనంతరం కబడ్డి పోటీలలో విజేతలైన బాలురు మొదటి బహుమతి హనుమకొండ జోన్,రెండవ బహుమతి హసన్‌పర్తి జోన్,బాలికలు హనుమకొండ జోన్ మొదిటి బహుమతి,రెండవ బహుమతి వేలేరు జోన్ విజేతలు కాగా వారికి బహుమతులు ప్రధానం చేశారు కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు,కబడ్డి క్రీడాకారులు,స్థానిక నాయుకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు ఆర్టిసిలో ఉచిత బస్సు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, స్త్రీ టీ స్టాల్స్, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణ తదితర కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అనిల్ కుమార్ వేర్పుల, మెట్టెల కృష్ణ, వజ్రాల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, గ్రామ దీపిక కాసిమల గీత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక పోరు సిపిఐదే



**ప్రజాపక్షం/కొణిజర్ల :** భారత కమ్యూనిస్టుపార్టీ సుదీర్ఘ పోరాటాల ద్వారా లక్షలాది మంది ప్రయోజనాల లక్ష్యంగా పోరాడిన వదేళ్ల ఘనచరిత్ర కలిగిన సిపిఐ మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్ అన్నారు. బిజేపి మోడి ప్రభుత్వంలో వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని తెలిపారు. కేంద్రప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానలపై ఐక్యంగా ఉద్యమించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జిల్లా వ్యవసాయ కార్మికసంఘం సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు, నాయకులు పిచ్చమ్మ, వెంకటి, ఆశీర్వాదం, భిక్షం, రమేదేవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంకు సిపిఐ ప్రచార జాతా

### ఇందిరానగర్ పైలాన్ వద్ద సభ

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు శతాబ్ది ఉత్సవాల జయప్రదం కోరుతూ బాసరలో ప్రారంభమైన ప్రచార జాతా సోమవారం ఖమ్మంకు రానుంది. ఈనెల 15న నిర్మల్ జిల్లా బాసరలో ఈ యాత్ర ప్రారంభమైంది. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, వికారాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగాం, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించిన జాతా కూసుమంచి మండలంలోని పాలేరు వద్ద ఖమ్మం జిల్లాలో ప్రవేశించనుంది. ఈ జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీఉల్లాఖాద్రి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి నరేంద్రకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. కూసుమంచి, వరంగల్ క్రాస్ రోడ్డు మీదుగా ఖమ్మంలో జాతా పర్యటించనున్నది. సాయంత్రం నాలుగు గంటలకు ఇందిరా నగర్ సిపిఐ పైలాన్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. సరిహద్దుల వద్ద జాతాకు స్వాగతం పలికేందుకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.


## మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలి

### ఇందిరమ్మ చీర పంపిణీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబాలు బాగుపడతాయని మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం బైపాస్ రోడ్డులో టిసివి ఫంక్షన్ హాల్‌లో పాలేరు నియోజక వర్గం నాలుగు మండలాల సహాయక సంఘాల మహిళలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ చీరలు ఇంటింటికి వెళ్లి అందజేయాలన్నారు. పెట్రోల్ పంప్, సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టిసికి అద్దె బస్సుల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు వంటి అనేక వ్యాపార అవకాశాలను మహిళా సంఘాలకు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పాలేరు నియోజక వర్గంలో అర్హులైన 53వేల మంది మహిళలకు చీరలు సజావుగా పంపిణీ చేసేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్ బాబు, తహసీల్దార్లు రాంప్రసాద్, విల్సన్, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సుగుణమ్మకు సిపిఐ నేతలు నివాళి



**ప్రజాపక్షం/ చింతకాని :** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగులవంచ గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మకు సిపిఐ నేతలు నివాళులర్పించారు. ఆదివారం నాగులవంచ గ్రామంలో సుగుణమ్మ దశ దిన కర్మల్లో సిపిఐ నాయకులు పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘకాలం పాటు సిపిఐ పార్టీ నాయకునిగా పని చేశారన్నారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారన్నారు. జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలిగా కొన్ని దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాల్లో పని చేశారన్నారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి ఎంపిటిసిగా పనిచేశారన్నారు. సుగుణమ్మ మృతితో నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, మాజీ ఎంఎల్‌వి కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల నాయకులు గుడిపూడి మాధవరావు, బైరబోయిన హన్మంతరావు, తుళ్లూరు ప్రసాద్, తాళ్లూరి యాదగిరి, బిఆర్‌ఎస్ నాయకులు మంకెన రమేష్, నెల్లూరి రమేష్, చిలువేరు సైదులు పాల్గొన్నారు.

## సర్పంచుల రిజర్వేషన్ ఖరారు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచుల స్థానాలకు అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలంలో మొత్తం 37 గ్రామ పం చాయతీలు ఉండగా వాటిలో సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఎస్టిలకు 16, ఎస్సిలకు మూడు, జనరల్‌కు 18 స్థానాలు కేటాయించారు. అదేవిధంగా 308 వార్డుల్లో 160 వార్డులను ఎస్సి, ఎస్టి, బిసిలకు కేటాయించగా 148 వార్డులను జనరల్‌కు కేటాయించారు. గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి సంబంధించి రోటేషన్ పద్ధతిలో ఈ ఏడాది రిజర్వేషన్ కల్పించారు. ఎస్టి జనరల్‌కు వి ఆర్ బంజర, దొనబండ, మంచుకొండ, గణేశ్వరం, జికె బంజర, రాంక్యాతండా, మూలగూడెం, కొర్లబోడు తండా స్థానాలను కేటాయించారు. ఎస్సి మహిళకు బూడిదంపాడు, ఎస్సి జనరల్ రఘునాథపాలెం, కోయచలక గ్రామాలను కేటాయించారు. సూర్యాతండా, ఎన్‌వి బంజర, బావోజీతండా, హర్యాతండాలు కేటాయించారు.రిజర్వేషన్లు ఖరారు కావడంతో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి పలువురు పోటీ పడుతున్నారు.

## బీమా పెంపు, సంక్షేమంపై అవగాహన

**ప్రజాపక్షం/ఖమ్మం :** భవన నిర్మాణ కార్మికుల బీమా పెంపు, వివిధ సంక్షేమ పథకాల అమలుపై ఈనెల 24న సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని మోతె నగర్‌లో టిఎం ఫంక్షన్ హాల్‌లో వివిధ కార్మిక సంఘాలు నిర్మాణ రంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. బీమా పెంపు, ఇటీవల భవన నిర్మాణ రంగంలోకి వచ్చిన వారి పేర్ల నమోదు, రెన్యువల్, సంక్షేమ పథకాలకు సంబంధించి అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# పల్లెల్లో పంచాయతీల కాక

### అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు

### రిజర్వేషన్లతో మారుతున్న సమీకరణలు

### బిసికి తగ్గి జనరల్‌కు పెరిగిన స్థానాలు

### ఎస్సీ, ఎస్టీలు యథాతథం

| వరుస సంఖ్య | కేటగిరీ | స్థానాలు |
|---|---|---|
| 1. | ఎస్టి | 171 (29.9 శాతం) |
| 2. | ఎస్సి | 110 (19.3 శాతం) |
| 3. | బిసి | 54 (9.45 శాతం) |
| 4. | జనరల్ | 236 (41.3 శాతం) |
| 5. | మొత్తం | 57 (100 శాతం) |



**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 50 శాతం లోపు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేయడం వెంటనే రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో పంచాయతీ ఎన్నికల కాక మొదలైంది. ఆదివారం ఖరారు చేసిన రిజర్వేషన్లలో జనరల్ స్థానాలు గణనీయంగా పెరిగాయి. 50 శాతానికి రిజర్వేషన్‌ను కుదించడంతో మొత్తం 571 పంచాయతీలలో 236 స్థానాలు జనరల్‌కు కేటాయించారు. ఎస్టిలకు 171, ఎస్సిలకు 110, బిసిలకు 54 సర్పంచ్ స్థానాలను కేటాయించారు. కారేపల్లి, ఏన్కూరు, కామేపల్లి మొదలైన కొన్ని ఏజెన్సీ మండలాలు ఉండడంతో ఎస్టి సర్పంచుల స్థానాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఎస్టి మహిళలకు 48, ఎస్టి జనరల్‌కు 51 వంద శాతం ఎస్టిలు ఉన్న గ్రామ పంచాయతీల్లో మూడు మహిళలకు, ఎనిమిది ఎస్టి జనరల్‌కు కేటాయించారు. ఎస్సి మహిళలకు 48, ఎస్టి జనరల్‌కు 62 కేటాయించగా బిసి మహిళలకు 24, బిసి జనరల్‌కు 30 స్థానాలు కేటాయించారు. మొత్తం 236 జనరల్ స్థానాల్లో 112 మహిళలకు కేటాయించారు. ఇదే రీతిలో వార్డులను కూడా రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను కేటాయిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. దాదాపుగా పంచాయతీలు, వార్డుల్లోనూ రోటేషన్ పద్ధతిని పాటించారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు తలమునకలవుతున్నాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్నాయి. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎంపిటిసి, జెడ్పిటిసి, పంచాయతీ ఎన్నికలు ఒకేసారి రాగా అప్పట్లో రాజకీయ పార్టీల మధ్య గ్రామాల్లో వివిధ వర్గాల మధ్య ఒక పొందిక కుదిరింది. ఒకరు ఎంపిటిసి, ఒకరు సర్పంచ్ అనే పొందిక వచ్చింది. ఇప్పుడు కేవలం సర్పంచ్ ఎన్నికలు మాత్రమే రావడంతో పొందికలు గత ఒప్పందాల్లో తేడాలొస్తున్నట్లు భావిస్తున్నారు. రిజర్వేషన్లు కూడా మార్పు రావడంతో పోటీ చేయాలనుకునే వారి విషయంలోనూ మార్పులు వచ్చాయి. వార్డులకు సంబంధించి, పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియపై కొందరు పెదవి విరుస్తున్నారు. కొన్ని వార్డుల్లో ఓటర్లు లేని వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఒక కొత్త జోష్ మొదలైంది. సహజంగా స్థానిక ఎన్నికలంటేనే ఉత్సుకత ఎక్కువగా ఉంటుంది. 2024 జనవరి 30 నాటికి పంచాయతీల ప దవికాలం ముగియగా దాదాపు 22 మాసాల తర్వాత పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఆర్థికంగా ఖర్చు చేయక తప్పని పరిస్థితుల్లో కొందరు ఆర్థిక వనరులను సమీకరించుకుంటున్నారు. ఓటర్లను సైతం తృప్తిపరిస్తే తప్ప ఓటు వేసే పరిస్థితి లేకపోవడంతో ఖర్చు చే యక తప్పనిస్థితి ఏర్పడింది. రాజకీయ పార్టీలు స్థానికంగా ఆయా గ్రామ పంచాయతీల వారీగా పొత్తులు కుదుర్చుకుంటున్నాయి.

**నూకలంపాడులో ఈ దఫా ఎన్నికలు :** మూడు దశాబ్దాల తర్వాత ఆ గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగనున్నాయి. మండలం మొత్తం పూర్తి ఏజెన్సీలో ఉండడం ఆ గ్రామంలో ఎస్టిలు లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదు. మొత్తం ఎనిమిది వార్డులు ఉండగా కేవలం నాలుగు వార్డులకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో నుండి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుని గ్రామ పంచాయతీ పాలన నిర్వహిస్తున్నారు. ఏన్కూరు మండలంలో గల నూకలంపాడు పంచాయతీలో మొత్తం 1100లకు పైగా ఓటర్లు ఉన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్టి ఓటరు లేని తొలిసారి ముగ్గురు ఎస్టి ఓటర్లు నమోదయ్యారు. ఇప్పటికి కూడా రెండు వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. చివరి సారిగా పంచాయతీ నుండి గద్దె సీతారామయ్య సర్పంచ్‌గా పని చేశారు. ఎట్టకేలకు ఈ దఫా పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఏర్పడింది.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రఘునాథపాలెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, పలువురు నాయకులు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వి. వెంకటాయపాలెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం పుట్టింటి సారె మాదిరిగా ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టిందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. నాయకులు కుతుంబాక సీతారాం, కిషోర్, వీరు నాయక్, శ్రీనివాస్, ఆదాం, పలువురు మహిళలు పాల్గొన్నారు.



## విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవం చరిత్రాత్మక ఘట్టం

### డిసెంబర్ 2న సిఎం ప్రారంభం

### ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తుమ్మల, శాసన సభ్యులు, అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో డా॥ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయం ప్రారంభోత్సవం ఒక చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల రెండవ తేదీన యూనివర్సిటీని ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల, శాసన సభ్యులు ఆదినారాయణ, వెంకట్రావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్ లతో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇతర అధికారులతో కలిసి యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమాలను పరిశీలించారు. వేదిక సహ అన్నింటిని పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులకు పలు సూచనలు చేశారు. లోపాలు లేకుండా పని చేయాలని ఆయన సూచించారు. 1996లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థాపనకు కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చే శారు. సాధారణ విశ్వ విద్యాలయాలకు భిన్నంగా సహజ వనరులు, భూగోళ శాస్త్రాలు, ఖనిజ పరిశోధనలకు ఉపయోగపడడంతో పాటు దేశ భవిష్యత్తుకు దోహదం చేసేవిధంగా ప్రత్యేక విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భావించారని అందుకు అనుగుణంగానే మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకుందన్నారు. ఆరు నెలల పాటు పరిశీలించి నివేదికను తయారు చే యడం జరిగిందన్నారు. 390 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ యూనివర్సిటీ ప్రపంచ స్థా టయి యూనివర్సిటీగా నిలవనుందన్నారు. డి సెంబర్ రెండున భారీ బహిరంగ సభ ఏర్పాటు చే స్తున్నట్లు తుమ్మల తెలిపారు. అదనపు కలెక్టర్ వే ణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

### ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి

### సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** స్త్రీ లేనిదే మానవజాతి అభివృద్ధి లేదని, మానవజాతి మనుగడకు, సృష్టి నడవడానికి స్త్రీ కావాలని, మహిళా మూర్తులను గు ర్తించి గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీరలను బహుమతిగా అందిస్తున్నారన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. ఆదివారం పట్టణంలోని ఎంఆర్ గార్డెన్ నందు ఇందిరా మహిళా శక్తి పథకంలో బాగంగా వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లోని మహిళలకు సుమారు 36132 చీ రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిదిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమ యి దయానంద్ విజయ్ కుమార్, కల్లూరు డివిజ న్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లు హాజరైనారు. కార్యక్రమంలో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీ కారం చేసిన 48 గంటల్లోనే మ హిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడా రు. గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ ను అందించటమే కాకుండా ఉచిత గ్యాస్, ఇందిర మ్మ ఇం డ్లు మహిళలకు అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మహిళలకు వడ్డీ లేని రు ణాలు అందించి మహిళలను లక్షాధికారులను చేస్తుందన్నారు. సిరిసిల్లలోని చేనేత కార్మికుల ద్వారా చీరలను ప్రత్యేకంగా నాణ్యతతో తయారు చేయించి అందిస్తున్న ప్రభుత్వాన్ని మహిళలందరూ ఆదరించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మహిళామణులకు ఎ మ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మహిళల కో సం 3 లక్షల 36,000 చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అ ధ్యక్షుడు గాదె చెన్నారావు కమల్ పాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లు దోమ ఆనంద్ బాబు, భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కల్పన, డిపిఎంలు ఆంజనేయులు, కృష్ణ, పింగుల సామ్యూల్, మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఆదర్శంగా నిలవాలి

### ఎన్‌సిసి డే వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి విద్యార్థి ఎదగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సిసి డే వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అద్భుతంగా నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. 20 లక్షలకు పైగా యువత సభ్యత్వంతో ఎన్‌సిసి పని చేస్తుందని ఇందులో భాగస్వామ్యం కావడం వి ద్యార్థుల అదృష్టమన్నారు. క్రమశిక్షణ, దేశ గొప్పతనం, దేశానికి మనం ఎ లా ఉపయోగపడాలి అనే భావన విద్యార్థుల్లో ఎన్‌సిసి ప్రేరేపిస్తుందని జీవి తం ఉత్తమంగా గడిపేందుకు అవసరమైన జీవన నైపుణ్యాలు ఎన్ విజయం కోసం మాత్రమే పని చేస్తే మ ంచి ఫలితాలు రావాలని, మనం చేసే ప్రతి పని అ ద్భుతంగా చేసినప్పుడే విజవంతమవుతామన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు లేబర్ కోడ్స్‌లపై అవగాహన



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం కృష్ణయ్య ఆదేశానుసారం ఆదివారం జియం కార్యాలయంలో కాంట్రాక్ట్ లేబర్ కోడ్స్ గురించి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా యాక్టింగ్ జియం గోవిందరావు, యస్‌ఓటు జియం డి రామస్వామి పాల్గొన్నారు. 40కుపైగా లేబర్ లాస్‌ను సమగ్రీకరించి నాలుగు ప్రధాన లేబ ర్ కోడ్స్‌గా ప్రకటించిందని, ఈ నూతన కోడ్స్ అమల్లోకి రావడం ద్వారా కార్మికుల హక్కులు, భద్రత, వే తన వ్యవస్థ పారదర్శకత మరింత బలోపే తం కానున్నాయి.ఈ నాలుగు కోడ్స్ 1 వేతన కోడ్, 2 పారిశ్రామిక సంబంధాల కోడ్, 3 సామాజిక భద్రతా కోడ్, 4 ఓఎస్‌హెచ్ కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు సింగరేణి ఉద్యోగులకు ప్రయోజనాలు ఈ నాలుగు లేబర్ కోడ్స అమల్లోకి రావడం ద్వారా సింగరేణి ఉద్యోగులు వేతనాలు, సేఫ్టీ, సోషల్ సెక్యూరిటీ, యూ నియన్ హక్కుల రంగాల్లో మరింత పారదర్శకమైన, సులభతరమైన, బలమైన వ్యవస్థను పొందనున్నారని అన్నారు. ఏరియా డిజియం(పర్సనల్)అజ్మీర తుకారాం, కేటిసి సేఫ్టీ ఆఫీసర్ యు బ్రహ్మం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వి అజయ్, అధికారుల సంఘం అధ్యక్షులు ఎజి శివప్రసాద్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణ, మండలానికి చెందిన బాధితులకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ కోరం కనకయ్య సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాల ప్రజా ప్రభుత్వ కాలంలో 8 కోట్ల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇల్లందు నియోజకవర్గంలో పంపిణీ చేశామని అన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయంలో పేదల వైద్యం చేయించుకుంటే వారికి ఆర్థికంగా నిలిచేందుకు ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారని గుర్తు చేశారు. గత పాలకులు హయంలో రేషన్ కార్డు ఊసే లేదని ప్రజా ప్రభుత్వంలో పేదలందరికి రేషన్ కార్డులు అందించామని అన్నారు. ఈ దేశంలో పేదలందరికి అండగా నిలిచే పార్టీ బడుగులకు బలహీనులకు అసరాగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. పేదలందరికి వైద్యం ఖర్చు 10లక్షల అయిన వారికి ఎల్‌ఓసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన అందిరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, 500 రూ గ్యాస్ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, పోట్ రవి, మాజీ సర్పంచులు కల్తి పద్మ, పాయం స్వాతి, నాయకురాలు బానోత్ శారద, మోకాళ్ళ వెంకటమ్మ, తాటి రాంబాబు, జోగా శ్రీకాంత్, బొల్లి రామారావు, అరెం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా

### జిఎం కార్యాలయం వద్ద నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను సింగరేణిలోని జాతీయ కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఆదివారం జిఎం కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని వీటిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారని తెలిపారు. పని గంటల పెంపు, శ్రమ దోపిడీలో భాగంగా కొత్త చట్టాలను తీసుకు వచ్చారని పెట్టుబడిదారులకు సానుకూలమైన చట్టాలని ఆయన తెలిపారు. 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి అమలు చేయడాన్ని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు. రద్దు చేయకుంటే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు రమణమూర్తి, రాము, యరగాని కృష్ణయ్య, ఐఎన్‌టియుసి నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్, పీతాంబరం, సిఐటియు నాయకులు మందా నర్సింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# క్రీడ

## జపాన్ షట్లర్‌కు చెక్..

### ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా లక్ష్యసేన్!



ఈ ఏడాది భారత షట్లర్ లక్ష్యసేన్ తొలి టైటిల్ సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నిలిచాడు. సిడ్నీలో జరిగిన సూపర్ 500 టోర్నమెంట్‌లో జపాన్‌కు చెందిన యుషి తనకనును చిత్తు చేశాడీ స్టార్ ప్లేయర్. వరుస సెట్లలో జోరు చూపించిన సేన్ యుషిని మట్టికరిపించి టైటిల్ కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ పూర్తయ్యాక విమర్శకులకు కౌంటర్ ఇస్తూ సైలెంట్ సెలబ్రేషన్ చేసుకున్నాడీ విన్నర్. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన లక్ష్యసేన్ టైటిల్‌తో మెరిశాడు. సెమీఫైనల్లో కఠినమైన ప్రత్యర్థి చౌ తియెన్ చెన్ ఆట కట్టించిన సేన్ ఫైనల్లోనూ అదిరే ఆట చూపించాడు. 14వ సీడ్ అయిన భారత షట్లర్ ఫైనల్లో తనకంటే తక్కువ ర్యాంకర్ అయిన యుషి తనకపై ఆధిపత్యం చెలాయించాడు. ఆరంభం నుంచి దూకుడు కనబరిచిన అతడు 21–15తో తొలి సెట్ గెలుచుకున్నాడు. రెండో సెట్‌లోనూ ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా అటాకింగ్ గేమ్ ఆడిన సేన్.. 21–11తో షాకిచ్చాడు. మ్యాచ్ గెలుపొందిన తర్వాత సేన్ తన చెవులో వేలిపెట్టుకొని విజయాన్ని ఆస్వాదించాడు. అనంతరం కోచ్ యూ యాంగ్ సుంగ్, తండ్రి డీ.కే. సేన్‌తో కలిసి సంబరాలు చేసుకున్నాడు. టైటిల్ విజేతగా నిలిచిన కుమారుడిని ఆయన ఎత్తుకొని మరీ అభినందించాడు. ఈ ఏడాది సేన్‌కు ఇదే మొదటి టైటిల్. ఇటీవలే అతడు జపాన్ మాస్టర్స్‌లో సెమీస్ లోనే వెనుదిరిగాడు. హాంకాంగ్ ఓపెన్‌లో క్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టాడు.

## వన్డే కెప్టెన్‌గా రాహుల్..

### పంత్, గైక్వాడ్‌కు పిలుపు..!



భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడటంతో తదుపరి నాయకుడు ఎవరు? అనే సందిగ్ధతకు తెరపడింది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం కేఎల్ రాహుల్‌కు పగ్గాలు అప్పగించారు సెలెక్టర్లు. దాంతో.. మళ్లీ రోహిత్ శర్మకు సారథ్యం ఇస్తారని వార్తలకు చెక్ పడింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ బృందం ఆదివారం 15మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇండియా ఏ తరఫున శతకంతో రెచ్చిపోయిన రుతురాజ్ గైక్వాడ్ ప్రత్యేక చివరి వన్డే ఆడిన రిషభ్ పంత్‌కు జాబితాలో చోటు దక్కింది. ఇటీవలే వన్డే సారథిగా రోహిత్ నుంచి పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్ కోల్‌కతా టెస్టులో గాయపడి ఆటకు దూరమయ్యాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ లోపు అతడు కోలుకునే అవకాశాలు లేకపోవడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. నవంబర్ 30 నుంచే సిరీస్ ప్రారంభం కానున్నందున ఆదివారం స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. జట్టుకోసం ఏ త్యాగానికైనా సిద్ధపడే రాహుల్‌ను సెలెక్టర్లు విస్మరించలేదు. ఓపెనర్ నుంచి ఏడో స్థానంలో.. ఎక్కడంటే అక్కడ ఆడుతూ జట్టు మనిషిగా పేరు తెచ్చుకున్న అతడికి కెప్టెన్సీ కట్టబెట్టారు. ఇప్పటివరకూ రాహుల్ 15 వన్డేల్లో నాయకత్వం వహించి.. 9 విజయాలు అందించాడు. సారథిగా బ్యాటుతోనూ రాణించిన అతడు 302 రన్స్ చేశాడు. ఇక ఐపిఎల్‌లో కెప్టెన్‌గా అదరగొట్టిన పంత్.. చివరి వన్డే ఆడి దాదాపు ఏడాది అవుతోంది. అతడికి కూడా 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఆడే అవకాశం లభించింది.

**భారత స్క్వాడ్ :** రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్, ధ్రువ్ జురెల్, హర్షిత్ రానా, రుతురాజ్ గైక్వాడ్ ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్.

## రసపట్టులో రెండో టెస్టు!

### శతకంతో చెలరేగిన ముత్తుస్వామి..



గౌహతి టెస్టులో దక్షిణాఫ్రికాను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేయాలనుకున్న భారత జట్టు భంగపడింది. సిరీస్ సమం చేయాలనుకున్న టీమిండియాకు షాకిస్తూ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసింది సఫారీ టీమ్. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. మిడిలార్డర్ కూడా పట్టుదలగా ఆడడంతో పర్యాటక జట్టు 489 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. సెనురన్ ముత్తుస్వామి(109) తొలి సెంచరీతో విరుచుకుపడగా.. ఆఖర్లో మార్కో యాన్సెన్ (93) మెరుపు అర్ధ శతకంతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. కుల్దీప్ యాదవ్(4–115) అతడిని బౌల్డ్ చేశాక.. భారత ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(7 నాటౌట్), కేఎల్ రాహుల్(2 నాటౌట్)లు అజేయంగా రెండో రోజును ముగించారు. సిరీస్‌లో వెనకబడిన భారత జట్టు రెండో టెస్టులో దక్షిణాఫ్రికాకు కళ్లెం వేయాలనుకుంది. కానీ, గౌహతిలో సీన్ రివర్స్ అయింది. తొలి రోజు ఓపికగా ఆడిన సఫారీ బ్యాటర్లు.. రెండో రోజు అంత కుమించిన పట్టుదలను ప్రదర్శించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. టాపార్డర్ నుంచి లోయర్ ఆర్డర్ వరకూ సమిష్టిగా రాణించగా దక్షిణాఫ్రికా 489 పరుగులతో టీమిండియాకు సవాల్ విసిరింది. మొదటి రోజు తొలి సెషన్‌లో టీమిండియా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న సఫారీ ఓపెనర్లు రియాన్ రికెల్టన్(35), ఎడెన్ మర్క్‌రమ్(38)లు శుభారంభమిచ్చారు. టీ విరామానికి ముందు.. మర్క్‌రమ్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా82 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఆ కాసేపటికే చైనామన్ బౌలర్ కుల్దీప్ ఓవర్లో డేంజరస్ రికెల్టన్ వికెట్ కీపర్ పంత్‌కు దొరికాడు. ఓపెనర్లు వెంటవెంటనే ఔటైనా సఫారీ బ్యాటర్లు తడబడలేదు. కోల్‌కతా హీరో కెప్టెన్ తెంబ బవుమా(41), ట్రిస్టన్ స్టబ్స్(49)తో కలిసి ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. జడేజా, కుల్దీప్.. పేసర్లను సమర్థంగా ఆడిన వీరిద్దరూ స్కోర్ 160 దాటించారు. ప్రమాదకరంగా మారిన ఈ ద్వయాన్ని జడేజా(1–30) విడదీసి ఊరటనిచ్చాడు. అర్ధ శతకానికి చేరువైన స్టబ్స్ (3–48) కుల్దీప్ ఓవర్లో స్లిప్‌లో కేఎల్ రాహుల్ చక్కని క్యాచ్ అందుకోగా వెనుదిరిగాడు. కీలక వికెట్లు పడినా సఫారీ టెయిలెండర్లు టోనీ జోర్జి(28), సెరులిన్ ముత్తుస్వామి (109) క్రీజులో పాతుకుపోయారు. అయితే.. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా సిరాజ్ ఓవర్లో జోర్జి వెనుదిరిగాడు. దాంతో.. తొలి రోజు ఆట ముగిసే సరికి 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది దక్షిణాఫ్రికా.

**ముత్తుస్వామి సెంచరీ..**

తొలి రోజు మాదిరిగానే రెండో రోజు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. తొలి సెషన్లో వెర్రెనే(45), ముతుస్వామి వికెట్ ఇవ్వలేదు. టీ తర్వాత జడేజా బౌలింగ్‌లో వెర్రెనే వెనుదిరిగాడు. అనంతరం మార్కో జాన్సెన్(93) జతగా ముతుస్వామి జట్టు స్కోర్ 430 దాటించాడు. ఈ క్రమంలోనే అతడు కెరీర్లో తొలి శతకం సాధించాడు. వంద కొట్టిన అతడిని సిరాజ్ ఔట్ చేశాక.. సిక్సర్లతో విరుచుకుపడిన జాన్సెన్ సైతం సెంచరీకి చేరువయ్యాడు. కానీ.. కుల్దీప్ ఓవర్లో అతడు 93 పరుగుల వద్ద బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. అతడి వికెట్‌తో 489 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ వికెట్ కోల్పోకుండా 9 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 480 పరుగులు వెనకబడి ఉంది.

# ఆరోగ్యం




## మెదడు సంబంధిత వ్యాధులకు

## డిబిఎస్ చికిత్స




పార్కిన్సన్స్ వంటి పలురకాల మెదడు సంబంధిత వ్యాధులకు డీప్‌బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డిబిఎస్) అనేది ఒక అధునాతన వైద్య సాంకేతికత. దీనిలో వైద్యులు కొన్ని రుగ్మతలకు చికిత్స చేయడానికి మెదడులోని నిర్దిష్ట ప్రాంతాలలో ఎలక్ట్రోడ్స్‌ను లోతుగా అమర్చుతారు. ప్రపంచవ్యాప్తంగా 1.6 లక్షలకు పైగా ప్రజలు డీప్‌బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డిబిఎస్) పొందినట్టు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ ఎలక్ట్రోడ్లు గుండె యొక్క పేస్‌మేకర్ లాంటి చిన్న పరికరానికి వైర్ల ద్వారా అనుసంధానమై ఉంటాయి. దీనిని సాధారణంగా ఛాతీ పైభాగంలో చర్మం కింద ఉంచబడుతుంది. ఈ పరికరం నియంత్రిత, తేలికపాటి విద్యుత్ ప్రేరణలను లక్ష్యంగా చేసుకున్న మెదడు ప్రాంతాలకు పంపుతుంది. అసాధారణ మెదడు కార్యకలాపాలు లేదా రసాయన అసమతుల్యతలను సర్దుబాటు చేయడంలో సహాయపడుతుంది. డిబిఎస్‌ను సాధారణంగా కదలిక రుగ్మతలకు ఉపయోగిస్తారు. ముఖ్యంగా పార్కిన్సన్స్ వ్యాధి, ముఖ్యమైన వణుకు , డిస్టోనియా ఉన్నవారిలో కొంతకాలం చికిత్స పొందిన తర్వాత మందులు చెప్పుకోదగిన విధంగా పనిచేయవు. అలాంటి పరిస్థితుల్లో డిబిఎస్ అవసరమవుతుంది. దీనిని అబ్సెసివ్‌కంపల్సివ్ డిజార్డర్ వంటి కొన్ని మానసిక పరిస్థితులకు కూడా వాడవచ్చని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు ఆమోదించాయి. దీనిని తీవ్రమైన నిరాశ, మూర్ఛ వంటి సమస్యలను నయం చేయడానికి ఎంత వరకూ ఉపయోగించవచ్చనేది ఇప్పుడు శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. న్యూరాన్ల సమూహాలు ఒకదానితో ఒకటి ఎలా మాట్లాడుకుంటాయో సవరించడం ద్వారా డిబిఎస్ పనిచేస్తుంది. ఈ రుగ్మతలలో చాలా వరకు మెదడులోని లోపభూయిష్ట విద్యుత్ సంకేతాలను కలిగి ఉంటాయి. డిబిఎస్ ద్వారా విద్యుత్ పల్స్‌లను అందించడం వలన ఈ అనియత సంకేతాలకు అంతరాయం కలుగుతుంది. వణుకు లేదా కండరాల దృఢత్వం వంటి లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది సెల్యులార్ మరియు నెట్‌వర్క్ స్థాయిలలో అంతరాయం కలిగించిన మెదడు సర్క్యూట్లను తిరిగి సాధారణ పరిస్థితికి తీసుకురావడానికి కూడా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## సంచలనాల ‘బిగ్‌బ్రెయిన్’ ప్రయోగం



కెనడాలోని మాంట్రియాల్ న్యూరాలాజికల్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న ‘బిగ్‌బ్రెయిన్’ ప్రయోగం సంచలనాలు సృష్టిస్తున్నది. అయితే, శాస్త్రవేత్తలు మానవ మెదడులోని ప్రతి కనెక్షన్‌ను, ప్రతి కణాన్నీ మ్యాప్ చేసి, ‘కాన్షియస్‌నెస్‌కు జిపిఎస్’ను సృష్టించారంటూ వస్తున్న వార్తలు నిరాధారం. కొద్దిపాటి వాస్తవికతకు, విస్తారమైన అభూతకల్పనను జోడించి జరుగుతున్న విస్తృత ప్రచారంలో నిజం లేదు. అంతర్జాతీయ మ్యాగజైన్ ‘ది నేజర్’ను అనుసరించి, ఈ ప్రాజెక్టు నిజమే. ఇందులో భాగంగా మానవ మెదడును మైక్రో పరిమాణంలో (20 మైక్రోమీటర్‌గా సెక్షన్ షీల్స్) తీసి స్కాన్ చేశారు. మొత్తం సుమారు 7,400 భాగాలుగా విభజించి, వాటిని డిజిటల్‌గా స్కాన్ చేశారు. అనంతరం 3డి మోటల్‌గా పునర్నిర్మించారు. ఆ మోడల్ 1 టెరాబైట్ డేటాపరిమాణంలో ఉంది. అంటే చాలా సూక్ష్మంగా చూసే అవకాశం ఉంది. అయితే, ఇది సాధారణ ఎంఆర్ఐ స్కాన్‌ల కంటే ఎక్కువ వివరాలు ఇస్తుంది. ఈ మ్యాప్ ద్వారా కణాల స్థానాలు, లేయర్లు, అత్యంత సూక్ష్మ స్థాయిలో వాటి నిర్మాణాలను చూడవచ్చు. పరీక్షించవచ్చు. విశ్లేషించవచ్చు. నిజానికి ఇది గొప్ప ఆవిష్కరణ. సుమారు ఎనిమిది సంవత్సరాలుగా జరుగుతున్న ఈ ప్రయోగాలు కొంత పురోగతిని సాధించాయి. అయితే, తెలుసుకున్నది చాలా తక్కువకాగా, తెలుకోవాల్సింది చాలాచాలా ఎక్కువ. ప్రాజెక్టు ప్రయోగదశలో ఉన్నప్పుడే, మనిషి మస్తిష్కం చేతనావస్థకు సంబంధించిన జిపిఎస్‌ను రూపొందించారనడం అతిశయోక్తి మాత్రమే. 86 బిలియన్ న్యూరాన్లు, దాదాపు 100 ట్రిలియన్ కనెక్షన్లు చూపించే మ్యాపింగ్ సిద్ధమైందనడంలో కూడా అభూత కల్పన మాత్రమే. అంతేకాదు, ఈ ప్రాజెక్టులో ఒకే ఒక మెదడును పరిగణలోకి తీసుకున్నారు. కానీ, మనుషులు అందరి మెదడులు ఒకే రీతిలో పని చేయవు. వాటి మధ్య సాధారణతలే కాదు.. భిన్నత్వాలు కూడా ఉంటాయి. ఈ ప్రాజెక్టు ఆ కోణాన్ని స్పృశించనే లేదు. కణాల మ్యాపింగ్ అనేది అన్ని రకాల వివరాలను చూపించదు. మరో రకంగా చెప్పాలంటే, దీనిని పూర్తిగా మెదడు మ్యాపింగ్‌గా భావించడానికి వీల్లేదు. చైతన్యం, ఉద్వేగం వంటి మానసిక అనుభూతులను, పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇంకా లోతైన పరిశోధన అవసరం. సుదీర్ఘ ప్రయాణం మొదలైన వెంటనే, గమ్యాన్ని చేరినట్టు ప్రచారం చేయడంలో అర్థం లేదు.

## దీర్ఘకాలిక నొప్పికి కారణమైన ‘నాడీ కణాల నెట్‌వర్క్’!



దీర్ఘాల నొప్పులకు సరైన చికిత్స ఇవ్వాలంటే, ముందుగా ఆ నొప్పులకు కారణాలను వెతుక్కోవాలి. ఇప్పటి వరకూ వైద్య రంగంలో పెయిన్ కిల్లర్లు, ఫిజియోథెరపీ, వ్యాయామాలతోనే ఉపశమనం కలిగిస్తున్నారు. అయితే, సైన్స్ మ్యాగజైన్ తాజా నివేదికను అనుసరించి దీర్ఘకాలిక నొప్పిని అర్థం చేసుకోవడం, చికిత్సను అందించడం వంటి రంగాల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు జరిగాయి. మెదడులో లోతైన ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎవరూ గుర్తించని నాడీ కణాల నెట్‌వర్క్‌ను పరిశోధకులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్ ద్వారా నొప్పి సంకేతాలు ఎలా ప్రాసెస్ అవుతాయో, ఎలా పెరిగిపోతాయో అధ్యయనం చేశారు. నొప్పి సంకేతాలను ఈ నెట్‌వర్క్ నియంత్రిస్తున్నట్లు కనుగొన్నారు. ఫైబ్రోమైయాల్జియా, మైగ్రేన్‌లు, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్ (పిటిఎస్‌డి) వంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి ఈ ఆవిష్కరణ గొప్ప ఊరట. పూర్తిస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే, ఇప్పటి వరకూ మనం అనుసరిస్తున్న సంప్రదాయ చికిత్సలకు తెరపడుతుంది. ఫైబ్రోమైయాల్జియా, దీర్ఘకాలిక మైగ్రేన్ బాధితులు సాధారణ నొప్పి నివారణ మందులు, చికిత్సలు పెద్దగా ఉపశమనం ఇవ్వని బాధాకర దశల్లోనే ఉంటాయి. పిటిఎస్‌డిలో భావోద్వేగ దాడులు శారీరక నొప్పులు లేదా బాధలుగా మారుతాయి. తగ్గిన నొప్పి మళ్లీమళ్లీ తిరిగి వస్తూ ఉంటుంది. ఈ లక్షణాలను నయం చేయడంపై వైద్య నిపుణులు దృష్టి పెట్టారు. మెదడులోని కొన్ని నాడీ కణాలతో కూడిన నెట్‌వర్క్‌ను నొప్పిని మెదడుకు చేరవేస్తున్న మాధ్యమంగా నిర్ధారించారు. ఇవి నొప్పిని పెంచడం లేదా తగ్గించడం చేయగలుతాయని తెలుసుకున్నారు. ఒక రకంగా చెప్పాలంటే, నొప్పికి ఈ నెట్ వర్క్ ఒక నాబ్ మాదిరి పని చేస్తుంది. ఈ నెట్‌వర్క్ ఆధారంగా, భవిష్యత్తులో నొప్పిని నేరుగా మెదడులోనే తగ్గించగల చికిత్సలు అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయి. ఇది తాత్కాలిక ఉపశమనానికి బదులుగా, నిలకడైన పరిష్కారాన్ని ఇస్తుంది.

## విద్యార్థుల కోసం పోరాటం చేస్తే కేసులా? : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ఉప్పల ఉదయ్ కుమార్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం అని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యలపై పోరాడుతున్న ఎఐఎస్‌ఎఫ్ మాజీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి, ఎఐఎస్‌ఎఫ్ ఓయు నాయకులు రాష్ట్ర సమితి సభ్యులు ఉప్పల ఉదయ్ కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఓయూ డిప్యూటీ రిజిస్టర్ శారద చాంబర్ వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్న క్రమంలో అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. ఉదయ్ కుమార్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించ డం జరుగుతుందని ఇప్పటికైనా అక్రమ కేసులు పెట్టకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని, పెట్టిన కేసులు వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరారం జానీ, సహాయ కార్యదర్శి చిప్పలపల్లి నవీన్, చెరుకు లక్ష్మి సాయి, ప్రశాంత్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల ఉత్సవాల విజయవంతానికి జనసేవాదళ్ శిక్షణ శిబిరం




**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు విట్టల్‌రావు కార్యాలయంలో ఆదివారం జన సేవాదళ్ శిక్షణ శిబిరం ఏర్పాటు కోసం నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామని, దాని కొరకు జన సేవాదళ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చేందుకు ముందుగా ఇల్లందు పట్టణ, మండల నుండి ప్రతి శాఖ నుండి యువకులను సన్నద్ధం చేయాలని ఇక్కడ శిక్షణ తీసుకున్న తర్వాత డిసెంబర్ 26న జరిగే కవాతులో ఈ జన సేవాదళ్ కార్యకర్తలు పాల్గొనే విధంగా ప్రతిఒక్కరు బాధ్యత వహించి ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి దాసరి రాజారాం, మహిళ సమైక్య పట్టణ కార్యదర్శి విజయలక్ష్మి, ఎఐవైఎఫ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్, బొల్లి కొమరయ్య, సుందర్, చాట్ల గణపతి, సాంబమూర్తి, వలి, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఈర్ల రవి, వెంకటేశ్వర్లు, మామిడి రవి, భాస్కర్, ఆలపు రాఘవేంద్రరావు, జక్కుల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికుల పెండింగ్ వేతనాలు, పిఎఫ్ వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి మూడు రోజులుగా ఆసుపత్రి కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న సందర్భంగా ఆదివారం కార్మికులకు మద్దతు తెలిపి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.భూపాల్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ నూతనంగా తీసుకున్న 70 మందికి గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం పాత వారికి పిఎఫ్, ఇఎస్‌ఐ కోసం వేతనాల నుండి కటింగ్ చేసినప్పటికీ వారి ఖాతాలలో జమ చేయకుండా టెక్నికల్ సమస్య పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఏ వన్ ఏజెన్సీ వచ్చినప్పటి నుంచి ఆసుపత్రి కార్మికుల సమస్యలు పెరిగాయని ఆరోపించారు. వేతనాలు పిఎఫ్‌లు కట్టకుండా కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు నిరసన కార్యక్రమాలు మెమొరండాలు ఇచ్చిన సరి గా స్పందించకపోవడం వల్ల తప్పనిసరి పరిస్థితులలో నిరవధిక ఆందోళన చేపట్టవలసి వచ్చింది అని వారన్నారు. కాంట్రాక్టర్ కాలపరిమితి ముగిసిందని పిఎఫ్ కట్టకుండా పోతే అధికారులే నైతిక బాధ్యత వహించాలని అన్నారు. నిరుపేద కుటుంబాల చెందిన కార్మికులు నాలుగు నెలలుగా జీతాలు లేకుండా ఏ విధంగా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంట్రాక్టర్ అధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించాలని పిఎఫ్ క్లియర్ చేయాలని వారు కోరారు. పెండింగ్ జీతాలు పిఎఫ్ చెల్లించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ నాయకులు ఎండి సలీం, డి సత్తయ్య, హాస్పిటల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యాదగిరి, వెంకన్న, సైదులు, నాగరాజు, భాస్కర్, భాగ్యమ్మ, నిర్మల, లలిత, నాగమణి, కవిత, ఉషమ్మ, యాదమ్మ, స్వాతి, అజీమ్, ధనమ్మ, పార్వతమ్మ, ఏ.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి

### ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** న్యాయవాదుల సమస్యలపై పోరాడుతూ న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తునామని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జిల్లాల్లోని మడికొండలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌తో పాటు కార్యదర్శి ఉదయ్ భాస్కర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రానున్న బార్ కౌన్సిల్ తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం చేకూరింది. ఐఎఎల్ అభ్యర్థి దుస్సా జనార్ధన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సమావేశంలో వారు తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లాకు చెందిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.




## లేబర్ కోడ్‌ల రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలి

### వ్యవసాయ మార్కెట్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

**ప్రజాపక్షం/నర్సంపేట :** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యవసాయ మార్కెట్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ గేటు ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. అనంతరం మునీశ్వర్ మాట్లాడుతూ నూతన లేబర్ కోడ్‌లో యూనియన్‌లు పెట్టుకోకుండా, సమ్మె హక్కులను కాలరాయడం, పనిగంటలు పెంచడం, మినిమం వేజేస్ నిర్ణయించడంలో యాజమాన్యాల నిర్ణయానికి వదిలేయడం, కార్మిక సంక్షేమం కాలం రాయడం వంటి యాజమాన్య అనుకూల, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం అంటే బహుజన కార్మికులను, మనువాద అగ్రకుల పెట్టుబడిదారి కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మార్చే కుట్రలో భాగమే అన్నారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేసేదాకా ఐక్యంగా పోరాటాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇల్లందుల సాంబయ్య, బొల్లం ప్రసాద్, పిడుగు మొగిళి, అడుప కుమారస్వామి, వైనాల సాయిలు, ఎలబోయిన రవి, ఓదెల కనకమల్లు, ముస్కు కుమార్, సారంగం, రాజు పాల్గొన్నారు




## సిపిఐ బస్సు ప్రచార జాత విజయవంతం : యానాల

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగు వంద వసంతాల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లాలో నిర్వహించిన బస్సు ప్రచార జాతా విజయవంతంగా ముగిసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం భువనగిరిలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దామోదర్‌రెడ్డి మాట్లాడారు. ఖమ్మం బహిరంగసభ విజయవంతం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు ప్రచారం నిర్వహించాయని, అందులో భాగంగా గద్వాల నుండి బయలుదేరిన బస్సు జాత యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ పర్యటించిందని, మరో బస్సు జాత బీబీనగర్, భువనగిరి, వలిగొండ, మోత్కూరు, గుండాల, ఆత్మకూరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట, రాజాపేట, ఆలేరు మండలాల్లో పర్యటించి సభలు నిర్వహించి ప్రచారం చేయడం జరిగిందన్నారు. బస్సుజాతాకు జిల్లా ప్రజల నుండి అపూర్వ స్పందన లభించిందని ఆయన తెలిపారు. బస్సు జాత జిల్లాలో విజయవంతం చేసిన జిల్లా కార్యవర్గ సభ్యులకు మండల కార్యదర్శిలకు జిల్లా కౌన్సిల్ సభ్యులకు ప్రజా సంఘాల బాధ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగు భారీ బహిరంగ సభకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి వేలాదిగా తరలి వెళ్లాలని దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## చింత రామనారాయణ ఆశయాలు కొనసాగిద్దాం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** సీనియర్ కమ్యూనిస్టు నాయకులు చింత రామనారాయణ ఆశయాలను కొనసాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. ఆదివారం మండలంలోని జయగిరి గ్రామంలో చింత రామనారాయణ అమరత్వం పొందగా భౌతిక దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. 60 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ పార్టీ పోరాటాలలో తన వంతు కృషిని కొనసాగించిన చింత రామనారాయణ మరణం కమ్యూనిస్టు పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని జ్యోతి పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలలో సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, రాజమౌళి, మెట్టు. శ్యాంసుందర్‌రెడ్డి, గడ్డం చంద్రమౌళి, రామనారాయణ కుమారులు స్వామి, మధు, సిహెచ్. తిరుపతి, కూతురు స్వరూప,భార్య శకుంతల, పల్లె కుమారస్వామి, కొంగంటి కుమారస్వామి, మోటపోతుల రాజు ,తాళ్ల పెల్లి సాగర్, తాళ్ల పెల్లి చిరంజీవి, పూజ, రాజయ్య, పిట్టల రవి ,తాళ్ల పెల్లి సదానందం పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## టిజిపిఎ రాష్ట్ర అధ్యక్షుడిగా పవన్ కుమార్



ప్రజాపక్షం / వేములవాడ : తెలంగాణ గురుకుల పేరేంట్స్ అసోసియేషన్(టిజిపిఎ) రాష్ట్ర అధ్యక్షుడిగా గుడిసె పవన్ కుమార్ నియమితులయ్యారు. ఆదివారం రోజున హైదరాబాద్‌లో టిజిపిఎ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మోత్కూరి యాదయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడిగా గుడిసె పవన్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా గుడిసె పవన్ కుమార్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. టిజిపిఎ రాష్ట్ర అధ్యక్షుడిగా గుడిసె పవన్ కుమార్ నియామకం పట్ల మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వరుస దొంగతనాలతో ప్రజల్లో భయం.. భయం..



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో చోరీలు వరుసగా చోటు చేసుకుంటుండడంతో ప్రజల్లో మండల ప్రజల్లో భయాందోళన సృష్టిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా దొంగలు ఈ ప్రాంతాన్ని టార్గెట్ చేసినట్టుగా కనిపిస్తోంది. ఇంటికి తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా చేసుకొని దొంగలు తమ పనికానిస్తున్నారు. మండలంలో వరుస చోరీలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తుండగా ఆ కేసులు పోలీసులకు సవాల్‌గా మారాయి. గత కొద్ది రోజుల క్రితమే ముత్తారం మండల కేంద్రంలో రెండు దొంగతనాలతో పాటు ఓడేడ్ గ్రామంలో మరో దొంగతనం జరిగింది. ఇంటికి తాళం ఉంటే చాలు దొంగలు తాళాలు పగుల గొట్టి ఇంట్లో ప్రవేశించి నగదు, బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్తున్నారు. పగటి పూట వీధుల్లో తిరిగి ఎక్కడ ఇళ్లకు తాళాలు ఉన్నాయనేది గమనించి రాత్రివేళ చోరీకి పాల్పడుతున్నారు. తాజాగా ముత్తారం మండల కేంద్రంలో దొంగలు పడ్డారు. గుర్తు తెలియని దొంగలు ఇంటికి వేసిన తాళం పగల గొట్టి లోపలికి ప్రవేశించి, విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని, దొంగలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసు అధికారులను కోరుతున్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా మేడిపల్లి నియామకంపై సంబరాలు



ప్రజాపక్షం/చొప్పదండి:కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం నియమితులైన సంధర్భంగా చొప్పదండి మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బాణసంచాల పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం, సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే క్రమంలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో మేడిపల్లి సత్యం అవకాశం కల్పించారన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లాలో తనకంటూ ప్రత్యేక గర్తింపును తెచ్చుకున్నారని, చొప్పదండి నియోజకవర్గాన్ని పార్టీని తిరుగులేని స్థాయిలో ఉంచడమే కాకుండా ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## మెడికల్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సన్నీ ఎడ్వర్డ్

ప్రజాపక్షం/కరీంనగర్:రేకుర్తిలోని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన మెడికల్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సమావేశం ఆ సొసైటీ అధ్యక్షుడు అల్తాఫ్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. కాలనీలో ఎదుర్కొంటున్న డ్రైనేజీ, నీటి సమస్యలతో పాటు విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై చర్చించి మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులను కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ముందుకు నడవాలని తీర్మానించారు. అనంతరం మెడికల్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీకి సంబంధించి ఆర్గనైజింగ్ సెక్రటరీగా సొడమల్ల సన్నీ ఎడ్వర్డ్‌ను, సలహాదారునిగా ఇనుగాల మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా కొనసాగుతున్న సొడమల్ల సన్నీ ఎడ్వర్డ్ మీడియాతో మాట్లాడుతూ తనను సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. తమ కాలనీలో ఉన్న సమస్యలను సొసైటీ అధ్యక్షుడు అల్తాఫ్ అహ్మద్ ఖాన్, ఉపాధ్యక్షుడు కాంతాల సత్యనారాయణ రెడ్డితో పాటు మిగతా కార్యవర్గ సభ్యులతో కలిసి కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే సహించేది లేదు

హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్



ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట మండల పరిధిలోని శంభునిపల్లిగుంపుల చెక్‌డ్యామ్‌ను పరిశీలించిన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితల ప్రణవ్ ఘటనపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులకు అత్యంత ఉపయోగకరమైన చెక్‌డ్యామ్ ధ్వంసం కావడం తీవ్ర నిర్లక్ష్యమో లేక దురుద్దేశమో అని ప్రశ్నించారు. పూర్తిస్థాయి నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయమై ఇప్పటికీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. వెంటనే మరమ్మత్తుల కోసం నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సైతం త్వరలో ఘటన స్థలాన్ని పరిశీలిస్తారని చెప్పారు. రానున్న వేసవిలో రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని ప్రణవ్ స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, బాంబ్ స్క్వాడ్, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దేశిని కోటి, తదితరులున్నారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీ

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వేళలో ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మహిళలను ఉన్నత స్థితిలో నిలబెడుతాం

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/చిగురుమామిడి : మహిళలను ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానంలో నిలబెట్టడం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో వరుసగా నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చీరల పంపిణీ కేవలం ఒక కార్యక్రమం కాదని, మహిళలు ఐక్యంగా ఉన్నారని తెలియజేసే ఒక సందేశమని పేర్కొన్నారు. మహిళా సంఘాల సూచనల మేరకే మోడల్ చీరలను ఎంపిక చేశామని చెప్పారు. గ్రామ, మండల సమాఖ్యల నాయకులు బాధ్యతగా వ్యవహరించి ప్రతి మహిళ చేతికి చీర అందేలా చూడాలని కోరారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలన్నింటికీ ప్రభుత్వం వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించిన మంత్రి వడ్డీలేని రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తోందని, రైస్‌మిల్లులు, సోలార్‌ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్‌బంకులు, బస్సుల కొనుగోలు వంటి పెద్ద వ్యాపారాల్లోనూ మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లల చదువు పట్ల శ్రద్ధ చూపిన కుటుంబాలే ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు ఇంటింటి సర్వేలో బయటపడిందన్నారు. అందుకే విద్యపై మహిళలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గానికి ఇప్పటివరకు 3500 ఇండ్లు మంజూరయ్యాయని, మరో విడత ఇండ్ల కేటాయింపులో త్వరలో జరగనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుందని వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర అందేలా సంఘ సభ్యులు కృషి చేయాలని సూచించారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. త్వరలో సైదాపూర్ మండలంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షలతో సహా మరెన్నో వైద్య సేవలను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డిఓ మహేశ్వర్, డిఆర్‌డిఓ శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు గందె రజితలు. మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సంఘ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణిలు పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు ప్రమీలాదేవి

అమరజీవికి ఖనిలో ఘనంగా నివాళులు



ప్రజా పక్షం/పెద్దపల్లి: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర నాయకురాలు సిపిఐ సీనియర్ నేత అమరజీవి ఎ.ప్రమీలాదేవి మూడవ వర్ధంతినీ శనివారం ఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అశోక్ నగర్ లోని సిపిఐ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మూడవ వర్ధంతి సభకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోషిక మోహన్, నగర కార్యదర్శి కె. కనకరాజ్‌లు హాజరై ముందుగా ప్రమిలాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన యోధురాలని కొనియాడారు. సారా వ్యతిరేక ఉద్యమంలో పారిశ్రామిక ప్రాంతంలో కీలక భూమిక పోషించడం, అదేవిధంగా రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభలు నిర్వహించడంలో ముందుండి నడిపించారని అన్నారు. ప్రమీల దేవి లేనిలోటు తీర్చలేనిదని వారన్నారు. స్థానిక అశోక్ నగర్‌లో ఉన్న సిపిఐ కార్యాలయానికి ప్రమీల దేవి పేరు పెడుతూ నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా అశోక్ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి పార్టీని మహిళా సమాఖ్యను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య నాయకురాలు తిరుమల అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, కామ్రేడ్ శనిగరపు చంద్రశేఖర్, మడికొండ ఓదెమ్మ,శనిగరపు రాజ్ కుమార్, అసల రమ , వై.లెనిన్, జైపాల్ రెడ్డి, రాజమ్మ, బీ పాషా, తాళ్ళపెల్లి సుగుణ, గాజుల శంకరమ్మ, జంగా లక్ష్మి , శ్రీలత, గడ్డం లక్ష్మి , కాసర్ల భారతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ నగర్ డబుల్ బెడ్రూమ్ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట అర్బన్ మండలం కెసిఆర్ నగర్ ప్రభుత్వ డబుల్ బెడ్‌రూంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల (ఉర్దు మీడియం)లను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డబుల్ బెడ్‌రూంలో కొనసాగుతుండటంతో చాల ఇబ్బందులు, సమస్యలు ఎదరువుతున్నాయని విద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకోచ్చారు. మూడు పాఠశాలల్లో కలసి 350 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. కెసిఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం ఉన్నందున శాశ్వత భవనం కోసం ఇంజనీరింగ్ అధికారులతో కావాల్సిన గదుల ఆధారంగా ఎస్టిమెట్ తయారు చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి ఆదేశించారు. కెసిఆర్ నగర్ లో ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి నైపుణ్య శిక్షణ కేంద్రం మూసివేసి తర్వాత ఎవ్వరు పట్టించుకోకుండ నిరూపయోగంగా ఉన్నందున ఫంక్షన్ హాల్ మొత్తం శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్‌ను ఆదేశించారు. ఎవరైన ప్ర భుత్వ భవనాల ఆస్తులను ధ్వంసం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సిద్దిపేట ఆర్యవైశ్యసంఘం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట ఆర్యవైశ్యసంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆకాంక్షించారు. పేద వైశ్యుల అభివృద్ధికి ఆర్యవైశ్య సంఘం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలోనే సిద్దిపేట అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో హౌజింగ్ బోర్డు కాలనీలో పట్టణ ఆర్యవైశ్యసంఘం నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణానికి నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్యసంఘం కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పదవితోనే గౌరవం గుర్తింపు రాదని, మీరు చేసే సేవకు పనికి గుర్తింపు వస్తుందన్నారు. ఆర్యవైశ్యసంఘం చేసే కార్యక్రమాలకు ఎల్లప్పుడు సంపూర్ణ సహాకారం ఉంటుందన్నారు. ఆనంతరం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

**ముస్తాక్ అలీ టౌర్నమెంట్‌కు సిద్దిపేట క్రీడకారుడు ఎంపిక:**ఈనెల 26 నుండి కలకత్తలో జరిగే బిసిసిఐ సినియర్ మెన్స్‌సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టి20) కోసం హెచ్‌సిఎ టీమ్ కోసం సిద్దిపేట క్రీడకారుడు అర్బాజ్ ఆహ్మద్ ఎంపికైనారు. క్రీడకారుడు ఎంపిక పట్ల మాజీ మం త్రి హరీశ్‌రావు అభినంధించారు. సిద్దిపేట క్రికేట్ స్టేడియాన్ని అభివృద్ధి చేయటం, టౌర్నమెంట్‌లు నిర్వహించటం వల్ల ప్రతిభ గల క్రీడకారులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యం

బాధ్యతలు చేపట్టిన పెద్దపల్లి జిల్లా డిసిపి భూక్యా రామ్ రెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ నూతన డిసిపిగా భూక్యా రామ్ రెడ్డి ఆదివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. డిసిపి పుల్ల కరుణాకర్ స్థానంలో సిఐడి విభాగంలో ఎస్‌పిగా పనిచేస్తున్న భూక్యా రామ్ రెడ్డి ఐపిఎస్ డిసిపిగా నియమితులయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్లలోని గర్జనపల్లికి చెందిన ఆయన 1989 బ్యాచ్ ఎస్‌ఐగా పోలీస్ శాఖలో చేరి అంచలంచలుగా ఎదిగి 2020లో ఐపిఎస్ హోదా సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతా పరిరక్షణ, మహిళా, శిశు రక్ష ణ,సైబర్ నేరాల నియంత్రణ, యువతలో నేర ప్రవృత్తుల నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకొని, ప్రతి పోలీసు సిబ్బంది సహకారంతో సమర్థవంతమైన పోలీసింగ్ ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లలో, సిఐల వద్ద, ఎసిపిలను సంప్రదించాలని, సమస్య పరిష్కారం కాకపోతే డిసిపి ఆఫీసుకు రావాలని అన్నారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా చేసే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని, గంజాయి సేవించేవారిని మరియు నిషేదిత మత్తు పదార్థాలు అక్రమ రవాణా, సరఫరా, నిల్వ చేయడం వంటి వాటిని ఉక్కుపాదం తో అణిచివేస్తామని తెలిపారు. ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఫోన్లో నేరుగా సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## తెల్లరేషన్ కార్డున్న ప్రతీ మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ


ఎఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: తెల్ల రేషన్ కార్డున్న మహిళలందరికి ఉచితంగా చీరలు పంపిణీ చేస్తామని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్, పీర్లపల్లి, ధర్మారం, దౌలాపూర్, మాందాపూర్, గొల్లపల్లి, మునిగడప, గ్రామాలలో ఇందిర మహిళ శక్తి గ్రూపు సభ్యులకు ఉచిత చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల ఆత్మగౌరవం పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 18 సంవత్సరాలు పై బడిన అర్హులైన మహిళలందరికి చేనేత చీరలను పంపిణీ చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన చీరలు స్త్రీల ఆత్మగౌరవం కించపరిచే విధంగా ఉండేవని గుర్తు జేశారు. మహిళలను మహారాణులుగా మార్చేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే స్వయం ఉపాధి పథకాల ద్వారా బ్యాంకు లింకేజీలతో వడ్డిలేని రుణాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కరుణాకర్, మహేష్ యాదవ్, మహేందర్ యాదవ్, గాల్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాసరావు, అబ్బు, ఆజీస్,ఆంజనేయులు, వెంకటేవ్, నరేష్, మధుసూదన్‌రెడ్డి, ఐలయ్య,వేంకటస్వామి, కిషన్, ప్రసాద్, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడిన కార్యకర్తకు కాంగ్రెస్‌లో అవకాశం

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జగిత్యాల జిల్లా నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాజెంగి నందయ్య నియమితులైన సందర్భంగా అభినందన సభలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ ఆలస్యం అయిన కాంగ్రెస్ పార్టీ కష్టపడిన కార్యకర్తను గుర్తించి అవకాశం కల్పిస్తుంది అని చెప్పడానికి ఉదాహరణ మొదట లక్ష్మ ణ్ కుమార్ అనే నేను రెండు నందన్న కార్యకర్త స్థాయి నుంచి జిల్లా అధ్యక్షుడిగా మంత్రిగా పార్టీ గుర్తించి అవకాశం కల్పించింది అని అన్నారు. పెద్దలు జీవన్ రెడ్డి, శ్రీధర్ బాబు నా భుజం తట్టి ముందుకు నడిపించారు. జీవన్ రెడ్డి 2018లో లక్ష్మ ణ్ కుమార్‌కి టికెట్ ఇవ్వకపోతే నాకు కూడా వద్దు నేను కూడా పోటీ చేయను అని చెప్పారు అని మంత్రి అడ్లూరి అన్నారు. ఏది మర్చిపోలేను అని అన్నారు నా సోదర కార్యకర్తలు అందరు నాకు అండగా నిలిచారు అని మంత్రి అన్నారు. ఇతనాలు ఫ్యాక్టరీ సంబంధించి నాతో పాటు జీవన్ రెడ్డి కూడా పోరాటం చేశారు అని అన్నారు. ఆనాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా ప్రజల పక్షాన నిలబడి పోరాడితే పోలీసులు రోజుల తరపడి అరెస్ట్ చేశారు అని గుర్తు చేశారు. కెటిఆర్, హరీశ్ రావు సైడ్ పాలిటిక్స్ చేస్తున్నారు మంత్రి అడ్లూరి, నేను జైల్లో జిమ్ చేస్తా సిక్స్ ప్యాక్ చేస్తా అన్నావు కదా పోయి జైల్లో సిక్స్ ప్యాక్ చేసుకో అని మంత్రి అడ్లూరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దోచుకతింటుంది, దాచుకుంటుంది అని తప్పుడు ప్రచారం చేయకు అని మంత్రి అన్నారు. ప్రజలు కర్ర కాల్చివాత పెట్టిన బుద్ధిరాలేద అని మంత్రి అడ్లూరి ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారానికి వెళితే ప్రతి ఒక్కరు ఆప్యాయంగా పలకరించారు. అన్న మేము రేవంత్ అన్న ఇచ్చే సన్నబియ్యం తింటున్నాం అని సంతోషంగా చెప్పారు అని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు రేషన్ కార్డు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత రవాణా పొందుతున్నాం అని మహిళలు సంతోషంగా చెప్పారు అని మంత్రి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా అనేక పర్యాయాలు కమిట్ మెంట్ నిబద్ధతతో నదన్నను సేవలు అందించారు. కాబట్టి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి బాధ్యత నదన్నను వరించింది అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్త కష్టం నందన్నకు తెలుసు ఎవరు అసలు ఎవరు నకిలీ ఇట్టే కానిపెడ్తారు. నందన్న ముందు ఎవరి ఆటలు సాగవు అని జీవన్ రెడ్డి అన్నారు. కార్యకర్తకు అన్యాయం జరుగుతే నందన్న ఊరుకోదు నా మాట కూడా వినడు అని మాజీ మంత్రి అన్నారు. 10 సంవత్సరాలు కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేసి మళ్ళీ అభివృద్ధి ముసుగులో కాంగ్రెస్ పార్టీలో చేరి అదే దౌర్జన్యాలు చేస్తున్నారని మాజీ మంత్రి అన్నారు. 10 సంవత్సరాలు రాజ్యం ఏలారు కదా ఎం అభివృద్ధి చే శారు 10 సంవత్సరాలు నిద్రపోయి ఇప్పుడు జనంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదారణ చూసి అభివృద్ధి ముసుగులో కాంగ్రెస్ పార్టీలో రాజ్యం ఎలుతామని ప్రయత్నం చేస్తున్నారు అని జీవన్ రెడ్డి అన్నారు. కార్యకర్తలను కన్నబిడ్డగా చూసుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం సహజం అని జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి నేతృత్వంలో స్థానిక సంస్థలలో జగిత్యాల జిల్లాలోనే అధిక స్థానాలను గెలుచుకునే విదంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.

# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్



## ఏలే మల్లిఖార్జున్‌కు డిసిసి పదవి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఏలే మల్లిఖార్జున్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి లభించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఒక ప్రకటన ద్వారా ఆదివారం తెలిపాయి. నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ మండల ప్రజల్లో, యువకుల్లో పేరు ప్రఖ్యాతలు సాధించిన మల్లిఖార్జున్‌కు ఆ పదవి రావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధ్యక్ష పదవి కొరకు 28 మంది పోటీ పడగా ఎఐసిసిఅధిష్ఠానం మాత్రం మల్లికార్జున్‌కే అధ్యక్ష పదవి కట్టబెట్టింది. మల్లికార్జున్ వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఎఎంసి డైరెక్టర్‌గా, నిజాంసాగర్ మండల వైస్ ఎంపిపిగా, ప్రస్తుతం నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ డిసిసి స్థానం సంపాదించిన మల్లిఖార్జున్ సేవలను పలువురు కొనియాడుతున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావ్‌లు హైకమాండ్‌ను ఒత్తిడి చేయడంతో మల్లికార్జున్‌కు డిసిసి పదవిని ఇస్తూ అదిష్ఠానం ఆదేశాలిచ్చింది. మల్లికార్జున్ నియామకమైనట్లు తెలుసుకున్న జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.

## నిర్మల్ జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 97.5 శాతం హాజరు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**నిర్మల్ జిల్లాలో నేషనల్ మీన్స్‌కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ఉదయం 9.30 నుండి పగలు 12.30 వరకు ఐదు పరీక్షా కేంద్రాలలో ప్రశాతంగా ముగిసింది.ఈ పరీక్షకు మొత్తం 1043 మంది విద్యార్థులు ఉండగా,వారిలో 1017 మంది విద్యార్థులు హాజరయ్యారు.కేవలం 26 మంది మాత్రమే గైరాజరయ్యారు.దీంతో హాజరు శాతం 97.5 శాతంగా నమోదైంది.పరీక్ష నిర్వహణ పటిష్టంగా ఉండేందుకు ప్లయింగ్ స్క్వాడ్,సిట్టింగ్‌స్క్వాడ్,సెంటర్ లెవెల్ అబ్జర్వర్లను ప్రత్యేకంగా నియమించారు.అంతేకాకుండా,ప్రతి కేంద్రంలో పోలీసు బందోబస్తుతో పాటు మెడికల్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలను నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న,ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ సందర్శించి,ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 26 నుండి రాముగూడలో కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/ఖానాపూర్:**భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం టి.ఎ.జి.ఎస్ ఆధ్వర్యంలో పెంబి మండలంలోని రాముగూడ గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం సంబు అన్నారు.ఈ నెల 26 నుండి పోటీలు ప్రారంభం అవుతాయి అని,మొదటి బహుమతి 5వేలుషీల్డ్,రెండవ బహుమతి 3వేలు షీల్డ్,ఎంట్రీ ఫీజు 500 రూపాయలు,ఈ పోటీలకు పెంబి మండలంలోని క్రీడాకారులు మాత్రమే పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.కబడ్డీ పోటీల కరపత్రాలను విడుదల చేశారు.క్రీడాకారులు,ప్రజలు,నాయకులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలనీ కోరారు.పూర్తి వివరాలకు 7981079047,6303614939, 8106917647 సంప్రదించాలని తెలిపారు.

## కాంగ్రెస్ బలోపేతం లక్ష్యంగా ముందుకెళ్తా

### కృతజ్ఞతలు తెలిపిన ఆంక్షా రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:**సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమిస్తానని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట ఆంక్షారెడ్డి స్పష్టం చే శారు. జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా పార్టీ శ్రేణులు ఆమెను ఆదివారం గజ్వేల్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ ంక్షా రెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తల కష్టంతోనే తనకు ఈ పదవి దక్కిందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వచ్చే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం పొందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు జిల్లాలో గ్రూపులు, వర్గాలు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తానని, అందరి ఆశీస్సులు తీసుకుంటానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు పేదలకు చేర్చడమే తనవంతు లక్ష్యం కాగా, నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్న సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. క్రింది స్థాయి నుండి వచ్చిన తనకు కార్యకర్తల కష్టసుఖాలు తెలుసని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలో పర్యటించి పార్టీ శ్రేణులను కలవడంతోపాటుఅధిష్టానంఆదేశాలమేరకు ముందుకెళ్తానని వివరించారు.

## మహిళా అభ్యున్నతి కోసం పాటుపడుతున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :**నిజాంపేట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపకం కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తర్వాత అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రజల మన్నన పొందిందని అన్నారు. డ్వాక్రా సంఘాలకు లక్షలాది రుణాలు హెచ్చించిన ఘనత ప్రభుత్వం దేనిని అన్నారు. మేము మాటలు చెప్పమని చేతులతో చేసి చూపెడతామని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరలు పంపిణీ, రైతు భరోసా, ఉచిత కరెంటు, 500 గ్యాస్, ఇలాంటి పథకాలను తెచ్చి మహిళల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులల్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే తాట ఇస్తానని అన్నాడు. రానున్న రోజులలో సర్పంచుల అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, టిఆర్ఎస్ కు దిక్కుతోచని విధంగా ప్రజలు బుద్ధి చెబుతున్నారని ఆయన పునరుద్ఘాటించారు. రాబోయే ప్రభుత్వం కూడా కాంగ్రెస్ పార్టీ చేపడుతుందని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంల డిపిఎం వెంకటేష్, సుప్రభాతారావు, సరాపు యాదగిరి, దేమే యాదగిరి, రమేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడువెంకట గౌడ్ పట్టణ అధ్యక్షుడు కొమ్మాట బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులుఎంఎస్ఒబి లావణ్య, రాజేశ్వరి, లహరి, వివొలు ఎస్‌హెచ్‌జి మెంబర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం, సేవతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు

### మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ప్రజాపక్షం/పాపన్నపేట:**గత పది ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో అవినీతి, అప్పులు తప్ప వారు చేసింది ఏమీ లేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం, సేవా కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం లోని వెలుగు మండల సమైక్య ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చీరలు పంపిణీ చేశారు. అనంతరం గాంధారిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు అశోక్ కూతురి కేశఖండనం, పంచాయతీ కార్యదర్శుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బలరాం కూతురు, కుమారుడు పుట్టు ఓల్లలు కార్యక్రమంలో పాల్గొన్నారు. చీరలు పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపికైన మహిళా గ్రూపు సభ్యులకు ఆ గ్రూపుల ద్వారా రూ.2 లక్షల మేరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఆర్‌టిటిబస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సొంత ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలువాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి, వారి ఉన్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సేవతో ఈ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, నరేందర్ గౌడ్, శ్రీకాంతప్ప, పంతుల భూమయ్య, గౌస్ పాషా, చోటు, షాహిద్ పాషా, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## చెత్త తీయడం లేదని మహిళల ధర్నా



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** డబుల్ బెడ్రూమ్ మహిళలు గత 20 రోజులుగా చెత్త తీయడం లేదని రోడ్డుపై బైఠాయించారు. వివరాలిలా ఉన్నాయి .భీ మ్‌గల్ పట్టణంలోని డబు ల్ బెడ్రూమ్ ఏరియా నుం డి రోజులు చెత్తను మున్సిపల్ ఆటోలో సేకరిస్తాయి. కానీ గత 20 రోజులుగా తమ డబుల్ బెడ్రూమ్ ల నుండి చెత్తను తీసుకెళ్లేందుకు ఎలాంటి మున్సిపల్ ఆటోలో రావటం లేదని దాంతో ఇళ్ల పరిసరాల్లో చెత్త అలాగే ఉంటుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తీసుకెళ్లాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదని దాంతో సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని డబుల్ బెడ్రూమ్ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గత ఫోర్‌డేస్ నుండి నీళ్ల కూడా రావటం లేదని వాపోయారు. ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చిందని సంతోషపడాలని సమస్యలు పట్టించుకోవడం లేదని బాధపడాలో అర్థం కావటం లేదన్నారు. డబుల్ బెడ్రూమ్‌లను భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని తెచ్చి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లేకుంటే ఆదోళన తీవ్రం చేస్తామని మహిళలు హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించిన సంగతి తెలుసుకున్న ఎస్ఐ సందీప్ సమస్యలు పరిష్కరించేదుకు అధికారులతో మాట్లాడి సహకరిస్తామని హామీనివ్వటంతో మహిళలు ఆందోళన విరమించారు.

## ఏడుపాయల క్షేత్రంలో.. భక్తుల రద్దీ

### మొక్కులు చెల్లించుకున్న భక్తులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో ఆదివారం భక్తులతో జనసంద్రమైం ది, వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భ క్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందం గా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముం దున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. అమ్మ దర్శనంతో భ క్తులు తన్మయత్వం చెందారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. వనదుర్గమ్మా.. దీవించమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

## ఆలయ నిర్మాణానికి మహేష్‌కుమార్‌గౌడ్ శంకుస్థాపన



### గ్రామాభివృద్ధి కోసం నిరంతర కృషి

### గ్రామం మీదుగా వెళ్లే ఆలయ కారిడార్ రోడ్డు కోసం సిఎం,

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**భీమ్‌గల్ మండలం రహత్ నగర్ గ్రామానికి చేరుకున్న టిపిసిసిఅధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలతో ప్రజలు సత్కరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోరూ. 50 లక్షలతో నిర్మిస్తున్న దుర్గాదేవి నూతన ఆలయ భూమిపూజలో పాల్గొనగా టిపిసి సిచీఫ్ గతంలో తన తండ్రి బొమ్మ గంగాధర్ గౌడ్ గ్రామంలో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించిన విషయాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో టిపి సిసి చీఫ్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఈరవత్రి అ నిల్, అన్వేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

### ఎస్‌పి డా.జి.జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచడం అత్యవసరమని భావించిన నిర్మల్ జిల్లా పోలీసులు,జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్‌ఆదేశానుసారం ఈరోజు జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో,గ్రామాల్లో,రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరించారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.అంతేకాకుండా,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,ఒకవేళ అలా నడిపితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ,డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు తగ్గుతాయని స్పష్టం చేశారు.వాహనదారులు తప్పనిసరిగా రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను ముందుగానే గుర్తించాలని ఆమె సూచించారు.మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేసే డ్రైవర్లను దూరం నుంచి గుర్తించి,వారితో సురక్షిత దూరం పాటించాలని తెలియజేశారు.రోడ్డుపక్కన పార్క్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరుచుకునే అవకాశం ఉన్నందున వాటి నుండి దూరంగా ఉండాలని,ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసే వాహనాలను గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .ముఖ్యంగా,ముందున్న వాహనం అకస్మికంగా బ్రేక్ వేస్తే ఢీకొనే ప్రమాదం ఉన్నందున తగినంత దూరం పాటించాలని కోరారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన హెచ్చరిక..**

మద్యం సేవించి వాహనం నడిపితే ప్రాణాలకు ముప్పే కాకుండా,చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు.ఇలా చేసిన వారిపై కోర్టు ద్వారా చట్ట పరమైన శిక్షలు విధించి జరిమానాలు విధించబడతాయని తెలియజేశారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు,సిబ్బంది పాల్గొని ప్రజలకు డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలను,డ్రంక్ అండ్ డ్రైవ్ గురించి అవగాహన కల్పించారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

### పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:**ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆదివారం జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సలహాదారు సుదర్శన్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అభివృద్ధి పనులకుశంకుస్థాపన చేశారు. ఆంధ్రనగర్ నుండి ఇందిరానగర్ మీదుగా లక్నాపూర్ వరకు రూ.2.28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నందిపేట్ శివారులో జన్నెపల్లి మెయిన్ రోడ్డు నుండి లక్కంపల్లి, చీంరాజ్‌పల్లి మీదుగా తల్వేద వరకు రూ.6.93 కోట్లతో చేపట్టనున్న ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ పనులకు అయిలాపూర్ గ్రామంలో రూ.2.45 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రతిచోట ప్రజాప్రతినిధులను కలెక్టర్‌ను ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## రూ. 12 కోట్ల పనులకు ప్రముఖుల శంకుస్థాపనలు



**ప్రజాపక్షం / నందిపేట్ :**నందిపేట్ మండలంలో పలు పనులకు భూమిపూజలు జరిగాయి. పిసిసి అద్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యేపొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేస్ రెడ్డి, ఆర్మూర్‌నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ఆధ్వర్య ంలో ఆంధ్రనగర్ నుండి ఇంద్రనగర్ మీదుగా లక్నపూర్ వరకు రూ. 2.28 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు భూమిపూజ చేశారు. అలాగే నందిపేట్ క్రా స్ రోడ్డు నుంచి తల్వేద గ్రామం వరకు రోడ్డు భవనాల శాఖ కింద చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు రూ. 6.93 కోట్లతో మహేశ్ కుమార్ గౌడ్, సుదర్శన్‌రెడ్డి, రాకేష్ రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. అక్కడినుండి అయిలాపూర్ గ్రామంలో ఎస్‌సి బాలుర వసతి గృహ నిర్మాణానికి వీరు భూమిపూజ చేశారు. ఉన్నతాధికారులు బిజెపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రముఖులకు స్వాగతం పలికిన రాకేష్ రెడ్డి**


ఆర్మూర్ నియోజకవర్గంలో పలు పనులలో పాల్గొనడానికి ఆదివారం వచ్చిన రాష్ట్ర పిసిసి అద్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. షబ్బీర్ అలీ, ఈరవత్రి అనిల్, వినయ్ రెడ్డి తదితరులు వచ్చారు. నందిపేట్ మండల కార్యక్రమాలకు వచ్చిన ప్రముఖులను ప్రజలు వినతి పత్రాలతో ముంచెత్తారు.

## ఇది ప్రజాప్రభుత్వం... రైతుల, మహిళలకు అండ

### మహేశ్ కుమార్ గౌడ్, సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/నందిపేట్:**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని ఎల్లవేళలా రైతులకు, మహిళలకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం నందిపేట్ మండలంలో వివిధ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అయిలాపూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎనలేని సేవలు చేస్తుందన్నారు. రైతులకు సకాలంలో రైతుబందు, బోనస్ కావలసిన ఎరువులు అందిస్తుందని చెప్పారు. మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, వడ్డీ రాయితీ, తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిందని గుర్తుచేశారు. వైద్య, విద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, రాష్ట్రాభివృద్ధి కి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నియోజకవర్గంలో పలు ఎత్తిపోతల పథకాలు మరమ్మతుల కోసం ఉన్నాయని పెద్దలు వీటి గురించి పట్టించుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు గట్టి ప్రయత్నాలు చేయాలని, మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళ శక్తి చీరలు పంపిణీ చేశారు. దాదాపు ఏడు గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. అయిలాపూర్ గ్రామ ప్రజలు ఓపికతో సమావేశం అయ్యేంతవరకు ఉన్నారు. అన్ని కుల సంఘాల వారు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. వినయ్ రెడ్డి, షబ్బీర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## గని ఉద్యోగులకు శుద్ధమైన తాగునీరు



### జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్


**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :**సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులకు సమయానుకూలంగా శుద్ధమైన తాగునీరు అందించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఏరియాలోని జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో పర్చేజ్ విభాగానికి సంబంధించిన అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ గనులు, విభాగాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫికేషన్ యంత్రాల పనితీరు, నిర్వహణ, అవసరమైన పరికరాల లభ్యతపై అధికారులతో చర్చించారు. గనుల్లో పనిచేసే వారికి సమయానికి స్వచ్ఛమైన నీరు అందేలా యంత్రాలు సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. యంత్రాలకు అవసరమైన విడి భాగాలు, రసాయనాలు, సర్వీసింగ్ సామాగ్రి లభ్యతలో లోటు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్చేజ్ ప్రక్రియ, ఫైళ్లు, టెండర్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఓటు జిఎం కుర్మా రాజేందర్, ఏజిఎం ఫైనాన్స్ పి. సుమలత, ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎ. వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, రవి కుమార్, డిజిఎంలు రాజన్న, మల్లయ్య, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, సిహెచ్ఎస్ఇ చంద్రలింగం, గని ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, వివిధ గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# రీల్



## 'స్పిరిట్' షూటింగ్ షురూ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు మెగాస్టార్ చిరంజీవి క్లాప్ కొట్టారు. ఆదివారం నుంచే స్పిరిట్ సినిమా తొలి షెడ్యూల్ ప్రారంభం అయింది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన యానిమల్ సినిమాలో నటించిన త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్ ఇందులో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. భూషణ్ కుమార్, సందీప్ రెడ్డి వంగా, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## మహత్ రాఘవేంద్ర న్యూ లుక్...

బ్యాక్ బెంచ్ స్టూడెంట్, లేడీస్ అండ్ జెంటిల్‌మేన్ వంటి హిట్ చిత్రాలతో తెలుగు ఆడియెన్స్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో మహత్ రాఘవేంద్ర. మంగాత, జిల్లా, చెన్నై 28 పార్ట్ 2 వంటి పలు సక్సెస్ ఫుల్ తమిళ చిత్రాలతో పాటు డబుల్ ఎక్స్ ఎల్ వంటి బాలీవుడ్ సినిమాల్లోనూ నటించి పేరు తెచ్చుకున్నారీ యంగ్ టాలెంటెడ్ హీరో. మహత్ రాఘవేంద్ర ఇప్పుడు తిరిగి టాలీవుడ్‌కు రాబోతున్నారు. కంప్లీట్ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, న్యూ లుక్ తో మహత్ రాఘవేంద్ర ఆకట్టుకుంటున్నారు. హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్‌తో మహత్ రాఘవేంద్ర ఓ ఇంటెన్స్ లవ్ స్టోరి మూవీ చేస్తున్నారు. ఈ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ముందుకు తిరిగి రావడం హ్యాపీగా ఉందని మహత్ రాఘవేంద్ర తెలిపారు. తనను ఇప్పటిదాకా ఆదరించిన తెలుగు ప్రేక్షకులు మరోసారి తమ లవ్ అండ్ సపోర్ట్ అందిస్తారని ఆయన ఆశిస్తున్నారు. టాలీవుడ్ రీ ఎంట్రీ పట్ల ఎగ్జైటింగ్‌గా ఉన్నానని, ఇది తన కెరీర్‌కు కొత్త ఛాప్టర్ అవుతుందని మహత్ రాఘవేంద్ర చెప్పారు.



## అంగరంగ వైభవంగా 'ఆంధ్ర కింగ్ తాలూకా'

### వైజాగ్‌లో మ్యూజిక్ కాన్సర్ట్

రామ్ పోతినేని నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆంధ్ర కింగ్ సూపర్ స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్, మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది, పాటలు చార్ట్ బస్టర్లుగా మారాయి. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో రామ్ మైండ్ బ్లోయింగ్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ అందరినీ మెస్మరైజ్ చేసింది. ఈ సందర్భంగా రామ్ పోతినేని మాట్లాడుతూ... నా కెరీర్‌లో గర్వపడే సినిమా ఆంధ్ర కింగ్ తాలూకా. టీజీ జార్జ్ సిద్ధార్థ ఫెంటాస్టిక్ విజువల్స్ ఇచ్చారు. వివేక్ మెర్విన్ తెలుగు సినిమాకి ఒక కొత్త సౌండ్ తీసుకొచ్చారు. ఈ ఆల్బం గుండెల్లో నిలిచిపోతుంది. ఇది వారి ఆరంభం మాత్రమే. తెలుగు ఇండస్ట్రీకి చాలా రోజుల తర్వాత గ్లామర్‌తో పాటు మంచి పర్ఫార్మెన్స్ చేసే హీరోయిన్ భాగ్యశ్రీ వచ్చింది. ఏదైనా కొత్తగా చేయాలనుకున్నప్పుడు మహేష్ నా జీవితంలోకి వచ్చాడు. ఒక సినిమాకి ఒక అభిమానానికి ఉన్న శక్తి. ఉపేంద్రతో కలిసి పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. 'ఆంధ్ర కింగ్ తాలూకా' 27న రిలీజ్ అవుతుంది. అందరం థియేటర్లలో కలుద్దాం అని అన్నారు. రియల్ స్టార్ ఉపేంద్ర మాట్లాడుతూ.. ఏ, ఉపేంద్ర, రక్తకన్నీరు ఈ సినిమాలన్నీ మీకు గుర్తు ఉండడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చూసిన వ్యక్తిగా ఒక మాట చెప్తున్నాను. ఈ సినిమా చూసి మీరు అందరూ కాలర్ ఎగరేసుకుంటూ బయటికి వస్తారు అని చెప్పారు. హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ.. నా చిన్ని గుండెలో చాలా ఆశలతో ఇక్కడికి వచ్చాను. మీ అందరి అభిమానానికి ధన్యవాదాలు. రామ్ అభిమానుల్ని ఎంతగానో ప్రేమించే హీరో. ఆయన కింగ్ ఆఫ్ హార్ట్స్. మీ అందరి ప్రేమకు ఆయన అర్హులు. నవంబర్ 27న అందరూ కూడా ఈ సినిమాని చూడాలని కోరుతున్నానన్నారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా ఏపి హోం మినిస్టర్ వంగలపూడి అనిత హాజరయ్యారు. డైరెక్టర్ మహేష్ బాబు, మ్యూజిక్ డైరెక్టర్ వివేక్ మెర్విన్, నిర్మాత రవి శంకర్ పాల్గొన్నారు.




## ట్రెండింగ్‌లో.. చికిరి చికిరి..

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమాలోని చికిరి చికిరి పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నడుస్తోంది. ఈ పాట విడుదలైన అతి తక్కువ రోజుల్లో 500కే ప్లస్ ట్రెండింగ్‌లో ఉండటంతో సినిమా నిర్మాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటకు ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఈ సినిమా లోని స్టెప్ వరల్ వైడ్‌గా ట్రెండ్ అవుతుంది. ఈ సాంగ్‌కు జాని మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పుడు యూత్ అంతా చికిరి చికిరి స్టెప్‌ను ఫాలో అవుతున్నారు. రామ్ చరణ్ సరసన జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ పాటను ఇటీవలే షూట్ చేశారు. రెగ్యులర్‌గా సినిమా షూటింగ్ జరుగుతోంది. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది మార్చి 27వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రత్నవేలు సినిమాటోగ్రఫీ, ఎడిటర్ నవీన్ నూలీ పని చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## వృషకర్మ ఫస్ట్ లుక్

యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ భారీ విజయంతో తర్వాత విరూపాక్షతో బ్లాక్ బస్టర్ అందుకున్న విజనరీ దర్శకుడు కార్తీక్ దండుతో చేస్తున్న మైథలాజికల్. 'వృషకర్మ' టైటిల్ ఫస్ట్ లుక్ మహేష్ బాబు విడుదల చేశారు. ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. నాగ చైతన్య పుట్టిన రోజు ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 'వృషకర్మ' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. 'వృషకర్మ' ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నాగ చైతన్య చేతిలో సాలిడ్ రాడ్ పట్టుకుని ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. అతని చుట్టూ ఉన్న విజువల్ ఎగిరే ధూళి, పొగతో నిండి పవర్ ఫుల్ యాక్షన్‌ని సూచిస్తోంది. బ్యాక్ డ్రాప్‌లో పురాతన భవనాలు, ప్రకాశవంతమైన బంగారు కాంతితో కూడిన ఆకాశం కనిపిండం క్యూరియాసిటీ మరింతగా పెంచింది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, లాపతా లేడీస్ ఫేమ్ స్పర్శ శ్రీవాస్తవ విలన్గా కనిపించనున్నాడు. రఘుల్ డి. హేరియన్ సినిమాటోగ్రఫీని, అజనీస్ బి. లోకనాథ్ సంగీతాన్ని, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్‌ను, నవీన్ నూలి ఎడిటింగ్‌ను నిర్వహిస్తున్నారు.



## అనిల్‌కు జన్మదిన శుభాకాంక్షలు

మన శంకర వరప్రసాద్ గారు సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి ఆదివారం ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. హీరో మెగాస్టార్ చిరంజీవి పుష్ప గుచ్ఛంతో అనిల్‌కు ఘన స్వాగతం పలికారు. అనిల్‌కు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనిల్ ఎంతో ఎత్తుకు ఎదగాలని చిరంజీవి ఆశీర్వాదించారు.

## హార్రర్ థ్రిల్లర్‌గా 'విచిత్ర'

రవి శ్రీయ తివారి హీరో హీరోయిన్‌గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్‌పై సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వంలో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం 'విచిత్ర'. హార్రర్, థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలోని హీరోగా రవి, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి అపూర్వ, 'బేబీ' శ్రీ హర్షిణి యసిక, రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించారు విచిత్ర' ఒక ఆత్మీయమైన అమ్మ సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా. ప్రతి



కుటుంబం తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఆలోచించేలా చేసే హృదయాన్ని తాకే కథ ఇది. ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ చూసే ఫ్యామిలీ డ్రామాగా విచిత్ర నిలుస్తుందనే నమ్మకం ఉందని దర్శక, నిర్మాత సైఫుద్దీన్ అన్నారు. ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుందని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ కడిమిశెట్టి లక్ష్మి నారాయణ, సంగీతం నిజాని, అంజన్, నిర్మాత దర్శకత్వం సైఫుద్దీన్ మాలిక్.

## షూటింగ్ సెట్‌లో నాగ చైతన్య జన్మదిన వేడుకలు




అక్కినేనీ నట వారసుడు నాగచైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో నాగ చైతన్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. సినిమా యూనిట్ సభ్యులు అందరూ పాల్గొన్న ఈ జన్మదిన వేడుకల సందర్భంగా నాగ చైతన్య కేక్ కట్ చేశారు. యూనిట్ సభ్యులు అందరూ నాగ చైతన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్తిక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నాగ చైతన్య సరసన మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. నాగ చైతన్య భవిష్యత్తులో మరిన్ని గొప్ప గొప్ప సినిమాలు చేయాలని యూనిట్ సభ్యులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# సాయుధ పోరాటం అనేక ఉద్యమాలకు నెలవు



### ప్రచారజాతలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలివుల్లా ఖాద్రి

ప్రజాపక్షం/తుంగతుర్తి: భారత దేశానికి మొదటగా సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని గర్జించిన తొలి పార్టీ సిపిఐ అని, దేశంలో ఆవిర్భవించి 100 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలివుల్లా ఖాద్రి పిలుపునిచ్చారు. పార్టీ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా చేపట్టిన జాతా ఆదివారం తుంగతుర్తి, తిరుమలగిరి మున్సిపల్ కేంద్రాలకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తికై నిజాంను గద్దె దించడానికి జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణత్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి కలిగించడం జరిగిందని వారు అన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని చెప్పారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు నెలవైందన్నారు. ఫలితంగా అనేక మంది వీరులు జన్మించిన గడ్డ ఇదని, ఈ స్ఫూర్తితోనే తెలంగాణ అంటే పోరాటాల గడ్డగా బాసిలిందని చెప్పారు. తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు సింగరేణి కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందని చెప్పారు. యుపిఎ1 ప్రభుత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం, అటవీ హక్కు చట్టం తీసుకురావటానికి సిపిఐ కృషి చేసిందని గుర్తుచేశారు. అటవీ హక్కు చట్టం ద్వారా దేశంలోని గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 50లక్షలకుపైగా కుటుంబాలకు కోటి ఎకరాల భూమిపై హక్కును పొందేందుకు చేసిన పోరాటం చరిత్రాత్మకమైందన్నారు. 2014లో ప్రతి కుటుంబానికి రూ. 15లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ఏ ఒక్కటి నెరవేర్చకుండా 6 దశాబ్దాలుగా ప్రజలు, కార్మికులు త్యాగాలతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంక్‌లు, టెలికాం, గనులను, చివరకు రక్షణరంగ పరిశ్రమలను సైతం ప్రైవేట్‌కు కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ సంపదను ఆదాని, అంబానీ కార్పోరేట్ పెట్టుబడిదారులకు దోచిపెట్టిందన్నారు. దేశరక్షణ, సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సిపిఐ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం కోశాధికారి డిజి రాజేంప్రసాద్, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, పార్టీ నియోజక వర్గ ఇంచార్జి యల్లంల యాదగిరి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి, సృజన, అనంతుల మల్లేశ్వరి, ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం, నాయకులు కోట రామస్వామి, ఫయాజ్, ఇక్బాల్, శ్రీకాంత్, మల్లయ్య, మనోజ్ పాల్గొన్నారు.

#### పిచ్చిరెడ్డి పాత్ర మరువలేనిది

తెలంగాణ సాయుధ పోరాటంలో కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి పాత్ర మరువలేనిదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. సిపిఐ 100 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం నాగారంకు చేరుకుంది. నాగారం బంగ్లాలో కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కామ్రేడ్ పిచ్చిరెడ్డి కడవరకు ఎర్రజెండాను వీడకుండా పేదలపక్షాన ఈ ప్రాంతంలో ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుండి నేటి ప్రత్యేక తెలంగాణ పోరాటం వరకు కొనసాగి రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలివుల్లా ఖాద్రి, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం కోశాధికారి డిజి రాజేంప్రసాద్, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, పార్టీ నియోజక వర్గ ఇంచార్జి యల్లంల యాదగిరి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి, సృజన, అనంతుల మల్లేశ్వరి, ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం, నాయకులు కోట రామస్వామి, ఫయాజ్, ఇక్బాల్, శ్రీకాంత్, మల్లయ్య, మనోజ్ పాల్గొన్నారు.



## ఇకపై 'ఒక అవసరం'

(మొదటి పేజీ తరువాయి)

మోదీ అన్నారు. మానవ కేంద్రీకృత అభివృద్ధిని నిర్ధారించడంలో సాంకేతికత కీలక పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

**జి-20లో నూతన డిజిటల్ ఇన్నోవేషన్ కూటమిని ప్రతిపాదించిన ప్రధాని మోదీ**

మూడు దేశాల మధ్య యుపిఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోవిన్ వంటి ఆరోగ్యవేదికలు, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌లు, మహిళల నేతృత్వంలోని సాంకేతిక చొరవలను పంచుకోవడానికి వీలుగా ఐబిఎస్ఎ వంటి డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిపాదించారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, సౌరశక్తివంటి రంగాలలో 40 దేశాలలో ప్రాజెక్ట్‌లకు మద్దతు ఇవ్వడంలో ఐబిఎస్ఎ నిధి కృషిని ప్రశంసించారు. దక్షిణదక్షిణ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయం కోసం ఇండియా-బ్రెజిల్ మరియు సౌత్ ఆఫ్రికా నిధిని ఆయన ప్రతిపాదించారు.ఆఫ్రికా గడ్డపై జరిగిన మొదటి జి20శిఖరాగ్ర సమావేశంతో సమానంగా ఇది సమానంగా జరిగినందున భారతదేశం-బ్రెజిల్-సౌత్ ఆఫ్రికా సమావేశం సకాలంలో జరిగిందని మోదీ అభివర్ణించారు. ప్రపంచ దక్షిణ దేశాలు వరుసగా నాలుగు జి20 అధ్యక్ష పదవులన చేపట్టాయి. అయితే వాటిలో చివరి మూడు ఐబిఎస్ఎ సభ్యులవే. దీని ఫలితంగా మానవ కేంద్రీకృత అభివృద్ధి, బహుపాక్షిక సంస్కరణలు, స్థిరమైన వృద్ధిపై దృష్టి సారించిన అనేక ముఖ్యమైన కార్యక్రమాలు వచ్చాయని ఆయన చెప్పారు.

**ఐబిఎస్ఎ మూడు ప్రధాన ఆర్థికవ్యవస్థలను అనుసంధానించే ఒక ముఖ్య వేదిక : మోదీ**

ఐబిఎస్ఎ కేవలం మూడు దేశాల సమూహం కాదని, మూడు ఖండాలు, మూడు ప్రధాన ప్రజాస్వామ్య దేశాలు, మూడు ప్రధాన ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించే ముఖ్యమైన వేదిక అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. సురక్షితమైన, విశ్వసనీయమైన మానవ కేంద్రీకృత ఏఐ నిబంధనల అభివృద్ధికి దోహదపడే సమూహం సామర్థ్యాన్ని ఆయన నొక్కిచెప్పినప్పటికీ వచ్చే ఏడాది భారతదేశంలో జరుగనున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు మోదీ ఐబిఎస్ఎ నాయకులను ఆహ్వానించారు. ఐబిఎస్ఎ ఒకదానికొకటి అభివృద్ధిని పూర్తిచేయగలదని, స్థిరమైన వృద్ధికి ఒక ఉదాహరణగా మారగలదని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. చిరుధాన్యాలు, సహజ వ్యవసాయం, విపత్తు, స్థితిస్థాపకత, గ్రీన్ ఎనర్జీ, సాంప్రదాయ మందులు, ఆరోగ్య భద్రత వంటి రంగాలలో సహకార అవకాశాలను గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో మోదీ చర్చలు**

జొహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన జి20శిఖరాగ్ర సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో సమావేశం అయ్యారు. ఇరుదేశాల నేతలు వాణిజ్యం, పెట్టుబడి, మైనింగ్, కీలకమైన ఖనిజాలు, ఏఐ, ఆహార భద్రత సహా వివిధ రంగాలలో సహకారం గురించి సమావేశంలో చర్చించారు. తన సమావేశం అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోషల్ మీడియాలో 'జొహన్నెస్ బర్గ్‌లో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో ఒక అద్భుతమైన సమావేశం జరిగింది' అని పోస్ట్ చేశారు. భారతదేశందక్షిణ ఆఫ్రికా భాగస్వామ్యం పూర్తి శ్రేణిని మేము ఇరువురం సమీక్షించాం. ముఖ్యంగా వాణిజ్యం, సంస్కృతి, పెట్టుబడి, సాంకేతికత, నైపుణ్యం, ఏఐ, క్లిష్టమైన ఖనిజాలు, మరిన్నింటిలో సహకారాన్ని వైవిధ్యపర్చేవిషయంలో చర్చలు జరిగినట్లు మోదీ జోడించారు. ఈ సంవత్సరం జి20శిఖరాగ్ర సమావేశానికి అధ్యక్షత వహించి విజయవంతం చేసిందుకు ప్రధానమంత్రి మోదీ సిరిల్ రామఫోసాను అభినందించారు. న్యూఢిల్లీ జి20శిఖరాగ్ర సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడానికి దక్షిణ ఆఫ్రికా జి20శిఖరాగ్ర సమావేశం ప్రయత్నాలను కూడా ఈ సందర్భంగా మోదీ అభినందించారు. అంతకుముందు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఉల్లాసమైన, ఉత్పాదక సమావేశం' నిర్వహించారని చెప్పారు.




## ఎఐటియుసి పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో వంద సంవత్సరాలుగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని అన్నారు. మావోయిస్టులు ఆయుదాలను వదిలి జనజీవన స్రవంతి లోకి వచ్చి కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి చేయాలని కోరారు.బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కాగార్ ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆపరేషన్ కగారు పేరుతో వందలాది మందిని చంపుతున్న సుప్రీం కోర్టు సుమోటోగా కేసును స్వీకరించడం లేదని అన్నారు. దేశంలో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల అభ్యున్నతికి వంద సంవత్సరాలుగా పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. బిజెపి లాంటి మతోన్మాద పార్టీలు మతోన్మాదాన్ని ముందు పెట్టి అభ్యుదయ వాదులందరినీ లేకుండా చేస్తుందని బిజెపి అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయన అన్నారు గోదావరిఖనిలో వంద కుటుంబాలకు సన్మానం చేసి కమ్యూనిస్టు కుటుంబాలుగా తీర్చిదిద్దిన స్థానిక నేతలను ఆయన అభినందించారు. రాబోయే కాలంలో కమ్యూనిస్టు పార్టీని పారిశ్రామిక ప్రాంతంలో బలోపేతం చేయాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు ఏఐటియుసి మాత్రమే సాధించిందని మరిన్ని కార్మికుల హక్కుల సాధన నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలకు దేశ వ్యాప్తంగానే కాకుండా 42 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎగిరే జండా ఎర్ర జెండా మాత్రమేనని సుదీర్ఘ త్యాగాలు కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ మాట్లాడుతూ సింగరేణి లో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగ రీత్యా గోదావరిఖని కి వచ్చి స్థిరపడ్డ కార్మిక కుటుంబాల ఐక్యత కోసం ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరంగా ఉందని, ఇంట్లో ఉన్న మహిళల ప్రోత్సాహంతోనే వివిధ రంగాల్లో పురుషులు రాణిస్తున్నారని, మగ వారితో పాటు ఆడవారు కూడా పార్టీ, యూనియన్ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. ఎన్నడు లేని విధంగా ఇంత పెద్ద ఎత్తున కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు ఈ సమ్మేళనంలో పాల్గొనడాన్ని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్ ప్రకాష్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, కన్నం లక్ష్మి నారాయణ, కందుకూరి రాజారత్నం, మోటపలుకుల రమేశ్, రంగు శ్రీను, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, విజయలక్ష్మి, ప్రీతం, సూర్య, ఎం.ఎ.గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, డప్పు రాజు, జూల మోహన్ తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com